అనుదినం... జనస్వరం

నవతెలంగాణ


www.navatelangana.com

సోమవారం 29-1-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 338 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

నవ కేరళ నిర్మాణానికి కేంద్రం అడ్డంకులు

- రుణ పరిమితిని తగ్గించింది
- పన్నుల్లో వాటానూ కుదించింది : కేరళ సీఎం పినరయి ఆరోపణ



తిరువనంతపురం : నవ కేరళ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అందుకు కేంద్ర విధానాలు అవరోధంగా ఉన్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. పన్ను ఆదాయం, ఉత్పత్తి విషయాలలో రాష్ట్రం మంచి ఫలితాలు సాధించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఆర్థిక ...3లో

మరింత బలపడతాం



మేం నిరాశపడటంలేదు.. ఇలా జరుగుతుందని మాకు ముందే తెలుసు

- ఐక్యత కోసమే ఎక్కడా మాట్లాడలేదు
- ఆయనొక అయారాం గయారాం
- ఊసరవెల్లితో పోటీపడుతున్నారు : నితీశ్ నిష్క్రమణపై ఇండియా ఫోరమ్ నేతలు

న్యూఢిల్లీ : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ బీజేపీ పంచకు చేరడంతో తాము మరింత బలోపేతమయ్యామని ఇండియా ఫోరమ్ నేతలు అంటున్నారు. ఒక దశలో ఇండియా ఫోరమ్ కన్వీనర్ పదవికి కూడా నితిష్ పేరు వినిపించిన సంగతి తెలిసిందే. తాజా పరిణామాల అనంతరం మీడియాతో మాట్లాడిన పలువురు ఇండియా ఫోరమ్ నేతలు అధికారం కోసం దేశ వ్యాప్తంగా బీజేపీ చేస్తున్న కుట్రలను ఈ వ్యవహారంతో ప్రజానీకం స్పష్టంగా అర్థం చేసుకుంటారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నితీష్ బీజేపీ వద్దకే చేరుతారన్న సమాచారం తమ వద్ద ముందే ఉందని, అందువల్ల ఈ పరిణామం తమను ఏమాత్రం ఆశ్చర్యపరచలేదని కూడా ఇండియా కూటమి నేతలు చెబుతున్నారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ తరహా వ్యాఖ్య చేయడం గమనార్హం. ఆదివారం ఉదయం వరకు నితీష్‌కుమార్ మంత్రివర్గంలో డిప్యూటీ సిఎంగా బాధ్యతలు నిర్వహించిన ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ 'ఈ పరిణామంతో మేం నిరాశ చెందడం లేదు.' అని చెప్పారు. 'మాకు ఆయన మీద కోపం లేదు. మేం కూటమి ధర్మాన్ని పాటిస్తూనే వచ్చాం. ఆయన బీజేపీ వద్దకు వెళ్లారు. మేం ప్రజల వద్దకు వెళ్తాం. ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. 2024 ఎన్నికలతో జేడీయూ కథ ముగుస్తుంది.' అని అన్నారు. 'ఒకరకంగా ఈ పరిణామం ఇండియా ఫోరమ్‌ను మరింత బలోపేతం చేసింది. దీనికి దోహదం చేసిన బీజేపీకి నేను ధన్యవాదాలు చెబుతున్నా.' అని చెప్పారు. నితీష్ కుమార్ నిష్క్రమిస్తారన్న సమాచారం తమకు ముందే ఉందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. ఇటువంటి అయారాం, గయారాంలను దేశం చాలా మందిని చూసిందని పేర్కొన్నారు. 'లాలూజీ, తేజస్వీ ఈ విషయాన్ని మాకు చాలా ముందుగానే చెప్పారు. ఇండియా ఫోరమ్‌ను ఐక్యంగా ఉంచాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకే, ఈ విషయం గురించి మేం ఎక్కడా మాట్లాడలేదు. మాతో ఉండదల్చుకుంటే ఉంటాడు. వెళ్లిపోవాలనుకుంటే వెళ్లిపోతాడనుకున్నాం. ఇప్పుడు అదే జరిగింది.' అని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై. రామ్ రమేష్ "ఊసరవెల్లితో నితిష్ పోటీపడుతున్నారు" అని వ్యాఖ్యానించారు. శివసేన (ఉద్ధవ్‌థాక్రే) నేత సంజయ్ రౌత్ నితీష్‌ను 'పల్టురామ్'అంటూ గతంలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యను గుర్తుచేశారు. రాముడు, రామరాజ్యం గురించి బీజేపీ నేతలు ఒకవైపు మాట్లాడుతూ మరోవైపు పల్టురామ్‌లతో చేతులుకలుపుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. డీఎంకే నేత ఎలన్‌గోవన్ ఇండియా ఫోరమ్‌ను చూసి బీజేపీ భయపడుతోందనడానికి నితీష్ ఉదంతమే నిదర్శనమని వ్యాఖ్యానించారు.



కక్కిన కూడు తినేందుకే నితీష్‌కుమార్ ఎన్డీఏలోకి..

- ఇండియా కూటమిని బలహీనంచేసి గెలవాలనే బీజేపీ కుట్ర : సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

వివరాలు 3లో

చెత్త తిరిగి చెత్తబుట్టనే చేరింది

ఆర్‌జేడీ నేత లల్లూ ప్రసాద్ యాదవ్ కూతురు రోహిణి ఆచార్య ఒక ట్వీట్‌లో 'చెత్త తిరిగి చెత్తబుట్టనే చేరింది. కంపుగొడుతున్న చెత్తను పొందినందుకు చెత్తబుట్టకు అభినందనలు' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్‌లో ఆమె చెత్తబుట్ట పేరునుగానీ, బీజేపీని గానీ ప్రస్తావించలేదు. అయితే, ఆ తరువాత చేసిన మరో ట్వీట్‌లో గతంలో నితీష్‌కుమార్‌గురించి లాలు చేసిన ట్వీట్‌ను ఆమె రీ ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'పాము కుబుసం విడిచినట్టు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నితిష్ పార్టీ మారుతారు.' అని పేర్కొన్నారు.


తొమ్మిదోసారి నితీష్ ప్రమాణం

బీజేపీతో జట్టు కట్టి బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటు

- కమల దళానికి రెండు ఉప ముఖ్యమంత్రి పదవులు
- నితీష్ వైఖరిపై మండిపడిన కాంగ్రెస్, ఆర్జేడీ

పాట్నా : బీహార్‌లో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ హైడ్రామాకు తెర పడింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష ఇండియా కూటమికి గుడ్‌బై చెప్పిన ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్ కుమార్ మరోసారి ఎన్డీఏ గూటికి చేరారు. 18 నెలల క్రితం ఏ బీజేపీతో తెగతెంపులు చేసుకొన్నారో ఇప్పుడు అదే పార్టీతో చేతులు కలిపి తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. సంవత్సరన్నర క్రితం లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వం లోని ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కలిసి మహా ఘట్‌బంధన్‌ను ఏర్పాటు చేసి, రాష్ట్ర పగ్గాలు చేపట్టిన నితీష్ తాజాగా ఆ మైత్రీబంధానికి స్వస్తి చెప్పారు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న కమలదళం ఆయనకు మద్దతు అందించింది. అందుకు ప్రతిగా రెండు ఉప ముఖ్యమంత్రి పదవులు పొందింది.

ఆదివారం ఉదయం నుంచి బీహార్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. ఉదయం జేడీయూ శాసనసభాపక్ష సమావేశం అనంతరం నితీష్ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. తనకు మద్దతు ఇస్తూ ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలను గవర్నరుకు అందజేశారు. సాయంత్రానికి మళ్లీ రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖమంత్రులుగా ప్రమాణం చేశారు. నితీష్ క్యాబినెట్‌లో బీజేపీకి చెందిన ముగ్గురు, జేడీయూకు చెందిన ముగ్గురు, జితన్‌రామ్ మంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ ఆవామ్ మోర్చా నుండి ఒకరు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే మంత్రులుగా చేరారు. వారి చేత గవర్నర్



ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, స్థానిక బీజేపీ నేతలు, లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు చిరాక్ పాశ్వాన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఆర్జేడీ బహిష్కరించగా కాంగ్రెస్ గైర్హాజరు అయింది.

ఉదయం గవర్నర్‌కు రాజీనామా లేఖను అందజేయడానికి ముందు నితీష్ విలేకరులతో మాట్లాడుతూ మహా కూటమిలోనూ, ఇండియా కూటమిలోనూ తనకు సౌకర్యంగా లేదని వ్యాఖ్యానించారు. అందుకే బీజేపీతో జట్టు కట్టానని చెప్పారు. ప్రమాణ స్వీకారం అనంతరం నితీష్, బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రులు మాట్లాడుతూ తామంతా కలిసే ఉంటామని తెలిపారు. కాగా నూతన ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. ఈ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నిబద్ధతతో సేవలు అందిస్తుందన్న నమ్మకం తనకు ఉన్నదని తెలిపారు.

రాష్ట్రాల వారీగా సీట్ల పంపకాలపై చర్చలు

కేరళ గవర్నర్ తీరు రాజ్యాంగ విరుద్ధం : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

- కేరళలో ప్రారంభమైన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు

తిరువనంతపురం : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రాల వారీగా సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతున్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. కేరళ గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మూడు రోజుల పాటు జరిగే సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాలు కేరళ తిరువనంతపురంలోని ఈఎంఎస్ అకాడమీలో ఆదివారం ప్రారంభమయ్యాయి. త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశాల్లో.. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాజకీయ నివేదికను ప్రవేశపెట్టారు. సమావేశాల సందర్భంగా సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ దేశంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులపై కేంద్ర కమిటీ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. అలాగే లోక్‌సభ ఎన్నికలు, బీహార్ పరిస్థితులు, ఇండియా ఫోరం గురించి కూడా చర్చిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రాల వారీగా సీట్ల పంపకాలపై చర్చలు జరుగుతున్నాయనీ, పెద్దగా ఇబ్బందులులేమీ ఉండవని భావిస్తున్నట్టు తెలిపారు. కేరళ గవర్నర్



అప్రజాస్వామిక వైఖరి అవలంబిస్తున్నారన్నారని విమర్శించారు. ప్రజల సమస్యలకు సంబంధించిన బిల్లులపై సంతకాలు చేయకుండా నిలుపుదల చేశారని అన్నారు. దీనికి సంబంధించి కోర్టు అఫిడవిట్ కోరగా.. ఒక బిల్లుపై సంతకం చేసి మిగిలిన బిల్లులపై రాష్ట్రపతికి పంపినట్టు తెలిపారు.



గ్రామ పంచాయితీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

- ప్రత్యేకాధికారుల పాలన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామపంచాయితీల కాలపరిమితి 2024 జనవరి 31తో పూర్తవుతున్నందున తక్షణమే ఎన్నికలను నిర్వహించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలక వర్గాలను రద్దు చేసి, ప్రత్యేక అధికారులను నియమించాలని, కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలెన్నుకున్న పాలకవర్గాల స్థానంలో ప్రత్యేక అధికారుల పాలనను సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. '73వ రాజ్యాంగ సవరణ ప్రకారం గ్రామ పంచాయితీలకు విధిగా ప్రతీ ఐదేండ్లకొకసారి ఎన్నికలు జరిపి, ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకవర్గాలను ...11లో

ఈజ్ ఆఫ్ జస్టిస్ పౌరుల హక్కు

సుప్రీంకోర్టు వజ్రోత్సవంలో ప్రధాని మోడీ



- న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రస్తుత రాజ్యాంగ భద్రతలు సరిపోవు : సీజేఐ డివై చంద్రచూడ్
- ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలని పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సులభతరమైన న్యాయం (ఈజ్ ఆఫ్ జస్టిస్) ప్రతి పౌరుడి హక్కు అనీ, దీనికి సుప్రీంకోర్టు ప్రధాన మార్గంగా వ్యవహరిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. పాత చట్టాల నుంచి కొత్త పాలనకు ఇబ్బందులు లేకుండా ఉండాలనీ, భాగస్వాములందరి కోసం సామర్థ్యాన్ని ...3లో

మేనేజ్‌మెంట్ కోటాలో రేవంత్ సీఎం అయ్యాడు!

24ఏండ్లు పనిచేసిన కారుకు సర్వీసింగ్ అవసరం పడదా

- బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ మీటింగ్‌లో కేటీఆర్ వ్యాఖ్యలు
- అవినీతి జరిగితే ఎంక్వైయిరీ చేసి చర్యలు తీసుకోవాలని సవాల్
- ఒకరిద్దరు పోయినా పర్వాలేదు.. కొత్తవారిని తయారుచేసుకుందాం
- ఐదేండ్లు ప్రజలపక్షాన ఉండి పోరాడుతాం



నవతెలంగాణ - సిరిసిల్ల

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అప్పటి ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాగూర్‌కు రూ.50 కోట్లు ఇచ్చి మేనేజ్‌మెంట్ కోటాలో రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడని, మూడు ...11లో

ఏడు రోజుల్లో రాష్ట్ర బకాయిలు చెల్లించండి

- లేదంటే నిరసనలకు
- కేంద్రానికి పశ్చిమ బెంగాల్ సీఎం హెచ్చరిక

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని సర్కారుకు హెచ్చరికలు పంపారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను క్లియర్ చేయకపోతే తమ పార్టీ నిరసనలకు దిగుతుందని తెలిపారు. ఇందుకు ఆమె కేంద్రానికి ఏడు రోజుల సమయాన్ని విధించారు. రాజ్‌భవన్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే కార్యక్రమం సందర్భంగా మమత.. కేంద్రానికి ఈ అల్టీమేటం జారీ చేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ లెక్కల ప్రకారం.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రూ. 9330 కోట్లు, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కింద రూ. 6900 కోట్లు, జాతీయ ఆరోగ్య మిషన్ కింద రూ. 830 కోట్లు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ. 770 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ. 350 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం కింద రూ. 175 కోట్లు రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సి ఉన్నది. కాగా, ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ రాష్ట్రాల పట్ల చిన్న చూపు చూస్తున్న కేంద్ర తీరును అడ్డుకోవాలని కేరళ సీఎం పినరయి విజయన్ ఇప్పటికే పిలుపునిచ్చిన విషయం విదితమే.

'ధన్యవాదాలు తేజస్వీ'

- బీహార్ రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో ఆర్జేడీ పత్రికా ప్రకటనలురి

పాట్నా : బీహార్‌లో రాజకీయాలు ఆసక్తికరంగా కొనసాగుతున్న తరుణంలో పత్రికల్లో లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ పత్రిక ప్రకటనలు వెలుగు చూశాయి. పలు పత్రికల్లో ఆర్జేడీ యువ నాయకుడు, లాలూ చిన్న కుమారుడు తేజస్వీ యాదవ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పలు వార్త పత్రికల్లో ఆదివారం ఫుల్ పేజ్ యాడ్‌లు కనిపించాయి. 'మహాఘట్‌బంధన్' ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఆయన చేసిన పనులను వివరిస్తూ ఆ యాడ్‌లో రాతలు ఉన్నాయి. ఆర్జేడీ రాష్ట్ర శాఖ, మహాఘట్‌బంధన్ పరివార్ నుంచి ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ ప్రకటనలు కనిపించాయి.

వంతెన లేక... కాలువలో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-వెంకటాపురం



ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధి పాలెంవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలవలో పడి బాలుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...వెంకటాపురం ఒంటిమామిడి గ్రామానికి చెందిన రామకృష్ణ, రాధ దంపతుల కుమారుడు మనిత్(2) స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు బాలుడి ఆచూకీ కోసం గ్రామ సమీపంలోని పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువలో వెతకగా మృతదేహం లభ్యమైంది. కాలువ దాటేక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి వరద ఉధృతికి కొంత దూరం కొట్టుకు వెళ్లి ఉంటాడని భావిస్తున్నారు. బాలుడి మృతితో బాధిత కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఆర్ అశోక్ సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సర్పంచ్ కొరస నరసింహ మూర్తిని ఎస్సై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒంటిమామిడి గ్రామాన్ని రెండుగా చేస్తూ మధ్యలో పాలెం ప్రాజెక్టు ప్రధాన కాలువను ఏర్పాటు చేశారు. అవతల వైపు ఉన్న గిరిజనులు, ఇటు రావాలన్నా ఇటు ఉన్నవారు అటు వెళ్లాలన్నా కాలువపై గిరిజనులు విరిగిపోయిన విద్యుత్ స్తంభాలతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక వంతెన దాటాల్సిందే. అలా దాటుతున్న క్రమంలో గతంలో సైతం ఒక బాలుడు మతి చెందాడు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పాలెం ప్రాజెక్టుపై వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని సర్పంచ్ కొరస నరసింహమూర్తి కోరారు.

గంగాజలంతో తిరుగు పయనమైన మెస్రం వంశీయులు



నవతెలంగాణ-జన్నారం

గంగాజల తీసుకురావడానికి ఈ నెల 21న కేస్లాపూర్ నుంచి కాలినడకన పయనమైన మెస్రం వంశీయులు ఆదివారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మురిమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. వారికి తుడుందెబ్బ నేతలు మెస్రం రాజకుమార్, మాణిక్యం రాజేశ్వర్లు స్వాగతం పలికారు. గోదావరి సమీపంలో ఉన్న అత్తమడుగు నుంచి గంగాజలాన్ని తీసుకుని కేస్లాపూర్‌కు తిరిగివెళ్లారు. గోదావరి తీరంలో ప్రత్యేక పూజలు చేసి, అనంతరం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రాదేవి ఆలయానికి బయలు దేరారు. ఫిబ్రవరి 8న కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో ఇక్కడి నుండి తీసుకువెళ్లిన గంగాజదానికి మహా పూజ చేసి జాతరను ప్రారంభించనున్నారు. మెస్రం వంశం పీఠాధిపతి మెస్రాణ మొకహ్రావు పటేల్, మెశ్రిం వంశీయులు బిన్ను పటేట్, బాజీరావు, లింగారావు, కకోడ కోసిరావు, హన్మంతరావు, రాదారావు, ధర్మ, కోత్వాల్, తిరుపతి, గణపతి, మనోహర్, నాగోరావు, జంగు, తుకారాం, సీతారాం, సోనేరావు, ఆనందరావు గంగాజల సేకరణలో పాల్గొన్నారు.

ప్రేమ విఫలం కావడంతో యువతి ఆత్మహత్య


నవతెలంగాణ-రాజేంద్రనగర్



ప్రేమ విఫలమై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హాఫీ హెూమ్ ఫార్చ్యూన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న అతిథి భరద్వాజ్(29) హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆ యువతి ఇటీవల ఒక యువకుడితో ప్రేమలో పడింది. అయితే అతడు మరో యువతితో ప్రేమలో ఉండడాన్ని అతిథి తెలుసుకుని తీవ్ర మనస్థాపానికి గురైంది. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం తర్వాత వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తెరిచి చూడగా అప్పటికే చనిపోయి ఉంది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

7వ అంతస్తు నుంచి పడి ఏసీ టెక్నీషియన్ మృతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్



ఏడవ అంతస్తులో ఏసీ రిపేరింగ్ చేస్తుండగా టెక్నీషియన్ ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహ్మద్ సమ్మద్(26)అనే యువకుడు ఆదివారం శివరాంపల్లిలోని కెస్ వర్క్ అపార్ట్‌మెంట్‌లో ఏడవ అంతస్తులో ఏసీ రిపేరింగ్ చేస్తున్నాడు. రిపేరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి పోయాడు. దీంతో ఘటనా స్థలంలోనే మహ్మద్ సమ్మద్ చనిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిం చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ వ్యవస్థను పటిష్టం చేస్తాం

- ప్రతి గ్రామానికో రెవెన్యూ ఉద్యోగి
- కొద్ది మంది కోసమే ధరణి పుట్టింది
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెవెన్యూ వ్యవస్థను గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేయనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీవాస్‌రెడ్డి తెలిపారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రపొందించిన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్న వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొంతమంది చేసిన తప్పులకు అందరిని బలి చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ శాఖ ఉద్యోగిని తిరిగి నియమించేలా చర్యలు చేపడుతుందని చెప్పారు. ధరణి లొసుగులను అడ్డంపెట్టుకుని కొంతమంది ప్రభుత్వ భూములు మాయం చేశారని విమర్శించారు. ధరణిని ప్రక్షాళన చేసి, భూములను కోల్పోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు జీతాలు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలన వల్లనే అధికార మార్పిడి..

- ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ - హుజురాబాద్

గత ప్రభుత్వంలో నిరంకుశ పాలన వల్లే ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో పీవీ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో 'ప్రజాస్వామిక పాలన.. ఉద్యమకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలు అనుసరించిందన్నారు. దీంతో నేడు ప్రజల మధ్య సమస్యలు ఏర్పడ్డాయని.. అవి ఇప్పటికీ మండుతూనే ఉన్నాయని అన్నారు. జిల్లాల పునర్విభజన అనేది ప్రజల ఆకాంక్ష మేరకు అస్తిత్వాల మనుగడ కోసం ఆత్మగౌరవం కోసం ఏర్పడాలి కానీ గత పాలకులు జిల్లాల ఏర్పాటు సమయంలో ఆకాంక్షలను ప్రజల వినతులను విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. ఏ రాజకీయ నాయకుడైనా మూలాలు మరిచిపోతే మూలకు పడతామని..

ఆ విషయం కేసీఆర్ తెలుసుకోవాలని సూచించారు. మన ఎదుగుదలకు స్ఫూర్తినిచ్చిన వారి ప్రయోజనాలు మరిచిపోతే గట్టి బుద్ధి చెబుతారని అన్నారు. అధికారాన్ని ప్రజల కోసం ప్రజల అవసరం కోసం వాడాలి గాని వ్యక్తిగత స్వార్థం కోసం కాదని ఆయన అన్నారు. సమావేశంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు, జేఏసీ నాయకులు ఆవునూరు సమ్మయ్య, పివి జిల్లా సాధన సమితి జేఏసీ అధ్యక్షుడు భీమోజు సదానందం, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, పొడిశెట్టి వెంకట్రాజం, పలకల ఈశ్వర్‌రెడ్డి, వర్దినేని రవీంద్రరావు, రవీందర్‌రెడ్డి, అంతం లింగారెడ్డి మార్త రవీందర్, వేల్పుల ప్రభాకర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోదండరామ్‌తో 98డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు

పట్టణానికి వచ్చిన ఎమ్మెల్సీ కోదండరాంను 98డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు కలిసారు. తమకు ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరాలని విజ్ఞప్తి చేశారు.

సూర్యాపేటలో ఉద్రిక్తత..

- 45వ వార్డు కౌన్సిలర్ ఇంటి ముందు ధర్నాకు దిగిన అసమ్మతి కౌన్సిలర్లు
- ఇంటిపై చెప్పులు, కోడి గుడ్లతో దాడి
- పోలీసుల ముందే తోపులాట

నవతెలంగాణ-సూర్యాపేట

సూర్యాపేటలో అవిశ్వాసానికి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లు, అవిశ్వాసాన్ని వ్యతిరేకించిన కౌన్సిలర్ల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ అన్నపూర్ణ, వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగింది. శిబిరంలో ఉన్న 32 మందిలో 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ చివరి క్షణంలో హ్యాండ్ ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం అసమ్మతి కౌన్సిలర్లు మూకుమ్మడిగా పావని నివాసానికి చేరుకున్నారు. నమ్మించి గొంతు కోశావంటూ పావని కపాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఇంట్లోకి చొరబడి కోడిగుడ్లు, చెప్పులు, మట్టితో దాడి చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేశ్వరరావు, సిఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇదే సమయంలో పావనికి మద్దతుగా చైర్ పర్సన్ అన్నపూర్ణతో పాటు వైస్ చైర్మెన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు అక్కడికి చేరుకున్నారు. వారి రాకతో అసమ్మతి కౌన్సిలర్ల ఆందోళన పెరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేతలు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరుగ్రూపుల మధ్య తోపులాట జరిగింది.

ఈ సందర్భంగా అసమ్మతిగ్రూపు చైర్మెన్ అభ్యర్థి కొండపల్లి నిఖిల దిలీప్ రెడ్డి తలకు స్వల్ప గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆమెను మాజీమంత్రి దామోదర్ రెడ్డి పరామర్శించారు. చైర్మెన్ పదవి ఇవ్వనందుకే గైర్హాజరయ్యా: 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కపాకర్ చైర్మెన్ పదవి ఇవ్వనన్నందుకే తాను అవిశ్వాసానికి గైర్హాజరయ్యానని, అగ్ర వర్ణాలకు కాకుండా బీసీ, బహుజనులకు చైర్మెన్ పదవి ఇవ్వాలని తాను కోరగా వారు వ్యతిరేకించారని ఆరోపించారు. అందుకే అవిశ్వాసానికి మద్దతు ఇవ్వలేదని అన్నారు. అలాగే తాను ఎవరి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని అన్నారు. త్వరలోనే బీఎస్పీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతానని తెలిపారు.

కలవరపెడుతున్న నిరుద్యోగం

- గత ఐదేండ్లలో ఉద్యోగ కల్పనలో కానరాని వృద్ధి
- ఉద్యోగాన్ని హక్కుగా గుర్తిస్తేనే సమస్యకు పరిష్కారం



న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగ పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం పరిస్థితి ఇంతలా దిగజారడం ఇదే ప్రథమం. కోవిడ్ సమయంలో విధించిన లాక్‌డౌన్ కారణంగా లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. వారిలో అనేక మందికి నేటికీ సరైన ఉపాధి లభించలేదు. 2023-24లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2019-20లో నమోదైన దాని కంటే 18% అధికంగా ఉండవచ్చునని అంచనా వేస్తున్నప్పటికీ గత ఐదు సంవత్సరాల కాలంలో ఉపాధి కల్పనలో ఏ మాత్రం వృద్ధి లేదని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' అనే సంస్థ తెలిపింది. కోవిడ్ తర్వాత పెద్ద తరహా సంస్థలతో పోలిస్తే చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఉపాధి కల్పన చాలా తక్కువగా ఉండడమే దీనికి కారణం.

దేశంలో 2019 నాటికే నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. 1973లో మొదటిసారి చమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ద్రవ్యోల్బణ మాంద్యం నెలకొంది. అప్పటి నుండి నమోదైన నిరుద్యోగ రేటు కంటే 2019లోనే అధిక రేటు నమోదైంది. నిరుద్యోగ పరిస్థితి దారుణంగా ఉండటానికి మరో కారణం నయా సరళీకరణ విధానాల కారణంగా అనివార్యంగా ఏర్పడిన పరిస్థితులు. ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వం పెత్తనం చెలాయించడం ప్రారంభించినప్పటి నుండి నయా సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చే వరకూ ఉద్యోగాల కల్పనలో వృద్ధి సగానికి సగం తగ్గిపోయింది. అయితే ఈ రెండు కాలాల మధ్య సగటు జీడీపీ వృద్ధి రేటు రెట్టింపు అయిందని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అయినప్పటికీ ఉద్యోగాల కల్పన పడిపోవడం గమనార్హం.

నయా సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత నమోదైన కార్మికుల సగటు వృద్ధి రేటు కంటే ఉద్యోగాల కల్పనలో వృద్ధి తగ్గిపోయింది. వ్యవసాయానికి ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోవడంతో ఆ రంగం కుదేలైపోయింది. దీంతో వ్యవసాయ రంగంపై ఆధారపడిన అనేక మంది కార్మికులు నగరాలు, పట్టణాలకు వలస పోవాల్సి వచ్చింది. అక్కడ వారంతా ఉద్యోగార్థులుగా మిగిలిపోయారు.

నిరుద్యోగాన్ని పెంచిన సాంకేతికత

నయా సరళీకరణ విధానాల కారణంగా భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారులు ప్రవేశించారు. వారంతా తమ అవసరాల కోసం ఉపాధి అవకాశాలు సృష్టించారు. సాంకేతికతలో సాధించిన అభివృద్ధి కార్మికుల ఉత్పాదకతను పెంచినప్పటికీ ఆ సాంకేతికత కారణంగానే చాలా మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. ఎందుకంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వంద మంది చేసే పనిని యాభై మందితోనే పూర్తి చేయవచ్చు. నిరుద్యోగం పెరిగిన నేపథ్యంలో వేతనాల్లో పెరుగుదల లేకుండా పోయింది. వేతన బిల్లులు తగ్గిపోవడంతో పెట్టుబడిదారులు లాభాలు మూటకట్టుకున్నారు. వేతనాల్లో అసమానతలు, కార్మికుల వేతన బిల్లుల్లో తగ్గుదల పెట్టుబడిదారులకు లాభాలుగా మారడం వంటి పరిణామాలతో వినియోగం పడిపోయింది. ఎందుకంటే వేతనాలు బాగా ఉన్నప్పుడే వినియోగంపై వ్యయం పెరుగుతుంది. సాంకేతికత కారణంగా ఉత్పత్తి పెరిగినా అది అంతిమంగా నిరుద్యోగాన్ని పెంచింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో...

పెట్టుబడిదారుల లాభాలు పెరిగితే ఉద్యోగాల కల్పన కూడా పెరుగుతుందని, ఒకవేళ అది తగ్గినా తాత్కాలికమే అవుతుందని కొందరు ఆర్థికవేత్తలు తప్పుడు అంచనాలు వేశారు. అయితే ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదు. సాంకేతికత, యాంత్రీకరణ కారణంగా ప్రారంభమయ్యే నిరుద్యోగ సమస్య అనియంత్రిత పెట్టుబడిదారీ వ్యవస్థలో మరింత పెరుగుతుందే తప్ప తగ్గదు. తక్కువ మందితో పని చేయించుకొని ఎక్కువ లాభాలు ఆర్జించేందుకే పెట్టుబడిదారులు ప్రయత్నిస్తారు తప్ప సాంకేతికతను ఆసరాగా చేసుకొని మరింత మందికి ఉద్యోగాలు కల్పించాలని అనుకోరు.

సోషలిస్టు దేశాల్లో...

సోషలిస్టు వ్యవస్థలో ఇందుకు పూర్తి భిన్నంగా జరుగుతుంది. సాంకేతికత, యాంత్రీకరణ పెరిగితే కార్మికుల పని భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తారు. వారికి విశ్రాంతి సమయాన్ని పెంచుతారు. వేతనాల్లో కోత ఉండదు. అంటే సాంకేతిక మార్పుల కారణంగా సోషలిస్టు వ్యవస్థలో ఉత్పాదకత రెట్టింపు అవుతుంది. అదే సమయంలో నిరుద్యోగం పెరగదు. పని గంటలు తగ్గవు. వేతనాలూ తగ్గవు. కార్మికుల కొరత ఉన్నప్పటికీ ఆధునిక కాలంలో సోవియట్ యూనియన్, ఒకప్పటి తూర్పు యూరోపియన్ సోషలిస్ట్ దేశాల్లో పూర్తి స్థాయిలో ఉపాధి లభించింది. దీనికి భిన్నంగా పెట్టుబడిదారీ దేశాల్లో నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగింది.

హక్కుగా గుర్తిస్తే...

నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలంటే ఉపాధి కల్పనను ఓ హక్కుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దేశంలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించినప్పటికీ అందుకయ్యే ఖర్చు జీడీపీలో 3% మించదు. ఉపాధి పెరిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఫలితంగా వస్తూత్పత్తి పెరుగుతుంది. దీనివల్ల ఉద్యోగాల కల్పన పెరుగుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఓ వ్యక్తికి వేతనం ఇచ్చారనుకోండి.

అతను దానితో తన అవసరాల కోసం వస్తువులు కొనుగోలు చేస్తాడు. వాటి ఉత్పత్తికి డిమాండ్ ఏర్పడుతుంది. ఇది మరి కొందరికి ఉపాధి చూపుతుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వంపై పడే ఆర్థిక భాగం చాలా స్వల్పం. పైగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది. అయినప్పటికీ ప్రభుత్వం ఇందుకు పూనుకుంటుందా అన్నది అనుమానమే. ఎందుకంటే ప్రజలకు ఉపాధి హక్కు కల్పించాలంటే పార్లమెంటులో చట్టాన్ని చేయాల్సి ఉంటుంది. ఇందుకు పాలకులు సిద్ధపడతారా అన్నదే ప్రశ్న.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- స్కీం వర్కర్ల శ్రమ దోచుకుంటున్న కేంద్రం : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు రమ



నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, సేవలు అందజేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాన్ని 26 వేల రూపాయలుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించకుండా వారి శ్రమను దోచుకుంటున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్వీ రమ అన్నారు. ఫిబ్రవరి 16 సమ్మెను జయప్రదం చేసి బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆదివారం మానుకోటలో పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకేపీ, వీఓఏ ఉద్యోగుల సంఘం సమావేశం వెలిశాల సుధాకర్. అంగన్వాడీ యూనియన్ జిల్లా సమావేశం బి.సంపూర్ణ అధ్యక్షతన జరిగింది. త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం దుర్మార్గంగా రద్దుచేసి కార్మికులను కట్టు బానిసలుగా మారుస్తోందని విమర్శించారు. వామపక్షాల కృషి వల్ల వచ్చిన ఉపాధి హామీ చట్టం వలన గ్రామీణ ప్రాంతాల్లో కొద్దో గొప్పో ఉపాధి దొరుకుతుంటే ఈ పథకాన్ని కూడా ఎత్తివేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు మరింత ఐక్యతతో పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు కాసు మాధవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాల తుది ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 7,094 స్టాఫ్ నర్సు ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం నిర్వహించిన పరీక్ష తుది ఫలితాలు విడుదలయ్యాయి. కటాఫ్, ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలెక్షన్ లిస్ట్‌ను రాష్ట్ర మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ఆదివారం విడుదల చేసింది. గతేడాది ఆగస్టు 2న కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించగా దాదాపు 40 వేల మంది అభ్యర్థులు పరీక్ష రాసిన సంగతి తెలిసిందే. నూతనంగా నియమించబడిన స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలను ఈ నెల 31న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ ఎల్.బీ.స్టేడియంలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చొంగ్తూ హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేయనున్నారు. అభ్యర్థులు తమ ఫలితాలను mhsrb.telangana.gov.in వెబ్‌సైట్ లో తెలుసుకోవచ్చు.

గంగ మౌనికకు మొదటి ర్యాంకు

తాజా ఫలితాల్లో సూర్యాపేట పట్టణానికి చెందిన గంగ మౌనిక రాష్ట్రంలో మొదటి ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన లూత్ మేరీ మూడో ర్యాంకు సాధించినట్టు నిధ్యా నర్సింగ్ అకాడమీ డైరెక్టర్ కవితా రాథోడ్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ అకాడమీ నుంచి మొదటి, మూడో ర్యాంకుతో పాటు ఫైనల్ మెరిట్ లిస్టులో 3,800 మంది ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

ధాన్యం బస్తాలు కారుపై పడి వ్యక్తి మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-గీసుగొండ



ధాన్యం బస్తాల లోడుతో వెళున్న లారీలో నుంచి బస్తాలు కారుపై పడగా వ్యక్తి మృతిచెందిన సంఘటన హన్మకొండ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపురం అపెక్స్ కాలేజీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గీసుకొండ ఎస్‌హెచ్‌ఓ కూరవాని రామకృష్ణ కథనం ప్రకారం.... నర్సంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన జినుకల నాగరాజు(55) కుటుంబ సభ్యులతో సహా వేములవాడ వెళ్లి కుమార్తె కొడుకు పుట్టు వెంట్రుకలు ఇచ్చి తిరిగి వస్తున్నారు. హన్మకొండలోని వారి కూతురు నివాసంలో అల్లుడు, కుమార్తె, మనువడిని వదిలి తన స్వగ్రామం నర్సంపేటకు బయలుదేరారు. ఈ క్రమంలోనే మచ్చాపురం అపెక్స్ కాలేజీ మూల మలుపు వద్ద ధాన్యం బాస్తాల లోడుతో వెళ్తున్న లారీలో నుంచి ఒకేసారి కొన్ని ధాన్యం బస్తాలు కారుపై పడ్డాయి. దీంతో కారు నడుపుతున్న కుమారుడి పక్కన కూర్చున్న నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీకాంత్, భార్య లలిత, కోడలు సింధు ముగ్గురికి తీవ్ర గాయాలై కారులో ఇరుక్కుపోయారు. స్థానికుల సహకారంతో వారు కారు నుండి బయటపడ్డారు. అనంతరం వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా నాగరాజు నర్సంపేటలో బిల్డర్‌గా పనిచేస్తున్నారని, కుమారుడు శ్రీకాంత్ నల్లగొండలోని బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, కోడలు సింధు గురిజాల ఏఈవోగా పని చేస్తుంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

కక్కిన కూడు తినేందుకే నితీష్‌కుమార్ ఎన్డీఏలోకి..

ఇండియా కూటమిని బలహీనంచేసి గెలవాలనే బీజేపీ కుట్ర

- వచ్చేనెల 2నుంచి 4వరకు హైదరాబాద్‌లో సీపీఐ జాతీయ సమావేశాలు :విలేకర్ల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇండియా కూటమిలో కీలక పాత్ర పోషించిన బీహార సీఎం నితిష్ కుమార్ 'కక్కిన కూడు తినేందుకే' తిరిగి ఎన్‌డీఏ కూటమిలోకి వెళ్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కమిటీ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, ఈ.టి. నర్సింహతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజకీయాలు వేగంగా మారుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సీపీఐ జాతీయ కమిటీ సమావేశాలు వచ్చే నెల 2నుంచి 4వరకు హైదరాబాద్‌లో జరగనున్నాయని తెలిపారు. ఈ సమావేశాల్లో దేశ రాజకీయ పరిణామాలపై చర్చిస్తామన్నారు. ఓటమి భయంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఇండియా కూటమి'ని బలహీనపర్చేందుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఏం సాధించిందని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగాన్నంతా సర్వనాశనం చేసిందనీ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందని విమర్శించారు. తాము చేసిన అభివృద్ధి ఏమీ లేదుకాబట్టే..రామున్ని ఎన్నికల ప్రచారంలోకి తీసుకొచ్చి గెలవాలనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ ముందే అయోధ్య రామలయాన్ని ప్రారంభించేందుకు మోడీ ప్రభుత్వం ప్రణాలిక రూపొందించుకున్నదని చెప్పారు. ఆలయం పూర్తికాకపోయినా ప్రారంభించారని విమర్శించారు. కేజ్రీవాల్‌తో పాటు జార్కండ్ సీఎంకు కూడా నోటీసులు జారీ చేశారనీ, ఒక్కో ఎంఎల్‌ఏకు రూ.25 కోట్లు ఇచ్చేందుకు బీజేపీ సిద్ధమవుతున్నదని తెలిపారు.దర్యాప్తు సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకోసం వాడుకుంటున్నారని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఐదు పార్లమెంట్ స్థానాల్లో ఒక చోట పోటీచేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. వీటిలో ఏదో ఒకటి సీపీఐకి కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ విశాల దక్పథంతో ఉండాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ఉన్న చిన్న, పెద్ద రాజకీయా పార్టీలను కలుపుకుని ముందుకు సాగాలన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్యాయం జరిగినవారికి న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్‌ఎస్ నేతలు అసంబద్ధంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం పడిపోతుందనే శాపనార్థాలు కుళ్లుబుద్దితో చేసేవని కొట్టిపడేశారు.

నవ కేరళ నిర్మాణానికి కేంద్రం అడ్డంకులు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షోభం ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈ సంక్షోభం రాష్ట్ర ప్రభుత్వ చేతులు కట్టేసిందని చెప్పారు. తప్పుడు విధానాలను వ్యతిరేకించి ప్రజల పక్షాల నిలవాల్సిన ప్రతిపక్షం రాష్ట్ర ప్రభుత్వంపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పినరయి విలేకరులతో మాట్లాడుతూ పదిహేనవ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేరళ తన రాబడిలో 3% వరకూ బేషరతుగా రుణం పొందవచ్చునని, విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసిన పక్షంలో మరో 0.5% పొందవచ్చునని వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వం 2021-22 నుండి కేరళ రుణ పరిమితిని తగ్గించిందని, స్వతంత్ర సంస్థలు తీసుకున్న రుణాలను కూడా రాష్ట్ర రుణ పరిమితితో కలిపేసిందని ఆరోపించారు. ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేరళ మొత్తం రుణ పరిమితి రూ.6,000 కోట్లు తగ్గిపోయిందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 280 ప్రకారం ఏర్పడిన ఆర్థిక సంఘం సిఫార్సులను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తోసిపుచ్చిందని విమర్శించారు.



'నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన కేరళ మౌలిక సదుపాయాల పెట్టుబడి నిధి బోర్డు (కేఐఎఫ్‌బీ) వంటి సంస్థలు తీసుకున్న రుణాన్ని రాష్ట్ర రుణంలో కలపాలని పదిహేనవ ఆర్థిక సంఘం చెప్పలేదు. 2017 ఆగస్టుకు ముందున్న పద్ధతిలోనే రాజ్యాంగంలోని 293 (3), 293 (4) అధికరణల ప్రకారం పబ్లిక్ అకౌంట్, ప్రభుత్వ రంగ సంస్థల రుణాలను రాష్ట్ర ప్రభుత్వ రుణ పరిమితి నిర్ధారణ నుండి మినహాయించాలి. అయితే కేంద్ర ఆర్థిక శాఖ ఓ కార్యనిర్వాహక ఆదేశం ద్వారా తప్పుడు వైఖరిని అవలంబించింది. నిర్దిష్ట ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసిన సంస్థలు సొంతంగా తీసుకున్న రుణాలను కూడా రాష్ట్ర ప్రభుత్వ రుణంలో భాగంగా మార్చేసింది' అని పినరయి వివరించారు. తద్వారా రాష్ట్ర రుణ పరిమితిని కేంద్రం కుదించిందని ఆరోపించారు.

జాతీయ రహదారి-66 అభివృద్ధి కోసం భూసేకరణ నిమిత్తం కేంద్రం 25% సొమ్ము కోరిందని, ఇందుకోసం కేఐఎఫ్‌బీ ద్వారా 5,854 కోట్లు సమీకరించామని, అయితే ఈ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వ రుణ హక్కుల నుండి కేంద్రం మినహాయించిందని పినరయి చెప్పారు. పన్ను వనరుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సిన వాటాను కేంద్రం తగ్గించిందని అంటూ 14వ ఆర్థిక సంఘం కాలంలో 42%గా ఉన్న ఈ వాటా 15వ ఆర్థిక సంఘం కాలంలో 41%కి తగ్గిపోయిందని తెలిపారు.

దీనికి తోడు కేంద్ర ఆదాయంలో మూడో వంతును సెస్సు, సర్‌ఛార్జికి బదిలీ చేశారని, అయితే వీటిని రాష్ట్రాలతో పంచుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. పన్ను పంపిణీకి 2011 జనాభా లెక్కలను బీజేపీ ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకున్నదని, ఫలితంగా రాష్ట్ర పన్ను ఆదాయం తగ్గిందని పినరయి చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా కాంగ్రెస్ నేత మల్లు రవి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లోని గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుద్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధు యాష్కీ గౌడ్ తదితరులు మల్లు రవిని అభినందించారు. కార్యక్రమానికి ముందు డప్పు కళాకారుల వాయిద్యాలు, నృత్యాలతో మల్లు రవికి అభిమానులు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమం అనంతరం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ తనను ప్రత్యేక ప్రతినిధిగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో నాలుగేండ్ల ప్రత్యేక ప్రతినిధిగా పనిచేసిన అనుభవం తనకు ఉందనీ, ఆ అనుభవంతో కేంద్ర ప్రభుత్వంలోనూ మంత్రులు, అధికారులతో మాట్లాడి తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు అనేక నీటి పారుదల ప్రాజెక్టులు, ఆర్థిక, రక్షణ శాఖకు చెందిన అనేక అంశాలు పెండింగ్‌లో ఉన్నందున ప్రత్యేక ప్రతినిధిగా అనుభవజ్ఞుడైన తనకు బాధ్యతలు ఇచ్చారని ఆయన తెలిపారు. తనకు ఉద్యోగం వచ్చినట్టు అనుకోవడం లేదని, తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని ఆయన చెప్పారు.

అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రానికి సైనిక్ స్కూల్, కంటోన్మెంట్ ఏరియాలో రక్షణ శాఖ భూములు వంటి అనేక అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశలో భాగంగానే ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు ప్రధాన మంత్రి ని కలిసి 15 అంశాలతో విజ్ఞాపనలు అందజేశారని తెలిపారు. ఫెడరల్ స్పూర్తితో రాష్ట్రాల అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరుతున్నామన్నారు. అదే విధంగా రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం మీడియా కూడా తమకు సహక రించాలని, వారి దృష్టికి వచ్చిన అంశాలను తమకు తెలపాలని కోరారు. సాధ్య మైనంత ఎక్కువ సమయం అధికారులు, మీడియాకు అందుబాటులో ఉంటానన్నారు.

ఈజ్ ఆఫ్ జస్టిస్ పౌరుల హక్కు

(మొదటి పేజీ తరువాయి)

పెంపొందించడంలో నిమగ్నమవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. సుప్రీంకోర్టు వజ్రోత్సవాలను ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ డిజిటల్ సుప్రీంకోర్టు నివేదికలు (డీజీ ఎస్‌సీఆర్), డిజిటల్ కోర్టులు 2.0, సుప్రీంకోర్టు కొత్త వెబ్‌సైట్ అనే మూడు సాంకేతిక కార్యక్రమాలను ప్రారంభించారు.

ప్రధాని మోడీ మాట్లాడుతూ కాలం చెల్లిన వలస నేర చట్టాలను రద్దు చేయడంలోనూ, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్యా అధీనియం వంటి కొత్త చట్టాలను ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు. ఈ ముఖ్యమైన మార్పులతో దేశంలోని చట్టపరమైన, పోలీసింగ్, పరిశోధనాత్మక వ్యవస్థలు కొత్త శకంలోకి ప్రవేశించాయని చెప్పారు. ఇది ప్రస్తుత పరిస్థితి, ఉత్తమ అవసరాలకు అనుగుణంగా చట్టాల ఆధునీకరణకు ప్రభుత్వంతో నిరంతరం ప్రయత్నిస్తుందని తెలిపారు.



పురోగతులను ఊహించే ఈ-కోర్టుల మిషన్ ప్రాజెక్ట్ రెండో దశ కంటే మూడో దశ నిధుల కేటాయింపు నాలుగు రెట్లు పెరిగిందని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు భవన సముదాయం విస్తరణకు రూ.800 కోట్లకు గతవారం

నేటి ఆర్థిక విధానాలు రేపటి చురుకైన దేశానికి ఆధారం కానున్నాయి. ఈ రోజు నిర్దేశించబడుతున్న చట్టాలు దేశ ఉజ్వల భవిష్యత్తును బలోపేతం చేస్తాయి. పాత చట్టాల నుంచి కొత్త చట్టాలకు అతుకులు లేకుండా ఉండాలి. ఇది అత్యవసరం' అన్నారు. దీన్ని సులభతరం చేయడానికి ప్రభుత్వ అధికారులకు శిక్షణ, సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్టు మోడీ తెలిపారు. రాజ్యాంగ నిర్మాతలు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి సూత్రాలతో స్వతంత్ర దేశం గురించి కలలు కన్నారని అన్నారు. దృఢమైన న్యాయ వ్యవస్థను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) మూలస్తంభమన్నారు. నమ్మకమైన, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మోడీ చెప్పారు. 42 కేంద్ర చట్టాలలోని 183 నిబంధనలను నేరరహితం చేయాలని ప్రతిపాదిస్తున్న జన్ విశ్వాస్ చట్టం పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గిస్తుందని, న్యాయవ్యవస్థ నుంచి అనవసరమైన ఒత్తిడిని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

విలువలు, ఆధునికత కలయికతో చట్టాలు

కోర్టుల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నాం

కోర్టుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోడీ అన్నారు. కోర్టు రికార్డుల డిజిటలైజేషన్, అనేక ఇతర సాంకేతిక ఆమోదం తెలిపిన విషయాన్ని మోడీ గుర్తు చేశారు. 2014 నుంచి కోర్టుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తమ ప్రభుత్వం రూ.7,000 కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. రాబోయే 25 ఏండ్లలో దేశ భవిష్యత్తును రూపొందించడంలో సుప్రీంకోర్టు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. అత్యున్నత న్యాయస్థానం మొదటి మహిళా న్యాయమూర్తి అయిన ఎం ఫాతిమా బీవికి మరణానంతరం పద్మభూషణ్ ప్రదానం చేయడం గర్వకారణమని చెప్పారు.

ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సీజేఐ చంద్రచూడ్ పిలుపునిచ్చారు. న్యాయస్థానాల లోపల, వెలుపల రాజ్యాంగాన్ని సమర్థించే నిబద్ధతను పునరుద్ధరించాలని కోరారు. కేసుల బ్యాక్‌లాగ్, కాలం చెల్లిన విధానాలు, వాయిదాల సంస్కృతితో సహా న్యాయవ్యవస్థను ప్రభావితం చేసే నిర్మాణాత్మక సమస్యలను పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని సమర్థించే ప్రధాన విధులను అత్యున్నత న్యాయస్థానం మరచిపోదని చెప్పారు. లింగం, అంగ వైకల్యం, జాతి, కులం, లైంగికతపై సామాజిక పరిస్థితుల వైఖరులను తెలుసుకోవడానికి న్యాయమూర్తులందరికీ అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

న్యాయం చేయాలనే కోరికే న్యాయమూర్తులు, న్యాయవాదులను కలుపుతుంది

"ఆలోచనల విశ్లేషణను స్వీకరించే సామర్థ్యమే మన బహు స్వభావ బలం. మన కోర్టులోని విశ్లేషణ వైవిధ్యాన్ని ఒకచోట చేరుస్తుంది. అదే న్యాయస్థానం నిజమైన సామాజిక ధర్మం, సామాజిక మనస్సాక్షి. న్యాయస్థానం ఒక ఆత్మగా ఉద్భవించింది. ఇది మన ప్రజలకు న్యాయం జరగాలనే మా కోరికలో న్యాయమూర్తులు, న్యాయవాదులను కలుపుతుంది' అన్నారు. 'కేసుల పెండింగ్‌తో కోర్టు అపారమైన ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ప్రస్తుతం, మొత్తం 65,915 నమోదైన కేసులు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. నిర్ణయం తీసుకునే విధానంలో సమూలమైన మార్పు ఉండాలి. ప్రతి వ్యక్తి కేసులో న్యాయం జరగాలనేదే మా కోరిక" అన్నారు. వాదనల నిడివిని అరికట్టేందుకు సంస్కరణలు అవసరమని, సుదీర్ఘ వాదనలు న్యాయపరమైన ఫలితాల్లో అంతులేని జాప్యానికి దారి తీస్తాయని అన్నారు. అత్యున్నత న్యాయస్థానం విచారించే అంశాల ఎంపికకు పున్ణపరిశీలన అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఒత్తిడి సమస్యలను పరిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సుప్రీంకోర్టు రూపొందించిన గొప్ప న్యాయశాస్త్రం, ఈ నిర్ణయాలను రూపొందించే న్యాయమూర్తుల నైపుణ్యం పనిగా పరిగణించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఎకె సిక్రి, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అజయ్ రస్తోగి, అన్ని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాలా పాల్గొన్నారు.

ఆత్మ పరిశీలన చేసుకోవాలి

న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవడానికి ప్రస్తుత రాజ్యాంగ భద్రతలు సరిపోవని సీజేఐ డివై చంద్రచూడ్ స్పష్టంచేశారు. స్వతంత్ర న్యాయవ్యవస్థ అంటే ఎగ్జిక్యూటివ్, లెజిస్లేటివ్ శాఖల నుంచి ఇన్సులేట్ చేయబడినది. అదే సమయంలో పక్షపాతం లేని న్యాయమూర్తులు కూడా ఉంటారని అన్నారు. 'స్వతంత్ర న్యాయవ్యవస్థ కోసం రాజ్యాంగం నిర్ణీత పదవీ విరమణ వయస్సు, న్యాయమూర్తుల నియామకం తరువాత వారి జీతం మార్పు నిషేధం వంటి అనేక సంస్థాగత రక్షణలను పొందుపరిచింది. అయితే, స్వతంత్ర న్యాయవ్యవస్థను నిర్ధారించడానికి ఈ రాజ్యాంగ రక్షణలు సరిపోవు' అని ఆయన పేర్కొన్నారు.

సీజేఐ డివై చంద్రచూడ్

ఆలయాల అభివృద్ధికి కృషి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నవతెలంగాణ - జోగిపేట

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన అందోల్‌లో శ్రీ గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో టెంకాయ వేలంపాటలో రూ.10,116కు ఆయన దక్కించుకున్నారు. శ్రీ రంగనాథ స్వామి జాతర నూతన రథం కోసం రూ.15 లక్షల విరాళం ప్రకటించి, ముందుగా రూ.2 లక్షలు అందజేశారు. జోగిపేట శ్రీ మల్లికార్జునస్వామి సట్టి ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. శ్రీ మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహించారు. దేవాలయాల కమిటీ నిర్వాహకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ పునర్నిర్మాణం కోసం రూ.2 కోట్ల ప్రతిపాదనలను కమిటీ తరఫున ఆయనకు వినతి పత్రం సమర్పించారు. దేవాలయ నిర్మాణానికి రూ.50 లక్షలు, ప్రహరీకి రూ.కోటి, కమ్యూనిటీ హాల్‌కు రూ.50 లక్షలు వినతిపత్రంలో పొందుపరిచారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అందోల్‌లోని శ్రీ భూనీల సమేత శ్రీ రంగనాథ స్వామి, జోగిపేటలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద జోగిపేట సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, కార్పొరేటర్ పుష్ప నగేష్ యాదవ్, జడ్పిటిసి మీనాక్షి సాయికుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ నాగభూషణం మల్లికార్జున స్వామి దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో పాండు, తహశీల్దార్ అంటోని, కమిషనర్ తిరుపతయ్య, డీఎస్‌పీ రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ లు ఎస్.సురేందర్‌గౌడ్,ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, పి.రేఖా ప్రవీణ్, డి.శంకర్, కె. నాగరాజ్ దుర్గేష్, చందర్, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, తోట్ల మమత రామకృష్ణ, మాజీ ఎంపీటీసీలు డీజీ.వెంకటేశం, గుమాస్తా సంఘం అధ్యక్షుడు డాకూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, కోశాధికారి నర్సింహులు, నాయకులు డీ. శ్రీనివాస్, కష్ణ, రవి, రాములు, చిట్యాల మధు, రాజశేఖర్, చోటుఖాన్, గోహేర్ అలీ, సిహెచ్. శివకుమార్, పాల్గొన్నారు.

జ్ఞానవాపిని హిందువులకు అప్పగించండి : వీహెచ్‌పీ

వారణాసి : జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో ఓ హిందూ దేవాలయం ఉన్నదంటూ భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) నివేదిక ఇచ్చిన నేపథ్యంలో వీహెచ్‌పీ దూకుడు పెంచింది. ఆ మసీదును హిందువులకు అప్పగించాలని డిమాండ్ చేసింది. మసీదును వేరే చోటికి తరలించాలని, ఆ స్థలాన్ని కాశీ విశ్వనాథ కమిటీ లేదా హిందూ సమాజానికి అప్పగించాలని వీహెచ్‌పీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అలోక్ కుమార్ సూచించారు. 'వాజుఖానాగా పిలుస్తున్న శివలింగానికి మసీదు స్వభావమే లేదు. అక్కడి శాసనాల్లో హిందూ పేర్లు కన్పించాయి. అక్కడ దేవాలయం ఉన్నదని చెప్పడానికి ఇవే ఆధారం' అని ఆయన అన్నారు. 1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టం ప్రకారం దీనిని హిందూ దేవాలయంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

నీటి మీద రాతలే...!

దిక్కూ మొక్కూ లేని ప్రధాని గ్యారంటీలు

- కాలగర్భంలో కలసిపోతున్న పథకాలు
- ఆత్మస్తుతి...పరనిందతో కాలక్షేపం

న్యూఢిల్లీ : దేశంలోని రెండున్నర లక్షల పంచాయతీలను చుట్టివచ్చేలా బీజేపీ 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'ను చేపట్టిన విషయం తెలిసిందే. ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పదిహేను వందల వాహనాలను ఉపయోగించారు. జీపీఎస్, డ్రోన్లు వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మోడీ ప్రసంగాలతో, ఆయనను కొనియాడుతూ ఆలపించిన గీతాలతో హోరెత్తించారు. ఈ యాత్ర కోసం ప్రభుత్వ అధికారులను వినియోగించారు. అయితే ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఈ యాత్ర పేరును మోడీ స్వయంగా 'మోడీ కీ గ్యారంటీ వెహికల్'గా మార్చేశారు. అనేక ప్రాంతాల్లో ప్రజలు వాహనాలను ఆపేసి వాహనాలపై భారత్ ప్రభుత్వం అని కాకుండా మోడీ ప్రభుత్వం అని ఎందుకు రాశారంటూ నిలదీశారు.

అహ్మద్‌నగర్, నాసిక్, సతారా, జల్నా, పర్బనీ, అకోలా, హింగోలీ, నాందేడ్, రత్నగిరి, బుల్‌ధానా వంటి చోట్ల ప్రజలు నిరసనలు వ్యక్తం చేశారు. వాహనాల మీద బీజేపీ ఎన్నికల గుర్తు కమలం కన్పించడంపై కొందరు అభ్యంతరం చెప్పారు. నిరసన దృశ్యాలను వీడియో కూడా తీశారు. రాజధాని ఢిల్లీలో గ్యారంటీ వాహనాన్ని పలు చోట్ల అడ్డుకొని నిరసన తెలిపారు. మోడీ ప్రచారం కోసం ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేయడమేమిటని ప్రశ్నించారు.

హామీల స్కోరు 142

గత పది సంవత్సరాల కాలంలో మోడీ ఎన్ని పథకాలు ప్రకటించారో ఎవరికీ తెలియదు. సీనియర్ పాత్రికేయుడు పి.రామన్ లెక్క ప్రకారం మోడీ ఇచ్చిన హామీలు అక్షరాలా 142. 2015, 2016 సంవత్సరాల్లో ప్రకటించిన పథకాల్లో 40 పథకాల లోగోలకు ఆమోదం లభించింది. కనీసం 20 పథకాల పేర్లకు ముందు పీఎం అని జోడించారు. పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన ఇందుకు ఉదాహరణ. మోడీకి ఇష్టమైన పదం 'అమృత్' పేరిట కొన్ని పథకాలు ప్రారంభమయ్యాయి. అమృత్ కాల్, అమృత్ భారత్ రైళ్లు వంటివన్న మాట.

మదింపు, సమీక్షలు ఏవి?

అయితే మోడీ పథకాల అమలును మదింపు చేసిన వారెవ్వరూ లేరు. దానికి సంబంధించిన గణాంకాలు కూడా అందుబాటులో లేవు. దీనిపై ప్రధాన మీడియాలో సైతం వార్తలు రావడం లేదు. మోడీ గ్యారంటీలపై ఏ నాడూ సమీక్ష జరిగిన పాపాన పోలేదు. ఉదాహరణకు గంగానది శుద్ధినే తీసుకుందాం. 2014లో నమామి గంగ పేరిట ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.20,000 కోట్ల వ్యయంతో చేపట్టిన మురుగనీటి శుద్ధి ప్లాంటు పనుల్లో 2021 నాటికి కేవలం 20% మాత్రమే పూర్తయ్యాయి.



కొత్తగా వంద స్మార్ట్ సిటీల ఏర్పాటు అనేది 2015లో మోడీ ఇచ్చిన మరో గ్యారంటీ. ఈ ప్రాజెక్టులో నాలుగు లక్షల కోట్ల రూపాయల కాంట్రాక్టులు దక్కించుకునేందుకు అమెరికా, ఫ్రాన్స్, చైనా వంటి 14 దేశాలు పోటీ పడ్డాయి. ఈ ప్రాజెక్టుకు రుణాలు అందించేందుకు ప్రపంచబ్యాంక్, ఏడీబీ, యూఎస్‌ఏఐడీ వంటి సంస్థలు ముందుకు వచ్చాయి. అయితే ఏమైందో ఏమో కానీ అంతా గప్‌చుప్... ప్రస్తుతం ఉన్న నగరాలనే చిన్న చిన్న ముక్కలుగా విభజించి ఆధునీకరించే పనితో సరిపెట్టారు.

ఈ గ్యారంటీలు ఏమయ్యాయి?

ప్రతి భారతీయుడి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తానన్న మోడీ హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ఆయన హామీపై బీజేపీ నేతలు పరస్పర విరుద్ధ ప్రకటనలు కూడా చేశారు. కొందరు కేంద్ర మంత్రులు దానిని తేలిగ్గా తీసుకున్నారు . మోడీ మాటలు నమ్మిన ప్రజా నీకం మాత్రం బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు క్యూ కట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే మోడీ ఇచ్చిన అనేక హామీలు నీటి మూటలేనని తేలిపోయింది. ముంబయి-అహ్మదాబాద్ మధ్య బులెట్ రైలు ప్రాజెక్టును 2014 సెప్టెంబరులో ప్రకటించారు కానీ దానిని పూర్తి చేయాల్సిన గడువును పెంచుకుంటూ పోతున్నారు. ప్రాజెక్ట్ వ్యయం మాత్రం రూ.1.08 లక్షల కోట్ల నుండి రూ.2 లక్షల కోట్లకు పెరిగింది. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తానని ఇచ్చిన గ్యారంటీకి కూడా అతీగతీ లేదం. ఏడాదికి [illegible]టి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు కానీ తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉండి కూడా దానిని నెరవేర్చలేదు.

ఏదేమైనా ఈ కార్యక్రమం యావత్తూ మోడీకి ప్రాచుర్యం కల్పించేందుకు దోహదపడింది. కేంద్రీకృత అధికారలీలా విన్యాసాల అనివార్యతను చాటిచెప్పింది. మోడీ గతంలో అనేక సందర్భాల్లో స్వీయ పొగడ్తలతో ప్రజలను మెప్పించే ప్రయత్నం చేశారు. అన్ని ఇతర పార్టీలు తప్పుడు హామీలు ఇస్తున్నందున ప్రజలు మోడీ గ్యారంటీలను విశ్వసిస్తున్నారని చెప్పుకొచ్చారు. తన కఠోర శ్రమను, అంకితభావాన్ని, పట్టుదలను ఈ గ్యారంటీ ప్రతిబింబిస్తోందని అన్నారు. ఆశ సన్నగిల్లినప్పుడు మోడీ కీ గ్యారంటీ మొదలవుతుందని తెలిపారు. తాను మాత్రమే హామీని అమలు చేస్తానని ఈ గ్యారంటీ అర్థమని కూడా ఉద్ఘాటించారు. మోడీ గ్యారంటీ సూపర్ హిట్ అయిందని వారణాసిలో చెప్పారు. త్రిస్సూర్‌లో జరిగిన ఓ ర్యాలీలో 19 నిమిషాల పాటు ప్రసంగించిన మోడీ 18 సార్లు మోడీ గ్యారంటీ అనే పదాన్ని ఉపయోగించారు. ఇలా మోడీ అనేక సందర్భాలలో ఆత్మస్తుతి, పరనిందతో కాలక్షేపం చేశారు.

తనను తాను పొగుడుకుంటూ.

సరికదా దేశంలో ఉద్యోగ సంక్షోభం మరింత తీవ్రమైంది. 2022 చివరి నాటికి అంతరిక్షంలోకి మనిషిని పంపుతామని 2018లో ఎర్రకోట సాక్షిగా ప్రధాని ప్రకటించారు. దేశం 2024వ సంవత్సరంలోకి ప్రవేశించినా ఎవరూ ఆ ఊసే ఎత్తడం లేదు. దేశంలోని అన్ని గ్రామాలనూ విద్యుత్ వెలుగులతో నింపుతామని 2018 ఏప్రిల్‌లో మోడీ గ్యారంటీ ఇచ్చారు. ఫోర్బ్స్ తాజా నివేదిక ప్రకారం దేశంలో ఇప్పటికీ 3.1 కోట్ల కుటుంబాలు చీకట్లో మగ్గుతున్నాయి.

వీటిదీ అదే దారి

ఆధార్ అనుసంధానం కారణంగా గ్రామీణ ఉపాధి పథకం తీవ్ర సంక్షోభంలో పడిపోయింది. నమోదు చేసుకున్న కార్మికుల్లో 34.8% మంది, క్రియాశీలక కార్మికుల్లో 12% మంది ఉపాధి కోల్పోయారు. 2022 ఏప్రిల్ నుండి 7.6 కోట్ల జాబ్ కార్డుల్ని తొలగించారు. పీఎం కిసాన్ పథకంలో రెండు నుండి నాలుగు లక్షల మంది లబ్దిదారుల బ్యాంక్ ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదు. మోడీ ఇచ్చిన మరో గారంటీ 'నల్లా నుండి నీరు'. 2022 అక్టోబరులో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం 13 వేల గ్రామాల్లో 5,298 గ్రామాలకు మాత్రమే రక్షిత మంచినీరు లభిస్తోంది. 62% కుటుంబాలకు మాత్రమే నీటి కనెక్షన్లు ఉన్నాయి.

ఉజ్వల యోజన లబ్దిదారులకు ప్రతి సిలిండరుపై రూ.200 సబ్సిడీ అందజేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. అయితే 2022-23లో లబ్దిదారుల్లో చాలా మంది ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదు. కొందరు ఒక్క సిలిండర్‌తో సరిపుచ్చారు. ఆర్‌టీఐ కింద ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ పథకంలో 9.58 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతుండగా 1.8 కోట్ల కుటుంబాలు ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదు. 1.51 కోట్ల కుటుంబాలు మాత్రం ఒకే ఒక సిలిండర్ తీసుకున్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకంలో జరుగుతున్న అక్రమాలను గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. చనిపోయిన రోగుల పేరిట పెద్ద ఎత్తున చెల్లింపులు జరిగాయని కాగ్ సైతం నిర్ధారించింది. యువతలో ఎన్నో ఆశలు రేపిన స్కిల్ ఇండియా పథకం కూడా నీరుకారిపోతోంది.

కోర్సుల ఎంపిక సరిగా లేకపోవడం, కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, తప్పుడు సమాచారం ఇవ్వడం వంటి కారణాలతో ఈ పథకం ఆశించిన లక్ష్యాలను చేరడంలో విఫలమైంది. పీఎం గ్రామ్ సడక్ యోజన, సౌర ఇంధన కార్యక్రమానిది కూడా అదే దారి. పేదల ఆవాసాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తామని ప్రధాని గొప్పగా ప్రకటించారు. కాలగర్భంలో కలిసిపోయే పథకాల్లో దీనిని కూడా చేర్చేందుకు ఎన్ని సంవత్సరాలు పడుతుందో?

ఒక రోజు ఇలా



కాలం ఒక దారం
దానికి గుచ్చిన పువ్వులే నా కవితలు.
ఆ దారానికి కొసలు లేవు
ఎక్కడ మొదలైందో
ఎక్కడ ముగుస్తుందో అనూహ్యం.
సుదీర్ఘమైన దండలో
ఎన్ని రకాల పూలో
కొన్నింటికి ముళ్లు కూడా.
కాలం గాలి కాదు
అది సకల జీవుల ఊపిరి
వర్షం నీరు కాదు
అనాది అనాది కన్నీరు.
వేదన నా జీవితంలో భాగం
ధిక్కారం నా ఏకైక రసం
ఇది పునరావృత గీతం కాదు
ఎప్పటికీ వాడువని నేపథ్య సంగీతం
పింగాణి కెటిల్ లోంచి
జారే కాఫీ ధార
ప్రస్తుతానికిదే
నా నయాగరా

– డా. ఎన్. గోపి

గ్రహణ కాలం సూర్యుడు



వాడు
కడుపు మాడుతున్నా
కలలకు రంగులు అద్ది
మానం కాపాడు వస్త్రం
ఆ మూల మీది ముసలి తాత
చెప్పులు కుట్టి పాదాలకు పరువు తొడిగినట్టు
బికినీలు సిగ్గుపడు ఆరు గజాల నేత
వాడు దేశ గౌరవం
గర్వంగా తలెత్తుకొని నిలబడు జెండా వాడు
వాడు ఏ శిలలో ఏ శిల్పం ఉన్నదో కనిపెట్టే
శిల్పి చాతుర్యం
ఏ పోగు ఎటు తిప్పితే
ఏ బొమ్మ దిగుతుందో
మంత్రం తెలిసిన విద్య
ఆమె రాట్నమయ్యి చేయి కలిపిన
ఏడు రంగుల నేతబొమ్మ
నిత్యం శిశిరం అనుభవిస్తూ
వసంతం పంచిపెట్టు సంబరం
దు:ఖం దాచుకుని
నవ్వులు పంచుకునే సంతోషం
తాజ్ మహల్ కట్టినా
సొంత ఇల్లు లేని తాపీ మేస్త్రీ లాగే
ఎంత బట్ట నేసినా వొంటిని దాచుకోవడం చేతకాని
నష్ట జాతకం
వాడిపోయే పూల నవ్వులకు తేనె పూసినట్టు
బొబ్బలెక్కిన అరికాళ్ళకు వెన్న రాసినట్టు
కళకు కలలు ముడేసి
ఎప్పుడో తప్పిపోయిన బ్రతుకు మూట
ఎంత వెతుకుతున్నా
కడుపునిండు ఆశలు
బజారు మీది దళారి పాలు
వాడు ముల్లు పదును అంచు మీద నిలబడి
నవ్వులు పూయించువాడు
కన్నీళ్ళు తోడుకుని
పన్నీటి కాలువలు తవ్వుతున్న వాడు
ఆకలి కూనిరాగం ఎత్తుకున్నట్టు
మగ్గం గొంతు సవరించుకుని
కోకిల పిలుస్తున్నట్టు
పాల కొరకు పిల్లాడు ఏడుస్తున్నట్టు
ఒంటిమిది జీర్ణవస్త్రం
నేతపాట ఆలపించే పాటగాడు
వాడు ఫ్యాషన్ వేదికపై అగుపడని పాత్రధారి
అందరికీ అయిన వాడే అయినా
సెల్లు టవర్ల నడుమఆగమయిన పిట్ట వాడు
మరమగ్గాల దాడిలో
కాలు రెక్కలు విరిగిపోయిన క్షతగాత్రుడు
దు:ఖపు నీడ, కన్నీటి చార
ఏ ఆనవాలు దొరకని
చిరునవ్వుల రారాజు
వాడు మగ్గం మీది సీతాకోకచిలుకలు
దేశ దేశాలకు ఎగరేసే ఇంద్రజాలం
బట్ట కేడ్చినా పొట్ట కేడ్చినా
బ్రతుకు పూల తోటలో
నేత పోగుల కలల సాగుకు
అంకితమయిన వాడు
వాడు దేశానికి ఎంత చిన్న చూపు అయినా
వస్త్ర ప్రపంచానికి ఉదయించిన సూర్యుడు
గ్రహణం తాత్కాలికం.

– గజ్జెల రామకృష్ణ, 8977412795

తెలుగు వెలుగుల వేమన్న

వేమన పద్యాలు వందల సంవత్సరాల వరకు గ్రంథస్తం కాకుండా కేవలం సామాన్యుల నోటి మీదనే నిలిచి ఉన్నాయి. 1816లో భారతదేశం వచ్చిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమన సాహిత్యం మీద 18 ఏళ్లపాటు పరిశోధన చేసి కొన్ని వందల పద్యాలను సేకరించాడు. అంతేకాదు బ్రౌన్ దొర తెలుగు సాహిత్యానికి విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్ద కోశాన్ని ఈయనే పరిష్కరించి ప్రచురించాడు. అదే బ్రౌన్ డిక్షనరీగా పేరొందిన నిఘంటువు. ఈయన వేమన పద్యాలను సేకరించడమే కాదు, వాటిలోని గొప్పతనాన్ని గ్రహించి, వాటన్నింటినీ లాటిన్, ఆంగ్ల భాషలలోకి అనువదించాడు కూడా. తెలుగువారు సిపి బ్రౌన్ కు ఎంతో రుణపడి ఉంటారు. విలియం హోవర్డ్ కాంబెల్ (1910), జి. యు. పోప్, సి. ఇ. గోవర్ వంటి ఆంగ్ల సాహితీవేత్తలు వేమనను లోక కవిగా కీర్తించారు. తెలుగువారిలో వేమన కీర్తి అజరామరం చేయటానికి కృషి చేసిన వారు కట్టమంచి రామలింగారెడ్డి. రాష్ట్రంలో పలుచోట్ల వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించటానికి రామలింగారెడ్డి కృషి ఎంతో ఉన్నది. 1839లో తొలిసారిగా బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు పుస్తక రూపంలో వెలుగులోకి వచ్చాయి.

వేమన కాలం గురించి, ఆయన జీవితం గురించి, సిపి బ్రౌన్, వంగూరి సుబ్బారావు, వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రి, బండారు తమ్మయ్య, ఆరుద్ర, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, వేమూరి విశ్వనాథ శర్మ, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, త్రిపురనేని వెంకటేశ్వరరావు, ఆచార్య ఎన్.గోపి పరిశోధనలు చేశారు. సుమారు 1652-1730 మధ్యకాలంలో వేమన జీవించి ఉండవచ్చునని అభిప్రాయ పడతారు.

కులమత బేధాలను నిరసించిన వేమన కులం గురించి పరిశోధకులు ఒక అభిప్రాయానికి రాలేకపోయారు. సి.పి.బ్రౌన్ వేమన జంగం (శైవ సంస్కర్తల కులం) కులానికి చెందిన వాడని, వేమన రెడ్డి కులానికి, కాపు కులానికి చెందినవాడు అని కూడా మరికొందరు భావించారు. ఆయన పద్యాలను బట్టి కొందరు భావించినా కాపు, రెడ్డి అనే కులాలు దత్త మండలాలలో పర్యాయపదాలుగా వాడబడుతున్నాయి. కావున ఏ కులమని నిర్ధారించలేకపోయినా పద్యాలలో కనిపించే వ్యవసాయ పరిజ్ఞానం వలన ఆయన రైతు కుటుంబానికి చెందిన వాడిగా నిర్ధారించవచ్చు అని అంటారు మరి కొందరు. వేమన ఏ కులం వాడు అన్నది అప్రస్తుతం. ఆయన ఒక నిండైన మనిషి. ఆయన లోకానికి అందించిన అపూర్వ సాహిత్యం ఒక సత్యనిఘంటువు.

వేమన పద్యాలలో వాడిన ప్రాంతాన్ని సూచించే పదాలు (పచ్చ, దుడ్డుట, బిత్తలి లాంటివి) రాయలసీమ ప్రాంతంలో మాత్రమే వాడుకలో ఉన్నందున ఆయన రాయలసీమ వాడు అని చెప్పవచ్చు.

పరిశోధనలు కొనసాగిన క్రమంలో వేమన వాడిన మక్కా, అల్లా, మహమ్మద్, గులాము, బిక్కలు, జింజిరీలు వంటి పరిష్యా పదాలు వాడకం వల్ల ఇతడు 17వ శతాబ్దం వాడని, రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడని తేలిందని అంటారు.

ప్రాపంచిక జీవితంలో ఎంతో మోసం, కపటం, నాటకం, డంబం గ్రహించిన వేమన, వాటిని రూపుమాపటానికి సన్యాసులు చూపించే పరిష్కారాలు వట్టి బూటకం అని, ఆ సన్యాసుల బతుకులలో కూడా అవే లక్షణాలు ఉన్నాయని తెలుసుకున్నాడు. వారి మోసాన్ని ఎలుగెత్తి చాటాడు. వేమన పద్యాలు లోకనీతులు. సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృజించని అంశం లేదు. పట్టించుకోని పార్శ్యం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లో దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించటం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు... ఒకటేమిటి కనిపించిన ప్రతి సామాజిక అవకతవకల మీద వేమన్న కలం ఝుళిపించాడు. సమాజానికి పట్టిన చీడపీడను, బూజును దులిపివేశాడు. పద్యాలన్నీ ఆటవెలదిలోనే చెప్పాడు. ఎంతో లోతైన భావాన్ని కూడా సరళమైన భాషలో, చక్కటి ఉదాహరణలతో హృదయానికి హత్తుకునేలా చెప్పాడు వేమన. మొదటి రెండు పాదాల్లో నీతిని ప్రతిపాదించి మూడోపాదంలో దానికి తగిన సామ్యం చూపిస్తాడు. ఉదాహరణకు

“అల్పుడెపుడు పలుకు నాడంబరముగాను/ సజ్జనుండు పలుకు చల్లగాను/ కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా/ విశ్వదాభిరామ వినురవేమ”.

కొన్ని పద్యాలలో ముందే సామ్యం చెప్పి, తరువాత నీతిని చెబుతాడు. **“అనగ అనగ రాగ మతిశయించునుండు/ తినగ తినగ వేము తియ్యనుండు/ సాధనమున పనులు సమకూరు ధరలోన”**

వేమన గొప్ప గొప్ప ప్రబంధాలను, పురాణాలను రాజులను కీర్తిస్తూ సంస్కృతంలో కవిత్వాన్ని రాయలేదు. అతి సామాన్య ప్రజానీకానికి సులభమైన తెలుగులో చాటు పద్యాలలోని తత్వాన్ని, సమాజంలో ఉన్న మురికిని వదలగొట్టటానికి ప్రయత్నం చేశాడు. సామాన్య ప్రజలకు అర్థమయ్యే ఉదాహరణలు తీసుకోవడం, హాస్యస్ఫూరకతను జోడించడం, సమకాలీన అంశాల ప్రస్తావన, వాటిలో ఎత్తిపొడుపులు ఉండటం, సమాజంలో కరుడుగట్టి ఉన్న సాంప్రదాయాల పట్ల నిరసన ధ్వనించడం వేమన పద్యాలలోని ప్రత్యేకత.

> మితిమీరిన విగ్రహారాధన, అవివేకంతో కూడిన సంప్రదాయాలు, పాటింపవీలులేని, కొన్ని వర్గాలకే పరిమితమైన విజ్ఞానం వంటివి వేమనకు నచ్చలేదు. దేవాలయాల ముసుగులో జరిగిన దారుణాలు, వ్యాపారాల వంటి చీకటి దృశ్యాలను నాటి సమాజంలో ఆయన చూశాడు. స్త్రీలను పురుషాధిక్యతతో దేవదాసీలుగా చిత్రించటం వెనుక స్వార్థపరుల కుట్రలను గ్రహించాడు.



మితిమీరిన విగ్రహారాధన, అవివేకంతో కూడిన సంప్రదాయాలు, పాటింపవీలులేని, కొన్ని వర్గాలకే పరిమితమైన విజ్ఞానం వంటివి వేమనకు నచ్చలేదు. వేదం చదివామని చెప్పే వారిలో వివేకం శూన్యం అని వేమనకు తెలుసు. దేవాలయాల ముసుగులో జరిగిన దారుణాలు, వ్యాపారాల వంటి చీకటి దృశ్యాలను నాటి సమాజంలో ఆయన చూశాడు. స్త్రీలను పురుషాధిక్యతతో దేవదాసీలుగా చిత్రించటం వెనుక స్వార్థపరుల కుట్రలను గ్రహించాడు. వేశ్యల వెనుకబడి విత్తం (సొమ్ము) పోగొట్టుకుని వెర్రివారైన విటుల జీవితాలు, వారి కుటుంబాల్లోని విషాదం ఇలాంటివన్నీ ఆయన గ్రహింపు కొచ్చిన అంశాలు. ఒక వైపు స్త్రీ ఔన్నత్యం గురించి ఘోషిస్తూ, మరోవైపు ఆమెను భోగ వస్తువుగా పరిగణించిన చౌకబారుతనాన్ని, విషాదాన్ని ఆ శాస్త్రాలలో ఆనాటి సమాజపు సహజరీతిగా చలామణి కావటానికి గర్హించాడు.

దేవుడంటే ఎవరు? ఎక్కడున్నాడు? కనిపించని దేవుని గురించి గొప్పగా కీర్తించి, కళ్ళ ముందు కనిపించే మనిషిని జాతి, కుల, మత, వివక్షలతో, ఆర్థిక అసమానతలతో వేధించే మనుషులను వేమన దూషించాడు, ద్వేషించాడు. తన హేతువాద భావాల తూటాల వర్షం కురిపించాడు. అసలు దేవుడు ఎక్కడున్నాడు అని నిలదీశాడు. **“దేవుడనగ వేరే దేశమందున్నాడే/ దేవుడనగ తనదు దేహమందు/ వాహనంబు లైదు వడి తోలుచున్నాడు”.** మనిషిని నడిపించే జీవచైతన్యమే దేవుడు. పాడి, పంట, రైతు, తల్లి, తండ్రి, మానవత్వం ఇవే దైవ స్వరూపాలుగా వేమన సిద్ధాంతీకరించాడు.

వేమన భాష స్వచ్ఛమైనది. వాడి గలది. శైలి సరళం. ఆయన చేసే పోలికలు సహజంగా, సరికొత్తగా గంభీరంగా మేరు తీగల్లాగా ఉంటాయి. ఇతరుల సొమ్మును ఆశించే లక్షణం 'వెన్నదొంగ' లోనూ కనిపిస్తుంది అంటూ వ్యంగ్యాస్త్రాలు విసురుతాడు. **“పాల కడలి పైన పవళించిన స్వామి/ గొల్ల ఇండ్లపాలు కోరనేల?/ఎదుటివారి సొమ్ము ఎల్లవారికి తీపి”**


బంగారు లేడి ఉండదని తెలియని రాముడు దేవుడు ఎలా గయ్యాడు? అంటూ ప్రశ్నిస్తాడు వేమన. **“కనక మృగము భువిని కద్దు లేదనుకుండ/ తరుణి విడిచి పోయే దాశరథియు/ తెలివి లేని వాడు దేవుడేట్లయేరా?”** అలానే కుల వివక్షత లోని డొల్లతనం గురించి **“మాలవానినంటి మరి నీట మునిగితే/ కాటికేగునప్పుడు కాల్చు మాల/ అప్పుడంటినంటు ఇప్పుడెందేగెనో?”** అంటూ సామాజిక రుగ్మత అయిన కుల వివక్షతను చీల్చి చెండాడాడు. మనిషిని మనిషిగా చూడాలే కానీ కులంపేరుతో దూరం చేయకూడదు అనే నగ్న సత్యాన్ని సమాజానికి చెప్పి అప్రమత్తం చేశాడు. వేమన మానవతా ధర్మం గురించి చెప్తూ **“చంపదగిన యట్టి శత్రువు తన చేత/ చిక్కెనేని కీడు సేయరాదు/ పొసగ మేలు చేసి పొమ్మంటే చాలు”** అంటూ మానవత్వాన్ని చాటుతాడు.

వేమన ఆంధ్రులలో సాటి లేని వ్యక్తి. తనకు తెలిసిన వాటిని నిర్భయంగా ప్రపంచమునకు బోధించు ధైర్యం, దానికి సాధనమైన మంచి పదును గల చురకత్తి వంటి కవితా శక్తి వేమన సొంతం. తాము సత్యమని నమ్మినప్పటికి కూడా ఇతరుల మనసు నొచ్చుకుంటుందేమోనని చెప్పకుండా తప్పించుకు తిరుగు 'ధన్యులు' కవులు ఆంధ్రులలోఎందరో ఉన్నారు.

వేమన పద్యాలు తెలుగు సాహిత్య వనంలో విరబూసిన రత్నాల హారాలు. ఆయన చెప్పిన ప్రతి విషయం ఒక సత్య నిఘంటువే. పండిత లోకానికి పరిమితమైన వేదాంతాన్ని అతి సామాన్య మానవునికి కూడా అందుబాటులో ఉండేట్లు స్వచ్ఛమైన అచ్చమైన తేనె లాంటి తేట తెలుగు పద్యాలలో వివరించిన మహానుభావుడు వేమన.

“వేయి విధము లమర వేమన పద్యంబు/ లర్థ మిచ్చు వాని నరసి చూడ/ చూడ జూడ గలుగు చోద్యమౌ జ్ఞానంబు/ విశ్వదాభిరామ వినురవేమ”.

పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజల్ని మెప్పించిన కవి వేమన. అంధ విశ్వాసాలను తూర్పార పెట్టిన విశ్వమానవుడు వేమన.



– పి.బీ.చారి,
9704934614

చలి మంటలు

పుష్యమి ఇంట్లో చందమామ ఆగమనం
చలి మంటలతో జనం ఆగం..
ఒంట్లో నలతతో ఊపిరి ఆడక
రగ్గు దుప్పటిలో మనిషి జీవనం అయోమయం
ఉత్తరం దక్షిణం మీద యుద్ధం చేస్తుందేమో..
హిమాగిరులు శంఖారావం పూరించాయో..
పడమటి సంధ్య కాలాన్ని అడ్డుకుంటుందేమో!
రుతురాగాల తిరోగమానం
ప్రకృతి విధ్వంసంకి బహుమతి కాబోలు
పర్యావరణ పరిరక్షణ గాలికొదిలి
కాలుష్యం కోరలో చిక్కిన అభివృద్ధి ఫలాలు
మనిషికి ఊరటం ఇవ్వడం లేదేమో!
పగ బట్టినట్లు కాలం కూడా రాజకీయ క్రీడ
నేర్చుకుందేమో?
నేను అనే అహంభావానికి
గుణపాఠం చెప్పడానికి
ఎన్నెన్నో చిత్ర విచిత్రాలు చేస్తున్న..
స్వార్థం మనిషిని విడవలేక
అధ: పాతాళనికి తొక్కేస్తున్నా ఇంకా
మారని ఈ మనిషికి ఇప్పుడన్నా
ఈ హేమంతం చిగురుల చిలిపి తనపు సహవాసం
ఓదార్పు నిస్తుందని..
భోగిమంటల అగ్నిహోత్రం చలి పులి నుండి రక్షణ
కల్పిస్తుందని..
కుల మతాలకతీతంగా మానవ సమాజం
పునర్నిర్మాణన్నికి
జాతి గొప్ప విశిష్టతను చాటడానికి
మకర సంక్రాంతి పండుగ అలంబాన కావాలి
ప్రతి ఎద లోగిలిలో ఆనందం
గాలి పటాలయి ఎగరాలి
పచ్చని పాడి పంటలతో భూమి
పొద్దు పొడుపు పువ్వులే నవ్వలే.!
ఇంటింటా రంగుల హరివిల్లు
రేపటి సమైక్య భావనకు నాంది పలకాలి..
మనిషి మనస్సులో నాటుకున్న
కుళ్ళు కుతంత్రాలు మాయమై
ప్రేమ సుధలు కురియాలి.!
నిత్య వసంత రాగమై మురిసి పోవాలి.!!

– రవీందర్ కొండా, 9848408612

వికలాంగుల వేదనను చాటి చెప్పిన కవిత్వం



కందుకూరి భాస్కర్,
9441557188

మనిషి జీవితానికి శారీరక, మానసిక అంగవైకల్యం తీరనిలోటు. అలాంటి వారి జీవన విధానం ఎంత దుర్భరంగా ఉంటుందో అనుభవిస్తే గాని అర్థం కాదు. వాటన్నిటినీ తట్టుకొని కొంతమంది అత్యున్నత ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. పదిహేనేండ్ల వయస్సులోనే తీవ్రమైన జ్వరంతో శక్తి క్షీణించి, రెండు కాళ్ళు పనిచేయక అచేతనుడయ్యాడు రాసమొళ్ళ చంద్రయ్య. కుటుంబ పోషణ కొరకు చదువుకు దూరమయ్యి చిన్నప్పుడే కులవృత్తి చేపట్టారు. ఉన్నత చదువులు చదవకపోయినా తన దగ్గర ఉన్న మిత్రులు, పిల్లలు, పత్రికలు, హితైషులు, దూరదర్శన్, చరవాణి వంటి సహాయంతో సమాజాన్ని చదివి సాహిత్యంలో రాణిస్తున్న నాగర్ కర్నూల్ జిల్లా, అప్పాయి పల్లికి చెందిన కవి ఆయన.



ఈ కవి స్వయంగా అంధుడు కావడం వల్ల తాను పడిన ఆవేదనను, ఆర్తిని కవితా రూపంలో మలిచి, 'దివ్యాంగుల మణిపూసలు' పేరుతో వెలువరించారు. వడిచర్ల సత్యం సృష్టించిన మణిపూసల ప్రక్రియలో వచ్చిన ఈ రచన తొలి దివ్యాంగుల పుస్తకం కావడం విశేషం. మూడు వందలకు పైగా మణిపూసలను కేవలం దివ్యాంగులు అనే ఒకే ఒక వస్తువును స్వీకరించి, రాయడమనేది కవికున్న ప్రతిభకు నిదర్శనం. చూపు లేని కొందరు వివిధ రూపాల్లో తమ మేధో సంపత్తిని చూపెడుతున్నారు. వారి హక్కులను కాపాడుకోవడం కొరకు పోరాటం చేస్తున్నారు. ఆ మార్గంలో రాసమొళ్ళ చంద్రయ్య దివ్యాంగుల అస్తిత్వం కోసం కవితా మార్గం ఎంచుకున్నారు. సమాజంలో అవిటి వారిని చిన్నచూపు చూడటం తగదంటూ వారి జీవిత వ్యథలను చెప్పిన తీరు హృద్యంగా ఉంది. ఇందులో వారి సాధక బాధకాలను వివరించే ప్రయత్నం చేశారు. సమాజంలో వికలాంగుల పట్ల ఉన్న వివక్షతను తన కలంతో తీవ్రంగా ఖండించి, వారి జీవితాల్లో చైతన్యపు వెలుగులు నింపడానికి తన వంతు కృషి చేశారు. ఈ గ్రంథంలోని కొన్ని మణిపూసలు పరిశీలిద్దాం!

'భయంకరపు వ్యాధి వున్న/ తన దేహము కదలకున్న/ స్టీఫెన్ హాకి భయపడక/ చేసె పరిశోధనలన్న!'. అన్ని అవయవాలు చచ్చు పడిపోయిన స్టీఫెన్ హాకింగ్ ఏమాత్రం నిరాశ చెందకుండా తన వైకల్యాన్ని లెక్కచేయకుండా మానవాళికి గొప్ప పరిశోధనలు అందించాడని, అతడి జీవితాన్ని వికలాంగులు ఆదర్శంగా తీసుకుని బాధ పడకుండా ముందుకు సాగాలన్నారు. ఇలా ప్రముఖ వికలాంగుల పేర్లను ప్రస్తావిస్తూ వారు సాధించిన విజయాల గురించి తన మణిపూసల్లో ఎంతో చక్కగా వివరించారు.

'కనబడే వికలం కన్న/ మదిలో వైకల్యమున్న/ మహాప్రమాదకరము/ దీన్ని ఎరిగి మసలుమన్న!' ఈర్ష్య అసూయ ద్వేషాలు, కుళ్లుబుద్ధి వున్న వాళ్లకు చెంప పెట్టు లాంటిది ఈ కవిత. మంచి మనసు లేని వాడే అసలైన వికలాంగుడనే వాస్తవాన్ని తెలియజేస్తున్నాడు. కనబడే వైకల్యం కన్నా మన మనసులో కనబడని మనోవైకల్యం మహా ప్రమాదం అంటూ హెచ్చరిస్తున్నాడీ కవి.

'మూగవాళ్ళ రోదన/ చెప్పలేని భావన/ శ్రమించి పనిచేసిన/ కడుపునిండ వేదన!'. ఇలా ఎందరో మాటలు రాని మూగవాళ్ళ అంతరాత్మను, జీవన స్థితిగతులను, బతుకు దెరువును, ఆవేదనలను వర్ణించారు.

'తల్లికి తండ్రికి సేవలు/ చేయలేని మా రాతలు/ కన్నీళ్ల తోడ వారే/ చేస్తారు మాకు సేవలు!'. తల్లిదండ్రులకు సేవలు చేయాల్సిన స్థితిలో నేను వారితో సేవలు చేయించుకుంటున్నానని కవి వేదనాభరితమైన హృదయంతో అల్లిన ఈ కవితని చదివితే ఎవరికైనా కనీళ్ళు వస్తాయి.

'పాటపాడి మెప్పిస్తం/ ఆటలాడి ఒప్పిస్తం/ ప్రేక్షకుల నుల్లాసంగ/ ఉంచుదేను మా లక్ష్యం!'. కొంత మంది పొట్టకూటి కోసం శారీరక లోపం ఉన్నప్పటికీ పాటలు పాడుతూ ఇతరుల సంతోషం కొరకు పాటుపడుతున్నారంటారు. మరికొందరు కుంచెతో చిత్రాలు వేస్తారు, డ్రైవింగ్ చేస్తారు, బట్టలు కుడతారు, నృత్యం వంటి అనేక పనులు చేస్తూ దేశాభివృద్ధిలో భాగమవుతున్నారు. శ్రామికులుగా, కళాకారులుగా, రచయితలుగా, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా ఎంతో నైపుణ్యం కనబరుస్తున్నారు. అయినా సమాజంలో చాలా మందికి వికలాంగులంటే చిన్న చూపే. వారికి కావాల్సింది జాలి కాదని, వారిలో దాగివున్న తెలివితేటల్ని వెలికి తీసేందుకు ఆదరణ, ఆచరణ కావాలని కోరుతున్నారు.

'మా తనువు వంపు దేహము/ మా హృదయం పూలవనము/ చెరగిపోని మానవత/ మాకున్నది ప్రేమ గుణము!'. వికలాంగుల పట్ల సమాజం చూస్తున్న తీరును, చూడవలసిన తీరును స్వయంగా తన హృదయ స్పందనతో రాసిన కవిత్వం ఇది. సరళమైన పదాలతో అక్షరమే ఆయుధంగా చేసుకుని వారి మనోవేదనను ప్రపంచానికి తెలియజేసి, వారి ఆత్మగౌరవాన్ని చాటారు. ఇందులో కొన్ని మణిపూసలతో దివ్యాంగుల బాధలు కళ్ళకు కట్టినట్టుగా చెప్పారు. అవి పాఠకులకు కంటతడి పెట్టిస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పవచ్చు.

సాహితీ వార్తలు

'లోయ చివరి రహస్యం' ఆవిష్కరణ

బోధి ఫౌండేషన్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో భగవంతం కథా సంపుటి 'లోయ చివరి రహస్యం' ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్, రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుంది. ఈ సభకు డా॥కె.శ్రీనివాస్, డా॥ఎస్.రఘు, కిల్లాడ సత్యనారాయణ, వి.హర్షవర్ధన్, సిద్ధార్థ, నండూరి రాజగోపాల్, ఇండ్ల చంద్రశేఖర్ హాజరవుతారు.

'లోపలి ముసురు' పుస్తక ఆవిష్కరణ

దక్కన్ సాహిత్య సభ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో అరుణ నారదభట్ల కవిత్వం 'లోపలి ముసురు' పుస్తక ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6.15 నిమిషాలకు హైదరాబాద్ రవీంద్రభారతి మినీహాల్లో జరుగుతుంది. ఈ సభలో డా॥ఎన్.గోపి, డా॥ఏనుగు నరసింహారెడ్డి, డా॥మామిడి హరికృష్ణ, డా॥యాకూబ్, డా॥ఎస్.రఘు, మెర్సీ మార్గరెట్ పాల్గొంటారు.

ఎలనాగకు ఉకియోటో అవార్డు

ఎలనాగ రచించిన ఆంగ్ల కవితల సంపుటి, Dazzlers కు, ఉకియోటో అనే గ్లోబల్ ప్రచురణ సంస్థ Poet of the Year 2023 అవార్డును ప్రకటించింది. 2024 జనవరి 12, 13, 14 తేదీలలో కలకత్తాలో జరిగిన Kolkata Literary Carnival (కలకత్తా సాహిత్య సమారోహం) లో 13 వ తేదీన ఎలనాగ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఉకియోటో సంస్థ ఈ అవార్డును ఇవ్వటమే కాకుండా, Dazzlers ను టర్కిష్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, రష్యన్, చైనీస్, జపనీస్ భాషలలోకి అనువదింపజేసింది.

పద్య శతకాలకై ఆహ్వానం

శత శతక సుధానిధి పేరుతో వంద శతకాలను సమీక్షల ద్వారా పరిచయం చేస్తూ ఒక గ్రంథాన్ని వెలువరించాలని భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా శతకాలు రచించిన కవులు తమ శతకాలను సమీక్షించుటకు ఎలాంటి అభ్యంతరం లేదనే హామీపత్రంతో పాటు మీ శతకాలు రెండు పుస్తకాలను జనవరి 31 లోపు డా.వైరాగ్యం ప్రభాకర్ ఇంటి నెంబర్ 2-102 సీతారాంపూర్ కరీంనగర్, తెలంగాణ 505001 చరవాణి: 9014559059 పంపగలరు.

ఫిబ్రవరి 4న వర్తన ప్రారంభ సమావేశం

సాహిత్యరంగంలో నవీన ధోరణులు పాదు కొల్పాలన్న లక్ష్యంతో ఏర్పాటయిన వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభ సమావేశం ఫిబ్రవరి 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. ఈ సమావేశంలో 'కవిత్వం - శిల్పం' అనే అంశంపై చర్చ వుంటుంది. ఈ సమావేశానికి ఎం.నారాయణ శర్మ, గుడిపాటి ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ హాజరవుతారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

– ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

పుస్తకాలను చదివితే జ్ఞానం మాత్రమే వస్తుంది. మనుషులను చదివితే లోకజ్ఞానం వస్తుంది. జ్ఞానం లేకపోయినా బతకొచ్చు గానీ లోకజ్ఞానం లేకపోతే బతకడం కష్టం

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
సోమవారం జనవరి 29, 2024 www.navatelangana.com

సెల్ టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్

నవతెలంగాణ- ముదిగొండ



తనకు న్యాయం చేయాలంటూ ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కిన సంఘటన మండల పరిధిలో గోకినేపల్లిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే..బాధితుడు తెలిపిన వివరాలు ప్రకారం...గోకినేపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల వినోద్, భార్య తన మధ్య జరిగిన కుటుంబ కలహాలతో గత సంవత్సరం వినోద్ భార్య ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. తన కూతురు ఆత్మహత్యకు వినోద్ కారణమని అమ్మాయి తల్లిదండ్రులు అప్పట్లో పోలీస్ స్టేషన్ కేసు పెట్టారు. ఈ క్రమంలో కేసు పరిష్కారం అయ్యేవరకు గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడి బీఆర్ఎస్ పార్టీ నాయకులు మీగడ శ్రీనివాస్ యాదవ్ వద్ద కొంత డబ్బు ఉంచాలని నిర్ణయించారు. వినోద్ పై కేసు లేకుండా చేయాలంటే ఖర్చు అవుతుందని మీగడ శ్రీనివాస్ యాదవ్ చెప్పగా, రూ1,50 వేలు ఇచ్చానని వినోద్ చెప్పారు.శ్రీనివాస్ ఎవరికి తెలియకుండా 1,50 వేలు వినోద్ భార్య తాతయ్య పేరుతో బ్యాంకులో జమ చేశారు. ఈవిషయంపై వినోద్ శ్రీనివాస్ అడగ్గా బెదిరింపులకు పాల్పడుతూ, ఇంకెక్కడికి పోయిన న్యాయం జరగదని చెప్పటంతో దిక్కులేక, న్యాయం కోసం గ్రామంలోని సెల్‌ఫోన్ టవర్ ఎక్కానని వినోద్ పేర్కొన్నారు. ఘటన తెలిసిన వినోద్ తల్లిదండ్రులు, బంధువులు, తన మనవడికి, కుమారుడికి న్యాయం చేయాలని గ్రామంలో రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. దీంతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచాయి. సంఘటన స్థలానికి ఖమ్మంరూరల్ సిఐ సిహెచ్ రాజిరెడ్డి చేరుకొని సెల్‌ఫోన్ టవర్‌పై ఉన్న వినోద్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చి,సెల్ టవర్‌పై నుండి వినోద్‌ను కిందికి దించారు. దీంతో గ్రామస్తులు, ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సిఐ రాజిరెడ్డి తెలిపారు.

'తమ్మినేని' ని పరామర్శించిన కమల్ రాజు

నవతెలంగాణ - బోనకల్

హైదరాబాద్ ఏఐజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బోనకల్ మాజీ జెడ్పిటిసి బానోతు కొండ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి వారు తెలుసుకున్నారు. ప్రస్తుతం తాను వేగంగా కోరుకుంటున్నట్లు తమ్మినేని వీరభద్రం వారికి వివరించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ తమ్మినేని త్వరగా కోలుకొని తిరిగి యధావిధిగా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.



తమ్మినేని పరామర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నేలకొండపల్లి : అనారోగ్య కారణంతో హైదరాబాదులో గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ సభ్యులు ఆదివారం పరామర్శించారు. ప్రస్తుత ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో అహర్నిశలు కృషి చేసిన వైద్య బృందానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరో రెండు రోజుల్లో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్యులు చెప్పినట్లు వారు తెలిపారు. తమ్మినేనిని పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు రాసాల కనకయ్య, మండడపు మురళీకృష్ణ, మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, చిర్రా రాజు ఉన్నారు.



కేంద్ర ప్రభుత్వంపై కార్మిక కర్షకులపై పోరు

1న కారేపల్లిలో సదస్సు

నవతెలంగాణ-కారేపల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతు, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై దేశవ్యాప్త పోరును నిర్వహిస్తున్నట్లు అఖిలపక్షనాయకులు తెలిపారు. ఆదివారం కారేపల్లిలోని భాగం రామనర్సయ్య భవన్ లో సీఐటీయు మండల కార్యదర్శి కే.నరేంద్ర అధ్యక్షతన అఖిల పక్షసమావేశం జరిగింది. ఈసమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, ఐఎన్‌టీయుసీ నాయకులు తలారి చంద్రప్రకాశ్, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్, జిల్లా నాయకులు ఎన్వీ.రాకేష్, గుగులోత్ తేజానాయక్, ఏఐటీయుసీ నాయకులు బోళ్ల రామస్వామి లు మాట్లాడుతూ రైతు గిట్టుబాటు ధర కల్పనలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. స్వామినాధన్ కమిటీ సిపార్స్ మేరకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయకుండా రైతు వ్యతిరేక విధానాలను అమలుకు మొండిగా ప్రయత్నిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్ల తో కార్మికులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. ప్రజా వ్యతిరేక పాలకులపై ఫిబ్రవరి 16న జరుగు కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను అఖిలపక్ష ప్రజాసంఘాలు పిలుపునిచ్చాయన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఫిబ్రవరి 1 న కారేపల్లిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు , కే.శ్రీనివాస్, రావుల నాగేశ్వరరావు, పులకాని సత్తిరెడ్డి, తాటి పాపారావు, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ- తల్లాడ

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు, మండల విద్యాశాఖ అధికారి ఎస్ దామోదర్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు పారుపల్లి ప్రసూన మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక తెలంగాణ వారు చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ మూఢనమ్మకాలు కొనసాగుతూనే ఉన్నాయని, వాటిని రూపుమాపాల్సిన బాధ్యత విద్యార్థులు తీసుకోవాలన్నారు. దేశంలో శాస్త్రీయ భావనను పెంపొందించే బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు. ఆ లక్ష్య సాధన దిశగా గత 30 సంవత్సరాలుగా జన విజ్ఞాన వేదిక కృషి చేయడం అభినందనీయమన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఫిబ్రవరి మూడవ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జెవివి మండల కోఆర్డినేటర్ మాదినేని నరసింహారావు, నిర్వాహకులు జీఎస్ మురళీకృష్ణ, దగ్గుల కమలాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ, ఉద్యోగాల నోటిఫికేషన్లను, నిరుద్యోగ భృతిని అమలు చేయాలనీ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని ఎన్ఎస్పీ క్యాంప్ సుందరయ్య భవన్‌లో డివైఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం జరగకుండా చూడాలని ఆయన సూచించారు. తక్షణమే మెగా డియస్సి వేయలని, సుమారు 20వేల ఉపాధ్యాయ పోస్టులు, అలాగే యూనివర్సిటీలలో అధ్యాపక, ప్రొఫెసర్ పోస్టులను, గురుకులాల్లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, యంగ్ ఉమెన్ రాష్ట్ర కన్వీనర్ రోష్ని ఖాన్, జిల్లా ఆఫీస్ బెరర్స్ చింతల రమేష్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, భూక్యా ఉపేందర్ నాయక్, కూరపాటి శ్రీనివాసరావు, దిండు మంగపతి, బొడ్డు మధు, రాంసెట్టి.సురేష్, చిత్తారు మురళి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 7వ గ్యారంటీగా విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు జీవి నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం విద్యా కమిషన్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దుచేసి, శాస్త్రీయ ,లౌకిక విలువలతో కూడిన విద్యా విధానం రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ,పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వశిక్ష, కేజీబీవీ, గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగుల రెగ్యులరైజ్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. స్కావెంజర్లను నియమించాలని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కోసం తగు చర్యలు తీసుకోవాలని, భోజన రేట్లు పెంచి, బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 317 జీవో అమలుతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, స్పౌజ్ బదిలీలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, పాఠశాలలో ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరారు.

జిల్లా విస్తృత సమావేశాలను జయప్రదం చేయండి..

ఫిబ్రవరి 4వ తేదీన నేలకొండపల్లిలో నిర్వహించే సంఘం జిల్లా విస్తృత కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు చావ రవి తదితరులు.... హాజరవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు షేక్ మహబూబ్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి. వెంకన్న ,షమీ,జిల్లా కోశాధికారి వల్లంకొండ. రాంబాబు, జిల్లా నాయకులు రంజాన్, సుధాకర్, రాందాస్, నాగేశ్వరరావు, సురేష్, రామారావు, నిర్మలాకుమారి, రమేష్, గీత, నాగూర్ వలీ, ఉద్దండు షరీఫ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బుడిగెం కృష్ణమూర్తి ఆశయాల కోసం కృషి చేయాలి

- వర్ధంతి సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర.శ్రీకాంత్

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



నిరంతరం ప్రజల కోసం పనిచేసే వ్యక్తి బుడిగెం కృష్ణమూర్తి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ కొనియాడారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని గాంధీచౌక్‌లోని బుడిగెం కృష్ణమూర్తి స్తూపం వద్ద 17వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. తొలుత బుడిగెం కృష్ణమూర్తి చిత్రపటానికి యర్రా శ్రీకాంత్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శి వర్గ సభ్యురాలు పత్తిపాక నాగ సులోచన అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం కష్టజీవుల కోసం చిన్న వ్యాపారస్తుల అభివృద్ధి కొరకు బుడిగం కృష్ణమూర్తి ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా గాంధీచౌక్ ప్రాంతాల్లో వ్యాపారస్తులకి ఎప్పుడు ఎవరికి ఏ సమస్య వచ్చినా వెన్నంటూ నిలబడే వారని ఆయన తెలిపారు. బుడిగం కృష్ణమూర్తి లేని లోటు పార్టీకి, వ్యాపారస్తులకి తీరని లోటు అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బుడిగెం కృష్ణమూర్తి కుమారుడు డాక్టర్ బుడేగం రమేష్, సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు బండారు యాకయ్య, త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కే సైదులు, డివైఎఫ్ఐ త్రీ టౌన్ కార్యదర్శి శీలం వీరబాబు, త్రీ టౌన్ కమిటీ సభ్యులు గబ్బెటి పుల్లయ్య, పాశం సత్యనారాయణ, యర్రా మల్లికార్జున్, వేముల వెంకటేశ్వర్లు, ఉపేందర్, జీ. పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్ పదవి ఐలూరికి దక్కేనా ?

గతంలో చేజారిన పదవి

నవతెలంగాణ -ఎర్రుపాలెం



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా కొనసాగుతున్న కూరాకుల నాగభూషణంపై శనివారం కాంగ్రెస్ పార్టీకి చెందిన డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్‌లు పెట్టిన ఆ విశ్వాసం తీర్మానం నెగ్గడం వలన డిసిసిబి చైర్మన్ పదవి ఖాళీ కావడంతో ఈ పదవిపై కన్నేసిన పలువురిలో ఉత్కంఠ ఏర్పడినట్లు చెప్పాలి. ఈ పదవి కోసం వారి కున్న పలుకుబడిని బట్టి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వర్ రెడ్డికి పదవి దక్కేనా అని మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ఐలూరి వెంకటేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లాకేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఐలూరి వెంకటేశ్వరరెడ్డి ఇప్పటికీ ఏడు సార్లు తక్కెళ్ళపాడు సహకార బ్యాంకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. గతంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవి చేతికి అందినట్లే అంది చేజారి పోవడంతో ఈ సారైనా ఐలూరికి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవి వరించేనా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఖమ్మం జిల్లా నాయకత్వానికి సుపరిచితమైన వ్యక్తిగా పేరు కలిగిన ఐలూరికి చైర్మన్ పదవి రావాలని మండల ప్రజలు కోరుతున్నారు. మధిర నియోజవర్గ శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు దగ్గర వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉందని, అటువంటి వ్యక్తికి తప్పకుండా చైర్మన్ పదవి వస్తుందని మండల ప్రజలు ఆశిస్తున్నారు. ప్రస్తుతం జరిగిన శాసనసభ ఎన్నికలలో ఈసారి తమ నాయకుడికి న్యాయం చేస్తామని ముగ్గురు మంత్రులు మాట ఇచ్చారని వెంకటేశ్వరరెడ్డి వర్గం నాయకులు చెప్తున్నారు. ఎంతో అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి మాత్రమే ప్రస్తుత ఖమ్మం డిసిసిబి చైర్మన్ పదవికి అర్హులని మండల ప్రజలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలి

-ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నేతలు గడ్డం లింగమూర్తి, ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం



రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీని నూతన ప్రభుత్వం అమలు చేయాలని, ఆర్టీసీలో కార్మిక సంఘాల కార్యకలాపాలను అనుమతించి, పెండింగ్‌లో ఉన్న రెండు వేతన సవరణలు అమలు చేసి ఆర్టీసీ ఉద్యోగులకు భరోసా కల్పించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, ఉపాధ్యక్షులు ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి మీటింగ్‌హాల్‌లో సిరిపురపు సీతారామయ్య అధ్యక్షతన ఖమ్మం డిపో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో ఆర్టీసీ కార్మికుల్లో ఉత్సాహం, ఆశాజనక పరిస్థితులు ఉన్నాయని, ఎన్నికలకు ముందు ఏదైతే ఆర్టీసీ కార్మికులకు హామీ ఇచ్చారో ఆ హామీలను అమలు చేసి ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఆర్టీసీలో కార్మిక సమస్యలను సానుభూతితో పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆర్టీసీలో ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ఆర్టీసీ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని, ప్రత్యేకించి రవాణా రంగంలో కార్మికులకు నష్టదాయకమైన చట్టాలను ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరికి నిరసనగా రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికులందరితో పాటుగా ఆర్టీసీ కార్మికులు కూడా మమేకమై సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఖమ్మం డిపో కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా పగిళ్లపల్లి నరసింహారావు, గుగ్గిళ్ల రోశయ్య, ఉపాధ్యక్షులుగా సిరిపురపు సీతారామయ్య, గుర్రం రామారావు కోశాధికారిగా డి.సరితలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్, ప్రచార కార్యదర్శి తోకల బాబు, రీజియన్ కోశాధికారి ఎస్.కె పర్వీనా, నాయకులు రంగా రామారావు, జి.కృష్ణ, బుగ్గవీటి లింగమూర్తి, మీసాల రవి, ఏ.కిరణ్, ఎండీ పర్వేజ్, హెచ్.బసవయ్య, రాజనాల నాగమల్లేశ్వరరావు, ఆర్.ఇ.వి.కుమార్, బుడిగం శ్రీను, గడ్డం అయోధ్య, ఐ.ముత్తయ్య, సిహెచ్.వీరయ్య, వై.అశోక్, బి.శంకర్, మల్లెబోయిన పెద్ద శ్రీను, వి.కే.రావు, జి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరణ

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం ఖమ్మం ప్రీమియర్ లీగ్ లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా టోర్నమెంట్‌ని నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో టోర్నమెంట్‌ని రాష్ట్ర మొత్తం మాట్లాడుకునే విధంగా నిర్వహించబోతున్నామని, దానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. త్వరలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మురళి, మిక్కిలినేని నరేంద్ర చౌదరి, డివైస్ఓ సునీల్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మొహ్మద్ మతిన్, వేళ్ళ రవి, డాక్టర్ రవి, అసిఫ్, నరేష్, వెంకట్, మహేష్, అశ్రిఫ్, శ్రీకాంత్, కరీం తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం చోరీ కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామంచికల్ గ్రామానికి చెందిన రవికిషోర్ రెడ్డి ఈ నెల 20వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ వెళ్లారు. 26వ తేదీ తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపు తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని సుమారు రూ.89వేల విలువ గల 44.5 గ్రాములు బంగారు ఆభరాలు చోరీకి గురైయినట్లు తెలిసింది.గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

50వ డివిజన్‌లో ఆత్మీయ అభినందన సభ

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని 50వ డివిజన్‌లో గుడవర్తి శ్రీనివాసరావు- కరుణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత-జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఆదివారం ఖమ్మంలోని గుడవర్తి శ్రీనివాసరావు- కరుణ నివాసంలో మంత్రి అల్పాహార చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గతంలో ఖమ్మం నియోజక వర్గ పరిధిలోని సామాన్య ప్రజలు, ఉద్యోగ-వ్యాపారస్తులు అనేక ఇబ్బందులు పడ్డారని ఈ సమస్యలను తీర్చేందుకే కావాలని, రాహుల్ గాంధీ కోరిక మేరకు ఖమ్మం అసెంబ్లీ నుంచి పోటీచేసి మీ అందరి ఆధర అభిమానాలతో భారీ మెజారిటీతో గెలిచానని తెలిపారు. ఆత్మీయ అభినందన సభకు హాజరైన ప్రతి ఒక్కరితో ఫోటోలు దిగి నేను ఉన్నాను మీకు..మీకు ఎలాంటి దిగులు లేదు అని సంతోషాన్ని నింపారు.

ఆలయానికి సిమెంట్ బెంచ్ వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలో సుబ్బయ్యకుంట చెరువుకట్టపై నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో కందకూరి గురప్ప జ్ఞాపకార్థం అతని కుమారులు సిమెంట్ బెంచ్‌ను వితరణ చేశారు. ఆదివారం గురప్ప కుమారులు కందకూరి ప్రసాద్, నరేష్, రమేష్‌లు సిమెంట్ బెంచ్‌ను ఆలయ కార్యనిర్వాకులు ఇమ్మడి తిరుపతిరావుకు అందజేశారు. ఈసందర్భంగా తిరుపతిరావు దాతలను అభినందించారు. ఈకార్యక్రమంలో సంత ఆలయ మాజీ చైర్మన మల్లెల నాగేశ్వరరావు, గ్రామపెద్దలు తురక రవి, వాసుదేవాచారి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరా డెయిరీ' ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం

- మహిళలను వాటాదారులుగా చేర్చి లాభాలను పంచటమే లక్ష్యం
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన.. ఆర్థిక తోడ్పాటు
- బోనకల్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దశగా అడుగులు

నవతెలంగాణ -బోనకల్



దేశంలోనే పెద్ద డెయిరీని మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండల కేంద్రంలో ఇందిరా డైయిరీ పేరుతో ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తాను డిప్యూటీ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజులలోనే ఆయన ఇందిరా డెయిరీపై దృష్టి సారించారు. డెయిరీ ఏర్పాటుకు సంబంధించి మధిర నియోజకవర్గంలో పర్యటించిన రెండు పర్యాయాలు అధికార యంత్రంగానికి పలు సూచనలు చేశారు. ఇందిరా డెయిరీ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని కూడా ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తాజాగా బోనకల్‌లో ఇటీవల జరిగిన పౌర సన్మాన సభలో కూడా మల్లు భట్టి విక్రమార్క తన అంతరంగాన్ని ప్రజలకు వివరించారు. జాతీయస్థాయిలో పెద్ద డెయిరీని నియోజకవర్గంలో ఏర్పాటు చేసే పనిలో ఉన్నామని చెప్పడంతో బోనకల్ మండల ప్రజలతో పాటు నియోజకవర్గ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాటాదారులుగా మహిళలు

మధిర నియోజకవర్గంలో 61వేల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. వీరందరిని వాటాదారులుగా చేర్చి లాభాలను పంచి పాడి పారిశ్రామికవేత్తలుగా మార్చడమే తన లక్ష్యమని మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందుకుగాను 2013లోనే బోనకల్ మండల కేంద్రంలో ఇందిరా డైయిరీ ఏర్పాటుకు నాటి డిప్యూటీ స్పీకర్ హెూదాలో మల్లు భట్టి విక్రమార్క బోనకల్ మండల కేంద్రంలో శంకుస్థాపన చేశారు. బోనకల్ రెవిన్యూ లేని సర్వే నెంబర్ 71లో గల గిరిజన రైతులకు ఇచ్చిన 9 ఎకరాల 24 కుంటల అసైన్డ్ భూమిని ఆనాడు సేకరించారు. నాడు దాదాపు 80 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు ఆనాడు బట్టి విక్రమార్క ప్రకటించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలోనే 4,133 మంది మహిళల నుంచి రూ.36 లక్షల వాటా ధనాన్ని కూడా వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. కొంతమంది మహిళల నుంచి రూ.500 మరి కొంతమంది మహిళల నుంచి రూ.600 నుంచి రూ.1200 వరకు వాటా ధనముగా ఇచ్చారు. నేటికీ ఈ రూ.36 లక్షలు బ్యాంకులోనే డిపాజిట్‌గా ఉన్నాయి. 2013 అక్టోబర్ 20 నుంచి 24 వరకు డ్వాక్రా మహిళలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మల్లు భట్టి విక్రమార్క గుజరాత్ రాష్ట్రంలోనే అమూల్, ఆనంద్ డెయిరీలను సందర్శించి అక్కడ నిర్వహణ తీరును పరిశీలించారు. 2013లోనే మధిరలో 'ఇందిరా పాడి పరిశ్రమల సహకార సంఘం'లిమిటెడ్ (రిజిస్ట్రేషన్ నెంబర్ 144) పేరిట సొసైటీని రిజిస్టర్ చేయించి కార్యాలయాన్ని, ప్రత్యేక అధికారిని కూడా ఆనాడు నియమించారు. ఇంతలో తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు మూలన పడింది.

యువతకు ఉపాధి కల్పన, ఆర్థిక తోడ్పాటు

డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలకు పాడి గేదెలను ఇచ్చి పాలను ఇందిరా డెయిరీ సేకరిస్తుంది. పాల మార్కెటింగ్‌తో పాటు పాల ఉత్పత్తులను విక్రయించడం, ప్రస్తుత అమూల్ కంపెనీకి మించి ఉంటుందని భట్టి విక్రమార్క ప్రకటించారు. వ్యవసాయంపై ఆధారపడిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. పాడి ఉత్పత్తి కొరకు పశువులకు కావలసిన పచ్చి, ఎండు గడ్డి, దానాను పాడి రైతుల ఇళ్లకు వెళ్లి సరఫరా చేసే పనులు ఉంటాయని ఆయన తెలిపారు. మండలాల్లో గ్రామాలను కొన్ని యూనిట్లుగా విభజించటంతో పాటు రుణాలు ఇచ్చి వాహనాలు, గడ్డి కటింగ్, దాణా మిక్సింగ్ యంత్రాలను సమకూర్చుతారు. ప్రతి మండలంలో వెటర్నరీ అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు తదితర పనులు చేస్తారు. మహిళలతో పాటు నిరుద్యోగ యువతకు ఆర్థిక తోడ్పాటుకు పలు పనులు నిర్వహణ ఉంటుంది.

మధిరలో పైలట్ ప్రాజెక్ట్ .... ఆ తర్వాత విస్తరణ

డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన చిరకాల వాంఛ అయిన ఇందిరా డైయిరీని ముందుగా మధిర నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తారు. సాధ్యమైనంత తొందరగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు పెద్ద ఎత్తున కసరత్తు ప్రారంభించారు. మహిళలందరినీ ఇందులో భాగస్వాములుగా ఉండేలా చూడాలని అధికారులకు ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. మధిర తర్వాత రాష్ట్రమంతా ప్రాజెక్టు విస్తరణ ఉంటుందని మల్లు విక్రమార్క ప్రకటించారు. బోనకల్లో ఇందిరా డైయిరీ ఏర్పాటుకు మార్గం శుభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా బోనకల్‌కు తగిన గుర్తింపు లభిస్తుందని మండల ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే రోడ్ల సౌకర్యాలు, భూములకు మంచి ధరలు, మండలం అత్యంత వేగంగా అభివృద్ధి పథంలో నిలుస్తుందని మండల ప్రజా ప్రతినిధులు, ప్రజల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ ఏజెన్సీలో దోపిడిని అరికట్టే వారు లేరా..?



- ట్రాన్స్‌ఫోర్ట్ పేరుతో వినియోగదారుల నుండి అధిక వసూళ్లు
- చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-వేంసూరు

గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల నుండి అధికంగా నగదు వసూలు చేస్తున దోపిడిని అరికట్టే వారే లేరా అంటూ వినియోగదారులు లబోదిబో మంటున్నారు. దీంతో వినియోగదారులపై అధిక భారం పడుతుంది. మండల కేంద్రంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ ఆగిపోవడంతో సత్తుపల్లికి చెందిన రెండు గ్యాస్ ఏజెన్సీలు ఇదే అదునుగా భావించి ట్రాన్స్‌ఫోర్ట్ పేరుతో అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతూ దోపిడి చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక్కో గ్యాస్ బండకు 100 నుండి 300 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత్యంతరం లేని పరిస్థితిలో వినియోగదారులు తీసుకోక తప్పడం లేదు. వేంసూర్ ఏజెన్సీ పేరుతో ఉన్న కార్డులను ముందుగా బుక్ చేసుకుంటేనే గ్యాస్ ఇస్తామని చెప్పి ఈ సాకుతో బుకింగ్ చేసుకుంటే ఒక రేటు, లేకుంటే మరొక రేటు చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు అంటున్నారు. బుకింగ్ చేసుకున్న రోజునుడి రోజుల తరబడి రోడ్డుపైన గ్యాస్ బండలు పెట్టి పనులు మానుకొని వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ కనెక్షన్లు బుకింగ్ లేకుండానే హెూటల్లు, బేకరీలకు గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ బండలను సప్లై చేయటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్తుపల్లి నుండి వేంసూరు మండలానికి గ్యాస్ సరఫరా చేస్తున్నా రెండు గ్యాస్ ఏజెన్సీల ఆగడాలను అరికట్టించి నిబంధనలు మేరకు గ్యాస్ సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోనట్లయితే నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అంటున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లై బీటీ సత్యనారాయణ వివరణ కోరగా అధిక రేట్లు తీసుకున్నట్లయితే ఆయా గ్యాస్ ఏజెన్సీలుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కల్లూరు ఎస్సైగా ఎస్‌కే. షాకీర్

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మండల ఎస్సైగా ఎస్‌కే. షాకీర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్ఐగా పని చేస్తున్న పూదీ రఘు, ఖమ్మానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో ఖమ్మం నుండి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతి భద్రతలు కాపాడతానని అందుకు రాజకీయ నాయకులు ప్రజలు సహకరించాలని కోరారు.

మంత్రి తుమ్మలను సన్మానించిన కూరగాయల రిటైల్ వ్యాపారస్తులు



నవతెలంగాణ-ఖమ్మం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుని ఖమ్మం కూరగాయల రిటైల్ వ్యాపారస్తుల అధ్యక్షుడు ఎండీ. ఫజల్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం ఖమ్మంలోని 50వ డివిజన్లో జరిగిన కార్యక్రమంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఏఎంసీ రిటైల్ వ్యాపారస్తుల అధ్యక్షులు ఎండీ. ఫజల్ మాట్లాడుతూ కూరగాయల మార్కెట్లోలో ఉన్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా మీ కూరగాయల మార్కెట్ను త్వరలో వచ్చి సందర్శిస్తారని హామీ ఇచ్చారని చెప్పారు. అదేవిధంగా మీ సమస్య ఏమైనా ఉంటే తన దగ్గరికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారని తెలిపారు.

మహిళా సాధికారతకు కాంగ్రెస్ పెద్దపీట

-ఎస్ఎస్ఎస్ పోస్టర్ ఆవిష్కరణలో తుంబూరు దయాకర్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. శక్తి సూపర్ షీ (ఎస్ఎస్ఎస్) విభాగం జిల్లా కో ఆర్డినేటర్‌గా హారిక నాయుడు ఎంపికైన సందర్భంగా ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎస్ఎస్ ఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అండగా నిలిచేందుకు, వారి హక్కుల పరిరక్షణకు ఇది దోహదపడుతుందన్నారు. మహిళలను మరింతగా ముందుకు నడిపేందుకు ఈ సంఘం కృషి చేస్తుందన్నారు. మహిళా రక్షణ, వారికి భరోసానిచ్చేలా ట్రిబుల్ ఎస్ కార్యకలాపాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మంలో సినీ నటి షహరి సందడి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మంలోని ప్రముఖ సినీనటి (స్కంద) ఫేమ్ సుంకర షహరి ఆదివారం ఖమ్మంలో సందడి చేశారు. ఒక ప్రైవేటు ఛానల్‌కు చెందిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మంకు విచ్చేసిన సినీ నటి షహరి ఖమ్మం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో గల కమల మెడికల్ హాల్ ఎదురుగా డాక్టర్ పెరుమాళ్ళ శ్యాంసుందర్ హాస్పిటల్ భవన సముదాయంలో గల శ్రీ సాయి మ్యారేజ్ బ్యూరో సంస్థ కార్యాలయంలో మ్యారేజ్ బ్యూరో సంస్థకు చెందిన ఎస్ఎస్ మ్యాట్రిమోనీ డాట్ కం అనే నూతన వెబ్సైట్ను సినీ నటీ షాహరి శ్రీ సాయి మ్యారేజ్ బ్యూరో సంస్థ ల్యాప్‌టాప్ ద్వారా లాంచనంగా ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టులు రామకృష్ణ, జానీపాషా, జగదీష్ లు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన సినీ నటి షాహరి మరిన్ని పెద్ద ప్రాజెక్టులలో మంచి చిత్రాలలో నటించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గుర్తింపు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో బ్రాహ్మణపల్లి విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రావినూతలలో ఆదివారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలలో తెలుగు మీడియం నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బ్రాహ్మణపల్లి విద్యార్థులు గుడిద అఖిల, గుడిద ఉమశ్రీ, పెద్దప్రోలు వెంకటస్వాతి ప్రథమ స్థానం సాధించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలను జనవిజ్ఞాన వేదిక బోనకల్ పిల్లల మరి వెంకట అప్పారావు బృందం అందజేసింది. అనంతరం విద్యార్థులను అభినందించింది. చెకుముకి పోటీల టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వల్లూరి శ్రీనివాస్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుగులోతు రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ముగ్గురు విద్యార్థులు ఒకే పోటీలలో ప్రథమ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఇటువంటి టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతి విద్యార్థి పాల్గొని తన నైపుణ్యాన్ని తెలివితేటలను పెంచుకోవడం ద్వారా భవిష్యత్తు పోటీలకు ఎంతో ఉపయోగకరంగా ఇది ఉపయోగపడుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక వారు పాఠశాలలో ఇటువంటి పోటీలను నిర్వహిస్తూ విద్యార్థులను ఎంతో ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందం అన్నపూర్ణాదేవి, ఎస్.రామకృష్ణ, పి. పుల్లారావు, శారద, రంజాన్ అలీ, రవికుమార్, నసీమా సుల్తానా అభినందించారు.



ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్యవైశ్యులు

నవతెలంగాణ-కల్లూరు

సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి ఆర్యవైశ్య కళ్యాణ మండపానికి తొలిసారిగా వచ్చిన సందర్భంగా కమిటీ సభ్యులు సంకా రాంబాబు, పుల్లారావు, నగేష్, శాలవతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తోలిత మండలంలోని పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పసుమర్తి చంద్రరావు, భాగం ప్రభాకర్, నగేష్, బొప్పన శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి

- సమస్యలు పరిష్కరించిన సర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు



మండల పరిధిలోని హనుమ తండా గ్రామపంచాయతీ అభివృద్ధికి సర్పంచ్ ధరావత్ మోహన్ విశేష కృషి చేశారని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ అన్నారు. ఆదివారం హనుమాతాండ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా శాసన సభ్యురాలు డాక్టర్ మట్ట రాగమయి పాల్గొని సర్పంచ్ దంపతులను వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి మాట్లాడుతూ సర్పంచిగా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ధరావత్ మోహన్‌నాయక్‌కు అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతీలోని గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం మోహన్ నాయక్ విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. ఈ ఐదు ఏళ్లలో హనుమాన్ తండా గ్రామపంచాయతీ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని ప్రజల సమస్యల పరిష్కారం కోసం ధరావత్ మోహన్ నాయక్ కృషి అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ప్రజా పాలనలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. ఎమ్మెల్యేగా తన గెలుపు కోసం కృషి చేసిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మీరిచ్చిన ఈ అధికారంతో అధికారంతో గ్రామంలోని దీర్ఘకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమాతాండ గ్రామపంచాయతీలోని మహిళలందరికీ సర్పంచ్ మోహన్ నాయక్ చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, బానోతు సైదా నాయక్, ధరావత్ రవికుమార్ నాయక్, బానోతు కుమార్, ఉప సర్పంచ్ సూరా నాయక్ తోపాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



- టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యక్షురాలు చావా దుర్గభవాని

నవతెలంగాణ-చింతకాని

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గభవాని డిమాండ్ చేశారు. చింతకాని మండల శాఖ పదవ మహాసభ ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో జరిగిన మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, పదోన్నతులు బదిలీలు విషయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ విషయాలపై తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం సమస్యలు తీర్చాలని తెలియజేశారు. ఈ మహాసభలో చింతకాని మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తోటకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఉదారపు నాగేశ్వరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మందడపు రామనరసింహారావు, మన్నేపల్లి విజయలక్ష్మి, కోశాధికారిగా కారుమంచి జయకర్, కార్యదర్శులుగా భాగ్య, సుధాకర్‌రావు, రమణ,



నరసింహారావు, వాసు, విజయలక్ష్మి, మండల ఆడిటర్‌గా తలగాని వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తోటకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో టీఎస్ యుటిఎఫ్ మండల శాఖ ఎల్లప్పుడూ ఉపాధ్యాయులకు సహకరిస్తూ ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తానని నూతన కమిటీ పక్షాన తెలియజేశారు.

బిల్డింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని మంత్రి తుమ్మలకు వినతి

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం జిల్లా లేబర్ ఆఫీసులో జరుగుతున్న దారుణాలపై బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దోనోజు లక్ష్మయ్య, మదాం శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 4000 సమస్యలు పెండింగ్లో ఉన్నవి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాకు పర్మినెంట్ డిసిఎల్ లేకపోవడం వలన కార్మికులకు నష్టం జరుగుతున్నదన్నారు. ఇన్‌చార్జి డిసి ఎల్ రెండు నెలలకు ఒకసారి రావడం వల్ల పనులు జరగడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిపారు. అలాగే లేబర్ ఆఫీస్‌లో దళారులు చాలామంది తయారై ఆఫీసుకు వచ్చిన ఫైళ్లను అధికారులు దళారుల ద్వారా లబ్ధిదారుల కాడికి పంపించి ఈ అప్లికేషన్లో ఆ సర్టిఫికెట్ లేదని, ఈ సర్టిఫికెట్ లేదని అబద్దాలు చెప్పి ఆఫీసులో పక్కకి పడేస్తున్నారు. ఫైలు నేను తీసుకొచ్చాను నేను చేపిస్తాను కొంత ఖర్చు అవుతుందని లబ్ధిదారులకు చెప్పి బెదరపెట్టి సగం సొమ్ము అధికారులు, దళారులు పంచుకుంటున్నారని ఆరోపించారు. ప్రత్యక్షంగా కామేపల్లి మండలం సాతానుగూడెం గ్రామానికి చెందిన దుద్దుకూరు రాంబాబు యాక్సిడెంట్ లో చనిపోతే అతనికి సంబంధించిన ఫైలు ఒక దళారికి ఇచ్చి పంపించి మొదట పెట్టినటువంటి అకౌంట్ మార్పించి కెనరా బ్యాంకులో కొత్తగా అకౌంట్ తీపించి చెక్ బుక్ ఏటీఎం కార్డు దళారీ దగ్గర పెట్టుకొని ఆరు లక్షల 30 వేల రూపాయలు లబ్దిదారుని ఖాతాలో పడితే అవి డ్రా చేసుకొని 3 లక్షల 30 వేలు మాత్రమే ఆమెకి ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగతా మూడు లక్షలు అధికారులు, దళారులు కలిసి పంచుకోవడం జరిగిందని, ఈ విషయం మంత్రి దృష్టికి తీసుకెల్లామని, పిలిపించి మాట్లాడి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారని చెప్పారు. ఈ విధంగా జిల్లాలో అనేకం జరుగుతున్నట్టు తెలిపారు. ప్రతి మండలానికి ఇద్దరు ముగ్గురు దళారులు తయారైనారని వారు తెచ్చిన ఫైలు ముందుగా పరిష్కారం అవుతున్నాయని, కార్మికులు అప్లై చేసిన ఫైలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని, తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుమాళ్ళపల్లి మోహన్‌రావు, మేడికొండ నాగేశ్వరరావు, ఎర్ర మల్లికార్జున్, టీవీ. రమణ, దోనోజు పాపాచారి, గూడ రాంబ్రహ్మం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభ

- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) ఇనిషియేటివ్ మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య కోరారు. మండల పరిధిలోని యం. వెంకటాయపాలెంలో పార్టీ జనరలాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం అచ్చయ్య మాట్లాడారు. వర్తమాన భారత విప్లవోద్యమం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని, సరైన ప్రజాపంథా రూపు దిద్దుకోవడానికి, మారిన పరిస్థితులను అంచనా వేయడానికి, పెట్టుబడిదారీ విధానం విసిరే సవాళ్లను అధిగమించడానికి కమ్యూనిస్టు విప్లవోద్యమం సైతం మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ కృషి కొనసాగింపే మూడు పార్టీల ఐక్యత అని వివరించారు. మార్చి 3వ తేదీన ఖమ్మంలో ప్రదర్శన, పెవిలియన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. సభకు ప్రజలు,మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా నాయకుడు మలీదు నాగేశ్వరరావు, కుర్ర వెంకన్న, మల్లయ్య, పూలమ్మ, యాదగిరి, రామదాసు, దొండేటి సత్యం, వెంకటయ్య, లెనిన్, స్వామి, లలిత, పుల్లయ్య, ఉపేందర్, సర్పంచ్ సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళలకు చీరలు వితరణ

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు మందిరంలో ఆదివారం అక్కడి 50మంది పేద వృద్ధ మహిళలకు చీరలను వితరణ చేశారు. ఉపాధ్యాయుడు కొలకనూరి బాలస్వామి, సబిత దంపతుల సౌజన్యంతో రూ. 10వేల విలువగల చీరలను స్థానిక సువార్తకులు అలవాల కరుణాకర్, లక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఈ చీరలను వృద్ధులకు పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రైస్తవ పెద్దలు కొత్తపల్లి ప్రభాకర్, అనిల్‌కమార్, తడికమళ్ల ప్రకాశరావు, నల్లగట్ల భాస్కరరావు, నూతక్కి నవకుమార్, ఇనపనూరి నాగేశ్వరరావు, కంటిపూడి వెంకటేశ్వరరావు, పాస్టర్ పూరేటి సామేలు పాల్గొన్నారు.




పింఛన్ బిక్షకాదు...గౌరవం

పింఛన్ దారుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్జీపీఏటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

నవతెలంగాణ-ఖమ్మం

పింఛన్ బిక్షగాదని, సుదీర్ఘకాలం సేవలందించినందుకు ఇచ్చే గౌరవం అని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ. నరసింహారావు తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి సత్వర పరిష్కారాలని చూపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పడి 47 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధ్యక్షులు పరిశి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ వేతనం తీసుకున్నప్పుడు పింఛన్ ఎందుకు అన్న వాదనను కొందరు వినిపించి పింఛన్ రద్దు కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. ఈ సమయంలో పింఛన్ హక్కుగా పొందామని తెలిపారు. పింఛన్దారుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఏ పాలకుల పట్ల పెన్షనర్స్ సంఘం ఉదాసీన వైఖరి ప్రదర్శించలేదన్నారు. పింఛన్దారుల హక్కుల కోసం జరిగే పోరాటంలో అన్ని సంఘాల కంటే ముందు ఉన్నామన్నారు. 24 జిల్లాల్లో బలమైన సంఘంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఉందని చెప్పారు. పింఛన్దారులకు గౌరవం, హక్కులు రెండు కళ్ళలాంటివని, వాటి కోసమే పెన్షనర్ల సంఘం పనిచేస్తుందన్నారు. ప్రత్యేక సమావేశం సందర్భంగా పలువురు సీనియర్ పెన్షన్ దారులను సన్మానించారు. ఈ సమావేశానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఈ సోమశేఖర్ శర్మ, ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి సత్యనారాయణ, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పురుషోత్తమరావు, బి నర్సింగరావు, బాల మల్లేష్,జిల్లా కార్యదర్శి కే. కృష్ణమూర్తి, కోశాధికారి వెంకటేశ్వర్లు , దగ్గుల కాంతారెడ్డి, వనం వెంకట అప్పారావు, జగదీష్,చంద్రనియోగి, వేముల మధుసూదన రావు, ఎరమల రామలింగారెడ్డి , అనంత పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.



డీసీసీబీ చైర్మెన్ పదవి మల్లిబాబు యాదవ్‌కు ఇవ్వాలి

- యాదవ, గొర్రెల పెంపకం దారుల, బీసీ సంఘాల డిమాండ్

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఖమ్మం డిసిసిబి చైర్మన్ పదవిని మేకల మల్లిబాబు యాదవ్‌కు ఇవ్వాలని జిల్లా యాదవ సంఘం, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం, బిసి సంఘాల జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి ఆదివారం నేలకొండపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల జిల్లా బాధ్యులు మల్లెబోయిన శ్రీనివాస్, కనకబండి రమేష్, మల్లెబోయిన ఉపేందర్ చిలకల లింగయ్య, మారుతి కోటి మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడి డిసిసిబి చైర్మన్ పదవి కూరాకుల నాగభూషణం కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఖమ్మం జిల్లా అగ్రకుల నాయకుల రాజకీయ చదరంగంలో ఎటు చూసినా బలి అయ్యేది బీసీ సంఘాలేనని ఆవేదన వ్యక్తం చేశారు. 15 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా డిసిసిబి డైరెక్టర్‌గా, 25 సంవత్సరాల పాటు జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ అధ్యక్షులుగా, కామేపల్లి మాజీ జెడ్పిటిసిగా, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా, ఇల్లందు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా గొర్రెల పెంపకం దారుల స్టేట్ డైరెక్టర్‌గా మచ్చలేని రాజకీయ నాయకుడిగా మేకల మల్లిబాబు పనిచేశారన్నారు. అటువంటి నాయకుడికి డిసిసిబి చైర్మన్ పదవి కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ రథసారథులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నూక వెంకటేశ్వరరావు, చంద్రకాని మధు, బొమ్మ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 1 నుంచి సీలింగ్ కార్మికుల సమ్మె

- యూనియన్ అధ్యక్షులు కోలా సాగర్

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్‌లో ఉన్న యూనియన్ కార్యాలయంలో సీలింగ్ వర్క్ చేస్తున్న కార్మికులకు,కాంట్రాక్ట్ మెస్త్రీలకు పెరిగిన ధరలకు తగ్గట్లుగా కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి1 నుంచి 10 వ తేదీ వరకు సమ్మె బాట పడుతున్నట్లు సీలింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు కోలాసాగర్ తెలిపారు. ఆదివారం జడ్పీ సెంటర్‌లో ఉన్న యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీలింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు కోలాసాగర్ మాట్లాడుతూ..సీలింగ్ వర్క్‌లో ఫీట్‌కు రూ. 18 ఇచ్చే రేటు ను రూ.25 లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు ఇంటి యజమానులు, బిల్డర్లు సహకరించాలని కోరారు. యూనియన్ గుర్తింపు(ఐడి కార్డు) కలిగిన కలిగిన వర్కర్స్, కాంట్రాక్ట్ మెస్త్రీలతో మాత్రమే సీలింగ్ పనిని అగ్రిమెంట్ చేసుకోవాలని సూచన చేశారు. గుర్తింపు లేని వర్కర్లకు సీలింగ్ పనులు అప్పగించి ఓనర్లు ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని అన్నారు. సీలింగ్ వర్క్ ఏకారణం చేతనైన నిలిస్తే, సమస్యను యూనియాన్ దృష్టికి తెస్తే సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ కార్డు లేని వర్కర్లకు పనులు ఇవ్వొద్దని చెప్పారు. ప్రమాదం జరిగిన ఎడల వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం ఉండదు. కాబట్టి పని ఇచ్చి ఇబ్బంది పడొద్దని సూచన చేశారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి కోలా సాగర్, గౌరవ అధ్యక్షులు ప్రసాద్ మోరియా, నందలాల్, ప్రజాపతి శివకుమార్, కోశాధికారి గుండా శ్రీనివాస్‌రెడ్డి, సమీర్, రామ్, సాజన్ ప్రియా రమేష్, దాసరి శివ, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ ఎస్సైగా కొండలరావు

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ ఎస్సైగా కొండలరావు బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం రఘునాథపాలెం ఎస్సైగా పనిచేస్తున్న కొండలరావు తల్లాడకు బదిలీ అయినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. తల్లాడ ఎస్సై పి. సురేష్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కొండలరావు బాధ్యతలు చేపట్టనున్నారు.



తులస్య దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూలూరుపాడు

మండలంలోని కరివేరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో తవిసిగుట్ట గ్రామంలో ఆదివారం జరిగిన కీ.శే.బోడ తులస్య దశ దినకర్మకు వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ హాజరై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్, బోడా గణేష్ బాబు, కృష్ణన్న (సర్పంచ్), బోడ శాంతిరాం, బోడ భీమారావు, బోడ భాస్కర్, ధరావత్ లక్ష్మీ నారాయణ, గూగులోతు శంకర్, చింతలపూడి వజీర్, బోడా బాబూలాల్, గుగులత్ రాంబాబు, మంద బాబు, తాటికొండ ప్రసాద్, మిరియాల కిరణ్ కుమార్, వడ్డే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



నవతెలంగాణ-ములకలపల్లి

మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో రైతువేదిక వద్ద ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని, కొత్తగూడెం లక్ష్మిదేవిపల్లి విజయనర్సింగ్ హోం సంయుక్త ఆధ్వర్యంలో-ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీటీసీ సునీత ప్రారంభించగా శిబిరంలో వైద్యురాలు విజయలక్ష్మి, శంకర్రావు, రూపలు రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు కేదారేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో మాతో పాటు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నందుకు ఆసుపత్రుల నిర్వాహకులను అభినందించారు. ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్, రక్తపరీక్షలు చేసి మందులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గంగారం ఎంపీటీసీ తులసి, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, డిస్ట్రిక్ట్ వైస్ కోఆర్డినేటర్ షేక్ దస్తగిరి, క్లబ్ సభ్యులు కనకం శరత్ కుమార్, గ్రామ పెద్దలు అడపా నాగేశ్వరరావు, గౌస్, రహీం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన కొబ్బరి వృక్ష మిత్రుల శిక్షణ



నవతెలంగాణ-అశ్వారావుపేట

కొబ్బరి వృక్ష మిత్రుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు ఆదివారం శిక్షణార్థులు అందరినీ ఉద్యానవన పరిశోధన స్థానం, కొబ్బరి విత్తన కేంద్రంలో క్షేత్ర దర్శన నిర్వహించారు. ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయకృష్ణ కొబ్బరి నర్సరీ యాజమాన్య పద్ధతులు వివరించారు. కొబ్బరి విత్తనోత్పత్తి కేంద్రం అధికారి, ఉద్యాన శాఖ మండల అధికారి జే.కిషోర్ కొబ్బరి విత్తనోత్పత్తిలో యాజమాన్యం పద్ధతులను, నర్సరీ నిర్వహణ, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేసారు. వ్యవసాయ విద్యను అభ్యసించే నాలుగో సంవత్సరం విద్యార్థులు ఏఈఎల్పీ కమర్షియల్ హార్టికల్చర్ (AELP Commercial Horticulture) విభాగం విద్యార్థులు కూడా క్షేత్ర దర్శనలో పాల్గొన్నారు. వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగం, అధ్యాపకులు కే.శిరీష ఈ క్షేత్ర దర్శనను సమన్వయ పరిచారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రఘు, శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ హైస్కూల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు రాంచరణ్

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ హైస్కూల్స్‌లో నెలకొన్న సమస్యలు వెంటనే పరించాలని ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం డివిజన్ ఉపాధ్యక్షులు రాంచరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణంలో ప్రభుత్వ హైస్కూల్స్‌ను ఆయన సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. హైస్కూల్లో సమస్యలు వున్నాయని గుర్తించారు. ఈ సందర్భంగా రాంచరణ్ మాట్లాడుతూ హైస్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గత నెల రోజులుగా కోడి గుడ్డు పెట్టడంలేదన్నారు. రాగి జావ సక్రమంగా ఇవ్వడంలేదని ఆరోపించారు. వాష్ రూమ్‌లు సక్రమంగా శుభ్రం చేయడంలేదన్నారు. మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి హైస్కూల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో విద్యార్థులతో ఎంఇఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సాగర్, హైస్కూల్ విద్యార్థుల పాల్గున్నారు.

అనుమతులు లేని మట్టి ట్రాక్టర్లు పట్టివేత



నవతెలంగాణ-దమ్మపేట

మండల పరిధిలోని అనుమతులు లేకుండా మట్టి తోలకం నిర్వహిస్తున్న 4 మట్టి ట్రాక్టర్లను పట్టుకుని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కి తరలించారు. స్టేషన్ ఎస్సై సాయి కిశోర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. .ఆదివారం మల్లారం గ్రామం నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నట్టు 100కి సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి మట్టి ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్ తరలించి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సోమవారం రెవెన్యూ అధికారులను అప్పగించనున్నట్టు ఎస్సై తెలిపారు.



ఆత్మరక్షణ, ఆరోగ్యానికి మార్షల్ ఆర్ట్స్ దోహదం

- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం క్రీడలను ప్రోత్సహించాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆత్మరక్షణకు, ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఇంద్రాల శ్రీధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఉర్దూ ఘర్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి 2024 రిపబ్లిక్ కప్ ఓపెన్ కరాటే క్రీడాపోటీలు ఆదివారం పాష ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మార్షల్ ఆర్ట్సుకు, క్రీడలు, సాంస్కృతి రంగాలకు అనాదిగా కొత్తగూడెం పట్టణం వేదికగా నిలుస్తోందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబర్చి ఈ ప్రాంతానికి పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన వారు ఎందరో వున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తుల సురేష్, వాసు, మురుగన్, శేఖర్, నాగేశ్వర్ రావు, పవన్ రెడ్డి, పవన్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు గెద్దాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా సీఎంఓఏఐ ఎన్నికలు



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియాలో ఆదివారం ఆర్‌సీఓఏ క్లబ్, సత్తుపల్లిలోని ఎగ్జిక్యూటివ్‌లకు జెవిఆర్ ఓసీ ఆఫీసర్స్ క్లబ్ నందు సీఎంఓఏఐ ఎన్నికలు శాంతి యుతంగా నిర్వహించినట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో 92 ఓట్లకు గాను 85 ఓట్లు పోలింగ్ అయినట్లు చెప్పారు. సత్తుపల్లిలో 76 ఓట్లకు గాను 75 ఓట్లు పోలింగ్ అయినట్లు తెలిపారు. మొత్తంగా కొత్తగూడెంలో 168 ఓట్లకు గాను 160 ఓట్లు తో 95 శాతం పోలింగ్ అయినట్లు తెలిపారు.

తూకాలలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- జిల్లా తూనికలు కొలతలు శాఖ అధికారి కె.మనోహర్



నవతెలంగాణ-కొత్తగూడెం

వ్యాపారులు తూకాలలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా తూనికలు కొలతలు శాఖ అధికారి కె.మనోహర్ హెచ్చరించారు. ఆదివారం కొత్తగూడెం వారాంతపు సంతలో జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయదారుల తూకాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువు తూకంలో వినియోగదారులు నిశితంగా పరిశీలించాలని చెప్పారు. వ్యాపారస్తులు ఉపయోగించే తూనికలు కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించుకొని లైసెన్స్ తీసుకోవాలని చెప్పారు. తూనికలు సక్రమంగా లేని పలువురు వ్యాపారస్తులపై 5 కేసులు నమోదు చేసి, రూ.12 వేల కామ్ పౌండింగ్ ఫీజు రుసుము విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

ముందుకు సాగని తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి

- అధికారులకు పట్టని ఎల్‌డబ్ల్యూ అభివృద్ధి పనులు
- ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గిరిజన ప్రజా జీవితాల్లో వికాసం కరువు



నవతెలంగాణ-కొత్తగూడెం

ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ గిరిజన ప్రజల జీవితాల్లో వికాసం నింపేందుకు, వారిలో చైతన్యం, నాగరిక ప్రపంచంలోకి తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది.... ఇలాంటి అభివృద్ధి అనులపై అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు...రోడ్లు, వంతెనలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు ఉన్నాయి. పలు అభివృద్ధి పనులకు గాను గత దశబ్ద కాలంగా వందల కోట్ల నిధులు ప్రభుత్వాలు వెచ్చించించినా.....గిరిప్రజాజీవన వికాసం...అభివృద్ధి శూన్యమనే చెప్పాలి.

పూర్తిగా ఏజెన్సీ, నక్సల్ ప్రభావిత ప్రాంతం అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాలలో చేపట్టిన పలులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని తెలుస్తుంది.ఎ ల్‌డబ్ల్యూ నిధులతో చేపట్టిన పనుల అభివృద్ధిలో అధికారుల నిర్లక్ష్యం పూర్తి కనిపిస్తుందని విమర్శల ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యత, పర్యవేక్షణలేక ఎండ్ల తరబడి పనులు నత్తనడకన సాగుతున్నప్పటికీ ఏజెన్సీ వాసులు ప్రశ్నించక పోవడంతో అధికారులకు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. పనులు నిర్ధేశించిన సమయానికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ, నత్తనడకన సాగుతున్నాయని నివేదికలు పట్టి తెలుస్తుంది. వామపక్ష ఉగ్రవాదాన్ని అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అందించే లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం నిధులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన పనులపై ప్రజా ప్రతినిధులు పట్టి పట్టనట్లు ఉన్నారు. దీంతో అధికారులు అడింది ఆటగా సాగుతుంది. పనులు వేగవంతం చేయడంలేదు. ముఖ్యంగా అటవీ, ఏజన్సీ మారుమూల ప్రాంతాల్లో పనులు ఉండటంతో ప్రశ్నించే నాధుడే లేకుండా పోయారు. ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలో రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యం జరుగుతుందని అనేక ఆరోపనలు ఉన్నాయి. పనులు పూర్తికాకపోవడానికి సంబంధిత గుత్తెదారులు ఆలస్యనికి పొంతన లేని సాకులు చెబుతున్నారని, బిల్లు రావడంలేదని వాపోతున్నారని సమాచారం. దీంతో నిర్లక్ష్యంగా పనులు సాగుతునే ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 76 పనులకు గాను రూ.341 కోట్ల 26 లక్షలు మంజూరు అయ్యాయని, వాటిలో 38 రోడ్లు 227 కిలోమీటర్లు నిడివితో మొత్తం 38 బ్రిడ్జిల నిర్మాణం సాగుతుందని జిల్లా ఉన్నతాధికారలు చెబుతున్నారు. పనుల ఆలస్యనికి ఫారెస్ట్ క్లియరెన్స్‌లు లేక పనులు నిలిచి పోతున్నాయని వారంటున్నారు.

పనులు వేగంగా సాగాలి...మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెండింగ్‌లో ఉండి ముందుకు సాగని తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనులపై రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖలమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వాటి క్లియరేన్స్ కోసం మంత్రి తుమ్మల సీఎంవో ఉన్నత అధికారులతో మాట్లాడి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారని సమాచారం. మంత్రి తుమ్మల చొరవతో 7 రహదారులు, 10 బ్రిడ్జిలకు ఫారెస్ట్ క్లియరెన్స్‌లు వచ్చాయని, ఆ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారని తెలిసింది. ఇంకా 25 పనులకు ఫారెస్ట్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. వీటిపై ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ అఫ్ ఫారెస్ట్‌తో, సీఎం.వో అధికారులతో మాట్లాడి త్వరితగతిన అనుమతులు మంజూరు అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. ఇవి త్వరిత గతిన పూర్తయితే ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు విద్యా, వైద్యం, మార్కెటింగ్, వ్యవసాయ రంగంలో అభివృద్ధి కావాలంటే రహదారులే కీలకం. అలాంటివి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇంకా చిన్న వాగులు, వంకలు, నదులపై బ్రిడ్జిలు నిర్మాణం చేయాల్సి ఉంది. అప్పుడే ఏజెన్సీ వాసులు ఆధునిక సమాజం వైపు అడుగులు వేసేలా అభివృద్ధి సాధ్యమవుతుంది.





రుణమాఫీ చేసేంతవరకూ బ్యాంకులకు రుణాలు చెల్లించొద్దు

- కాసాని ఐలయ్య డిమాండ్

నవతెలంగాణ-ములకలపల్లి

ప్రభుత్వం రైతురుణాలు మాఫీ చేసేంతవరకు రైతులు బ్యాంకుల్లో రుణాలు చెల్లించవద్దని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ములకలపల్లిలోని జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేశారని, రైతులకు చేయడంతో మాత్రం ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్పొరేట్ శక్తులు మనదేశంలో లక్షల కోట్లు అప్పులు చేసి విదేశాలకు పారిపోయినా వసూలు చేసి జనదన్ ఖాతాల్లో ప్రజల అకౌంట్లలో రూ.15లక్షలు చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం నేటికీ అమలుచేయలేదని మండిపడ్డారు. 2023, 2024 సంవత్సరాల్లో రూ.3లక్షల కోట్లు కార్పొరేట్ సంస్థలు చేసిన అప్పులు మాఫీ చేశారని ఆరోపించారు. రైతు రుణాలు, గేదెల రుణాలు, గోల్డ్ రుణాలను బ్యాంకు అధికారులు జప్తుల పేరుతో రైతులను ఒత్తిడి చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఎరువులు, పురుగుమందుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, రైతుబంధు నగదు రైతుల ఖాతాల్లో వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్, గోపగాని లక్ష్మినరసయ్య, గొగ్గల ఆదినారాయణ, వర్సా శ్రీరాములు, శ్రీదేవి, గడ్డం వెంకటేశ్వర్లు, కుర్సం ముత్యాలు, భద్రం, బొర్రా జోగయ్య తేజావత్ జగ్గు తదితరులు పాల్గొన్నారు.

హస్తవ్యస్తంగా పాపికొండల పర్యటన

- పర్యటకులతో ఆటలాడుతున్న బోటు నిర్వాహకులు
- టిక్కెట్ కొన్న బోటు ఎక్కని 200 మంది పర్యటకులు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చి గోదావరి నదిలో విహరిస్తూ పాపికొండల ప్రకృతి అందాలను తిలకించాలన్న ఆశతో భద్రాచలం వచ్చిన పర్యాటకులకు బోటు నిర్వాహకుల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడటమే కాక టికెట్ కొన్న బోటు ఎక్కలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. రిపబ్లిక్ డే శనివారం, ఆదివారం వరుసగా మూడు రోజులు సెలవు దినాలు కావడంతో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు భద్రాచలం విచ్చారు. భద్రాద్రి రామయ్య దర్శనం అనంతరం ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన బోటు విహార యాత్రకు ముందుగానే టికెట్లు బుక్ చేసుకుని పయనమై భద్రాచలం నుండి 55 కిలోమీటర్లు రోడ్డు మార్గంలో పయనించి పాపికొండల బోటు పాయింట్ పోచారం వద్దకు చేరుకొన్నారు. పిల్లాపాపలతో గోదావరిలో విహరిస్తూ ప్రకృతి అందాలను వీక్షించేందుకు సిద్ధమైన 200 మంది పర్యటకులు బోటు నిర్వాహకుల వ్యవహార శైలితో సాయంకాలం దాకా ఎదురు చూసి నిరాశతో బోటు ఎక్కకుండానే భద్రాచలంకి తిరుగు పయనమైన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం పాపికొండల విహారయాత్రలో బోటు గోదావరిలో మునిగిన ఘటనలో సుమారు 75 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఆ సంఘటన నేపథ్యంలో సుమారు రెండు సంవత్సరాలపాటు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ పాపికొండలు విహారయాత్రను నిలిపివేసి అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ కచ్చితంగా నిబంధన పాటిస్తూ సంవత్సరానికి కేవలం 10 నెలలు మాత్రమే జులై, ఆగస్టు నెల మినహాయించి పాపికొండలు పర్యటన పున ప్రారంభించిన విషయం తెలిసిందే. మొత్తం 21 బోట్లు ఉండగా 1200 మంది పర్యటకులు పయనించే అవకాశం ఇచ్చారు. పేరుకే పాపికొండల విహారయాత్ర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉన్నప్పటికీ ఎక్కువ శాతం పర్యటకులు భద్రాచలంలోనే టికెట్లు బుక్ చేసుకొని రామయ్య దర్శనం అనంతరం విఆర్‌పురం మండలం పోచవరంకి రోడ్డు మార్గాన చేరుకొని అక్కడనుండి బోటులో విహరిస్తూ పాపికొండలు అందాలను తిలకించి తిరిగి సాయంత్రం భద్రాచలం చేరుకోవటం జరుగుతుంది. ఇంతవరకు బాగానే ఉన్నా కాసుల కక్కుర్తి పడి బోటు నిర్వాహకులు యూనియన్ ఏర్పడి వారి ఆధ్వర్యంలో భద్రాచలం దేవస్థాన ప్రాంతంలో నాలుగు బుకింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా పాపికొండల టికెట్లు బుక్ చేసే ఏజెంట్లకు కమిషన్ వస్తుందన్న ఆశతో ఇష్టానుసారంగా పరిమితిని మించి టికెట్లు విక్రయించడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. శని, ఆదివారాలే పర్యటకులు అధికంగా ఉండటంతో బోటు నిర్వాహకులతో సంప్రదించకుండానే భద్రాచలంలో బుకింగ్ ఏజెంట్లు వారి ఇష్టానుసారంగా టికెట్లు విక్రయించి పర్యటకులతో ఆటలాడుతున్నారు. ఆ ఫలితంగానే ఈ శనివారం సుమారు 200 మంది పర్యటకులు భద్రాచలం ఏజెంట్ల వద్ద టికెట్లు కొనుగోలు చేసి పోచవరం చేరుకోగా అక్కడ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రముఖులు పాపికొండలు విహార యాత్రకు రావడంతో బోట్లో ఖాళీ లేక 200 మంది పర్యటకులకు బోటు ఎక్కే అవకాశం లేక సాయంత్రం దాకా ఎదురుచూసి నిరాశతో భద్రాచలం తిరిగి వచ్చి టిక్కెట్లు కొనుగోలు చేసిన ఏజెంట్ల కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఆందోళన ఫలితంగా బుక్ చేసిన టికెట్ డబ్బులు వెనక్కి ఇచ్చినప్పటికీ సుదీర్ఘ ప్రాంతాల నుండి పాపికొండల అందాలను తిలకించేందుకు ఆశతో వచ్చిన పర్యటకుల ఆశపై ఏజెంట్లు నీళ్ల జల్లినట్టు అయింది. కరోనా తర్వాత ఇప్పుడిప్పుడే భద్రాచల రామాలయానికి పర్యటకుల సంఖ్య పెరుగుతుండటంతో పాపికొండల విహారయాత్ర ఏజెంట్లు చేస్తున్న నిర్వాహకంతో రాష్ట్రవ్యాప్తంగా భద్రాచల పర్యటనపై అపఖ్యాతి వస్తుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

సమాజానికి ఆదర్శం వెంకటయ్య కుటుంబం

- సంస్మరణ కార్యక్రమంలో మొక్కలు పంపిణీ



నవతెలంగాణ-కొత్తగూడెం

సమాజ శ్రేయస్సుకై అనునిత్యం పరితపిస్తూ, అనేక రకాల కార్యక్రమాలను చేపడుతున్న మొక్కల వెంకటయ్య కుటుంబం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, పీసీసీ సభ్యులు జేబీ శౌరి, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి రమేష్ బాబులు పేర్కొన్నారు. ఇటీవల మొక్కల వెంకటయ్యకు పుత్ర యోగం జరిగిన సంగతి అందరికీ విదితమే. దాన్ని పురస్కరించుకొని, ఆదివారం ఆయన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు పాల్గొని మాట్లాడారు. రాయి నగేష్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వెంకటయ్య గత 40 సంవత్సరాలుగా సింగరేణి అధికారిగా, అభ్యుదయ వాదిగా, పర్యావరణ వేత్తగా సమాజ హితంకై అనేక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం మొక్కల వెంకటయ్య, ఆయన సతీమణి లక్ష్మి, కార్యక్రమంలో పాల్గొన్న వారికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలశౌరి, డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, డాక్టర్ వి.ఉపేందర్ రావు, డాక్టర్ కృష్ణ చైతన్య, డాక్టర్ ఇరుకు బాబురావు, రామనాథం, శీలం శ్రీనివాస్, సామే లు, జేమ్స్ ఎడ్విన్, లగడపాటి రమేష్, కరిష రత్నకుమారి, నరసింహారావు, లయన్స్ క్లబ్ శ్రీనివాస్ రాజశేఖర్, మహమ్మద్ ముస్తఫా, కమలా రాణి, శ్రీరంగం సంపత్, దైద వెంకన్న, మొక్కల సాంబయ్య, శ్రీనివాస్, డాక్టర్ వెంకట్, గౌస్ పాల్గొన్నారు.

యువకులు సామాజిక స్పృహతో పని చేయాలి

- ఇల్లందు సీఐ కరుణాకర్

నవతెలంగాణ-ఇల్లందు

యువకులు సామాజిక స్పృహతో పని చేయాలని ఇల్లందు సీఐ కరుణాకర్ అన్నారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సీఐ ఆవిష్కరించారు. అనంతరం డీవైఎఫ్ఐ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యా, వైద్యం కోసం, మంచి ప్రవర్తన కోసం, సమాజ మార్పు కోసం యువకులు ఎలాంటి పాత్ర పోషించాలో అందుకు తగ్గ యువకుల్ని తయారు చేసే దానికోసం డీవైఎఫ్ఐ ముఖ్యపాత్ర పోషించాలని, దేశ స్వాతంత్రం కోసం సమాజ మార్పు కోసం పాటుపడిన మహనీయుల్ని స్మరించుకుంటూ ముద్రించిన క్యాలెండర్ చాలా బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యా అభిమన్యు తదితరులు పాల్గొన్నారు.





దైవ భక్తిని చాటుకున్న ప్రముఖ వ్యాపారవేత్త

- విరాళం పట్ల గుండాల, ఆళ్ళపల్లి భక్తులు హర్షం
- దాతకు రామాలయ కమిటీ ఘన సన్మానం

నవతెలంగాణ-గుండాల

గుండాల మండల కేంద్రానికి చెందిన తిరుకోవళ్లూరి వెంకటేశ్వర్లు (పట్వారీ వెంకన్న) అనే ప్రముఖ వ్యాపారస్తులు శ్రీ ఆంజనేయ స్వామి పట్ల తనలోని అపారమైన దైవ భక్తి(అధ్యాత్మిక భావాన్ని)ని ఇటీవల కాలంలో చాటుకుని హిందూ సమాజానికి నేడు ఆదర్శంగా నిలిచిన విషయం విదితమే. దానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. గత రెండేళ్లుగా గుండాల మండల కేంద్రంలోని రామాలయం ముందు శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్మాణం పనులు పూర్తి కాకుండానే నిలిచాయి. ఆ నిర్మాణం పనులు పూర్తి చేయడానికి స్థానిక పట్వారి వెంకన్న దంపతులు విగ్రహ ప్రతిష్ఠకు అయ్యే పూర్తి ఖర్చు వెచ్చించడానికి ముందుకు వచ్చారు. వెంకన్న దంపతుల విరాళం పట్ల గుండాల రామాలయం కమిటీ హర్షం వ్యక్తం చేసి, గత సోమవారం కమిటీ ఆధ్వర్యంలో గుండాల ప్రముఖ వ్యాపారస్తులు మానాల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా దాతలను పట్టు శాలువాతో ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే. గతంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేసినప్పటికీ అనివార్య కారణాలతో పనులు ముందుకు సాగలేదు కానీ, ఈనెల 22వ తేదీన జరిగిన అయోధ్య బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజే గుండాలలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు సుమారు రూ.3 లక్షల వ్యయంతో నిర్మించడానికి వెంకన్న దంపతులు ముందుకు రావడంతో గుండాల, ఆళ్ళపల్లి మండలాల వ్యాప్తంగా భక్తులు సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
8
సోమవారం | జనవరి 29, 2024 | www.navatelangana.com

తమ్మినేనిని పరామర్శించిన ఇల్లందు నాయకులు



నవతెలంగాణ-ఇల్లందు

హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఆదివారం ఆవాజ్, ఏఐకేఎస్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్, అబ్దుల్ నబి, అజీజ్ పాషా, గౌస్ అబ్బాస్ తదితరులు పరామర్శించారు. తమ్మినేని వీరభద్రం పూర్తిగా కోలుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం డిశ్చార్జ్ చేయనున్నట్లు వైద్య బృందం తెలిపారు.

దేశ వ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలి

- సీఐటీయూ పిలుపు



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

వచ్చే నెల 16వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి, కమిటీ సభ్యులు అబ్దుల్ నబీ, వజ్జ సుశీల పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఆదివారం గుండాల మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల కో కన్వీనర్ పాయం సారమ్మ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అబ్దుల్ నబీ, సుశీల మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసి అదాని, అంబానీలకు వంటి వారికి ఊడిగం చేస్తుందని మండిపడ్డారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్లుగా మార్చిందని దీని కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసిందని వివరించారు. రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తు కర్షకులకు నష్టం కలిగించే పనులు చేస్తూ వస్తుందన్నారు. దాంతో పాటు దేశ ప్రధాని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రామ జన్మభూమిలో బాల రాముడిని ప్రతిష్టించి మత రాజకీయాలకు తెర మీదకు తెచ్చారని ఆరోపించారు. అతి పెద్ద ప్రజాస్వామ్యం, భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్ని వర్గాల ప్రజల పట్ల పారదర్శకత, లౌకిక వాదం మరిచి ప్రధానమంత్రి హోదాలో ఉండి ఒకే మతానికి తన ప్రాధాన్యత, ప్రాచుర్యం కల్పించడం రాజ్యాంగ నిబంధనలను పాటించకుండా తుంగలో తొక్కడమేనని ఘాటుగా విమర్శించారు. వచ్చే నెలలో 16న జరిగే దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయడానికి కార్మికులు, వివిధ రంగాల వారు జాగృతమై గ్రామ పంచాయతీ యూనిట్‌గా జనరల్ బాడీ సమావేశాలు జరిగే విధంగా కృషి చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలు పూలమ్మ, సారమ్మ, కౌసల్య, కళావతి, ఆశా వర్కర్లు ఆదిలక్ష్మీ, సరోజ, లక్ష్మీ, హాస్టల్ డైలీవేజర్లు కొటెం బాలన్న, వీఓఏ కాంతారావు, బొమ్మయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు నర్సమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ మంత్రిని నియమించాలి

- జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ. యాకుబ్ పాషా



నవతెలంగాణ-పాల్వంచ

నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ క్యాబినెట్‌లో ముస్లీం వర్గానికి చెందిన వారిని మైనారిటీని మంత్రిగా వెంటనే నియమించాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మైనారిటీ మంత్రిని నియమించని కారణంగా అనేక మైనారిటీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకులాలు ఇరుకు గదులు కిరాయి భవనాలు అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయని, నేటివరకు రాష్టంలో ఎక్కడకూడా మైనారిటీ గురుకుల డిగ్రీ కళాశాలు ఏర్పాటు చేయలేదని, నిరుద్యోగులకు ఒక్క మైనార్టీ స్టడీ సర్కిల్ కూడా లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములను సర్వే చేయించడంతో పాటు వక్ఫ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్టం ఏర్పడ్డాక వక్ఫ్ బోర్డు, మైనారిటీ సంక్షేమ శాఖలలో ఉద్యోగ నియామకాలు జరగలేదని, రాష్ట్ర వ్యాప్తంగా గల ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉర్దూ టీచర్‌ల నియామకాలు చేపట్టలేదని, గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో కేవలం రెండు సార్లు మాత్రమే అరకొరగా మైనారిటీ రుణాలు ఇచ్చారన్నారు. ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్స్‌ను ఇంగ్లీష్ మీడియం పాఠశాలలుగా మార్చి ఉర్దూ భాషను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల లోపు మైనారిటీ మంత్రితో పాటు పలు మైనారిటీ నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని కోరారు. తద్వారా మైనార్టీల సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడేది యూటీఎఫ్

- క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా కార్యదర్శి



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాడేది టీఎస్ యూటీఎఫ్ సంఘమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హతిరామ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగానే శనివారం ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన సంవత్సరం 2024 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక విద్యాశాఖాధికారి పి.కృష్ణయ్య చేతుల మీదుగా ఘనంగా జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతోగు, ఆళ్ళపల్లి, మర్కోడు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.భావుసింగ్, కె.శాంతారావు, బి.బాబులాల్, సంఘం ఉపాధ్యక్షులు కల్తి కృష్ణ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీఆర్‌పీలు గొగ్గెల రామయ్య, సునీత, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



నవతెలంగాణ-టేకులపల్లి

బహుజన సమాజ్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ బాదావత్ ప్రతాప్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అధ్యక్షులు అజ్మీర వెంకన్నలు ఆదివారం మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షులు కాళ్ళ రంజిత్, ఉపాధ్యక్షులు పూనెం.రాకేష్ దొర, కార్యదర్శి బోడ వంశీ, కార్యదర్శి సరికొండ వెంకటేష్, కోశాధికారి కుక్క ముడి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యువతరం బీఎస్పీ పార్టీ రావడంలో చాలా సంతోషంగా ఉందని, దేశానికి యువతరం రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజలను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. రాబోయే పార్లమెంటు, స్థానిక ఎన్నికలలో బహుజన సమాజ్ పార్టీ సత్తా చాటులని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈసీ నాయకులు చిప్పలపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

అనుమానాస్పదంగా ఓ వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌హెచ్ఓ ఎస్ఐ పీ.శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బచ్చువారి గూడెం గ్రామానికి చెందిన తెల్లం ప్రమీల (23)కు ఇదే గ్రామానికి చెందిన హరిబాబుతో పరిచయం ఏర్పడగా ఇదీ కాస్తా ప్రేమగా మారి మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు 17 నెలల బాలుడు జన్మించాడు. కాగా శనివారం అర్ధరాత్రి ప్రమీల ఇంట్లోనే ఉరివేసుకొని శవమై కనిపించింది.

ఈ విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి కాక విజయ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. తన కుమార్తె మృతిపై తండ్రికి అనుమానం ఉన్నట్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా, అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు కలెక్టరేట్లో ప్రజావాణి



నవతెలంగాణ-పాల్వంచ

29వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాలులో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 9.30 గంటలకు హాజరు కావాలని కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, సమస్యలపై ఫిర్యాదులు అందచేయు ప్రజలు ఉదయం 9.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

పది పరీక్షలు కాకముందే ఇంటర్ అడ్మిషన్లు



ఫైల్

నవతెలంగాణ-జూలూరుపాడు

ఇంకా పదో తరగతి పరీక్షలు ప్రారంభమే కాలేదు..అప్పుడే టెన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పలు కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల కోసం గాలం వేస్తున్నారు. అడ్మిషన్ల కోసం వేట కొనసాగిస్తున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. పదో తరగతిలో పాసైన తర్వాత ఇంటర్మీడియట్ కోసం విద్యార్థులు ఏ కళాశాలలో చదివితే బాగుంటుందని వారి తల్లిదండ్రులు కాలేజీల గురించి ఆరా తీస్తారు. ఆ కళాశాలను సందర్శించి సదరు కళాశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, అనుభవం గల అధ్యాపకులు, ల్యాబ్‌లు, ఉత్తమ ఫలితాలు తదితర అంశాలను బేరీజు వేసుకొని అప్పుడు తమకు నచ్చిన కాలేజీలో జాయిన్ అవ్వడానికి ఆసక్తి చూపుతారు. అయితే 2024-25విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో అడ్మిషన్లు తీసుకోవడానికి ఇంకా చాలా సమయమే ఉంది. పరీక్షలు జరగాలి, ఫలితాలు రావాలి.. ఆ తర్వాత అడ్మిన్ల ప్రక్రియ మే.. జూన్‌లో మొదలవుతోంది. కానీ ఇప్పటి నుంచే కొన్ని కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇంటర్ అడ్మిషన్లను చేపడుతున్నాయి. 2024-25 విద్యాసంవత్సరానికి అప్పుడే సీట్లు అయిపోయినట్లు కృత్రిక కొరతను సృష్టిస్తున్నారు. తమ కాలేజీలో సీట్లు పరిమితంగా ఉన్నాయని కనీసం అఫిలియేషన్ దరఖాస్తులకు కూడా ఇంటర్ బోర్డు ఆహ్వానించక ముందు నుండే పేరెంట్స్‌ని బురిడీ కొట్టిస్తూ ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పేరు చెప్పి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు అడ్మిషన్ తీసుకుంటే ఒక రేటు..తర్వాత తీసుకుంటే మరో రేటు అంటూ మాయమాటలు చెబుతూ దందా చేసుకుంటున్నాయి. కొన్ని సీట్లను బ్లాక్ చేసి వాటిని తీరా విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు చివరి క్షణంలో వచ్చిన వారికి తమకు అనుకూలమైన ఫీజులకు అమ్ముకుంటున్నారనే విమర్శలున్నాయి. పీఆర్‌వో వ్యవస్థలను పెట్టి పల్లెలకూ ఇప్పటి నుంచే పంపిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. హాస్టల్ ఉంటే ఒక రేటు హాస్టల్ లేకుంటే మరో రేటును ఫిక్స్ చేస్తున్నారు. నీట్, జేఈఈ కోచింగ్ అంటూ అదనంగా నొక్కుతున్నారు. సుమారుగా రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. అడ్మిషన్లు అయిపోకముందే మొత్తం నిండిపోయినట్లు కృత్రిమ డిమాండ్‌ను సృష్టిస్తున్నారు. వీరి మాయలో పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తర్వాతైతే తమ పిల్లలకు సీటు దొరుకుతుందోలేదోనన్న ఆందోళనతో రూ.లక్షలు పోసి ముందస్తుగా అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

అసలు పదవ తరగతి పూర్తికాకుండానే ఇంటర్ అడ్మిషన్లు ఎలా చేపడుతారని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న కళాశాలల్లో సీట్లు ఎప్పుడో నిండిపోయాయి. ఒకవేళ ఇప్పుడు కావాలంటే పైరవీలు ఉంటేగానీ దొరకడం కష్టమైపోయింది. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా కూడా ఆయా కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు డబ్బు యావలో అడ్మిషన్ల ప్రక్రియకు ముందే అడ్మిషన్లను చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం పదో తరగతి ఫలితాల తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలో ప్రతిఏటా బోర్డు నుండి అనుబంధ గుర్తింపు పొందిన తర్వాత ఇంటర్ బోర్డు ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తోంది.

బోర్డు నుంచి కళాశాలకు గుర్తింపు ఉందా? లేదా? అని చెక్ చేసుకొని అడ్మిషన్లు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అవేమీ చూసుకోకుండానే కార్పొరేట్ మాయలోపడి విద్యార్థుల తల్లిదండ్రులు నాలుగైదు నెలల ముందే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అయితే ఇదంతా సంబంధిత విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్టు-గా వ్యవహరిస్తున్నారు. అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేయకముందే కృత్రిమ డిమాండ్ సృష్టించి సీట్లు అమ్ముకుంటున్న కార్పొరేట్ కళాశాలలను కట్టడి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

పీఆర్ఓ వ్యవస్థను నమ్మకండి



పదవ తరగతి పరీక్షలు ముగిశాక ఇంటర్లో జాయిన్ చేయమని కార్పొరేట్ కాలేజీలకు చెందిన పీఆర్ఓలు విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తారు. వారి మాయ మాటలను నమ్మి జాయిన్ చేయవద్దు. పది పరీక్షలు కాక ముందే కార్పొరేట్ కాలేజీల పీఆర్ఓలు వచ్చి మాయ మాటలు చెప్పి జాయిన్ చేసుకున్న తరువాత ఆ పీఆర్ఓలు మళ్ళీ కనిపించరు. యాజమాన్యం మాత్రం అడ్మిషన్లు ఫీజులు, అనేక రకాల ఫీజులు వసూలు చేస్తూ అదే గాక ఒక వేళ కాలేజీలో ఉండలేకపోతే సర్టిఫికేట్లు ఆ కాలేజీలో ఉన్నట్లైతే ఆ కాలేజీ సర్టిఫికేట్లు పూర్తి ఫీజు చెల్లించాక మాత్రమే ఇస్తామని చెప్తారు. విద్యార్థుల తల్లిదండ్రులకు జాగ్రత్తలు వహించాలి.

- ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు వలమల చందర్రావు



డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాలకు సన్మానాలు

నవతెలంగాణ-పాల్వంచ

ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్‌గా నూతనంగా ఎన్నికైన కొత్వాల శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో ఆయనకు కొత్తగూడెం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు వందల సంఖ్యలో పాల్గొని కొత్వాలను పూలమాలలు, బొకేలతో ముంచెత్తారు. శాలువాలతో సన్మానించి, బాణాసంచా పేల్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, ఎల్డీఎంకో-ఆర్డినేటర్ బద్ది కిషోర్, ఎస్‌విఆర్‌కె ఆచార్యులు, దారా శ్రీనివాస్, నయ్యర్, మూర్తి, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, బాదర్ల జోషి, గంధం నర్సింహారావు, బాలాజీ, భట్టు మురళి, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, మధు, పులి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు పిలిచి..
ప్రూనింగ్ పనులు ప్రారంభించాలి

- సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

తునికాకు టెండర్లు పిలిచి, వెంటనే ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. పార్టీ మండల కమిటీ సమావేశం యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన ములకపాడు యలమంచి సీతారామయ్య భవన్లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తునికాకు టెండర్లకు పిలిచి వెంటనే ప్రూనింగ్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తూనికాకు అనేది కార్మికులకు రెండో పంట లాంటిదని అలాంటిది ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం తనికాకు కాంట్రాక్టర్లను టెండర్లకు పిలవకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. టెండర్లు పిలిచిన తర్వాత వెంటనే ప్రూవినింగ్ ప్రారంభించాలని అన్నారు. అంతేకాకుండా 2016 నుండి 2021 వరకు పెండింగ్‌లో ఉన్న తనికాకు బోనస్ కూడా వెంటనే ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు రాని వాళ్లకు వెంటనే పట్టాలు ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొరసా చిలకమ్మ, మర్మం సమ్మక్క, యలమంచి శ్రీను బాబు, ఎండి మహమ్మద్ బేగ్, సోడి రాంబాబు, కూరం వీరభద్రం, వీర్రాజు, సరియం ప్రసా ద్, కొమరం చంటి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

- ప్రశాంతమైన భద్రాద్రిలో అసాంఘిక శక్తుల అరాచకాలను అరికట్టాలి
- లీజ్ వివాదంలో బెదిరింపుల సంస్కృతి మంచిది కాదు
- అటువంటి వారి పట్ల పోలీసుల అప్రమత్తం ఉండాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

గత రెండు రోజులుగా భద్రాచలం పట్టణంలో ఒక రెస్టారెంట్ లీజు విషయంలో నెలకొని ఉన్న పరిస్థితులు భద్రాచలం ప్రశాంతత వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నదని, ఇరు వర్గాల మధ్య వచ్చిన స్థలం లీజు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, సీపీఐ(ఎం) హితవు పలికింది. ఈ వివాదాన్ని ఆశరా చేసుకొని కొద్దిమంది అసాంఘిక శక్తులు బెదిరింపులకు పాల్పడడం మంచి సంస్కృతి కాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఒక హెూటల్ లీజు విషయంలో జరిగిన పరిణామాలను గమనిస్తుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యలను కొంతమంది వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతూ సమస్యను జటిలంజేసి చట్టాల పేరుతో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఇది భద్రాచలం పట్టణ శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తుందని అన్నారు. ఇలాంటి సంఘటనలు భద్రాచలం పట్టణంలో రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లీజు వివాదంలో పట్టణ హెూటల్ అసోసియేషన్ సభ్యుల మధ్య అనైక్యత రావడం సరైనది కాదని ఆయన అన్నారు. పట్టణంలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పట్టణ ప్రముఖులు ఇలాంటి విషయాల్లో సమన్వయం పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల మురళికి భారత సేవరత్న పురస్కారం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలంకు చెందిన యువకుడు భద్రాచలం ఏజన్సీ ప్రాంతాల్లో గత 18 సంవత్సరాలుగా 51 కు పైగా రకదానం చేసి, తోటివారితో రక్తదానం చేయిస్తూ పలువురిని అపత్కర పరిస్థితుల్లో ఆదుకున్నందుకు, పేద విద్యార్థులకు చదువుకొరకు ఆర్థిక సహాయం, పేద పిల్లల వైద్యం కోసం ఆర్థిక సాహాయం ఇలా అనేక రకాల సేవ కార్యక్రమాలను చేస్తున్నందుకు కొప్పుల మురళి విశిష్ట భారత్ సేవ రత్నం పురస్కారం అందుకున్నాడు. ఆదివారం వైజాగ్‌లోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో తాసుబెళ్ళి ఫౌండేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అత్యధిక సార్లు రక్తదానం చేసినందుకు, అలాగే ఏజెన్సీలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తదానం చేసి విశిష్ట సేవలు అందించడంతో పాటు పేద విద్యార్థులకు చదువుకొరకు ఆర్థిక సహాయం, పేద పిల్లల వైద్యం కోసం ఆర్థిక సాహాయం ఇలా అనేక రకాల సేవ కార్యక్రమాలను చేస్తున్నందుకు తాసుబెల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ శంకర్ నాయుడు చేతులు మీదుగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళికి పురస్కారం అందజేసి సేవలను కొనియాడారు. అనంతరం భవిష్యత్తులో కూడా ఇలాగే మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవ స్ఫూర్తితో 18 ఏండ్లుగా నిర్విరామంగా నేను రక్తదానంతో పాటు అనేక రకాల సేవ కార్యక్రమాలను చేయ డానికి సహకరిస్తున్న నా ట్రస్ట్ సభ్యులకు, రక్తదాతలకి, భద్రాచలం పెద్దలకు, మీడియా పెద్దలకు ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ అవార్డు నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ చెందుతుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాగే మీ అందరి సహకారం అందించాలని కోరారు.

మున్నూరు కాపు రాష్ట్ర ఉద్యోగ విభాగం ఆర్గనైయిజింగ్ కార్యదర్శిగా నరసింహారావు



నవతెలంగాణ-చంద్రుగొండ

మున్నూరు కాపు సంగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లంక నరసింహారావు నియమిస్తూ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లంక నరసింహారావు మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ విభాగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా 'పానిశెట్టి'

నవతెలంగాణ-పాల్వంచ

భద్రాద్రి కొత్తగూడెం బీజేపీ పార్టీ ఇటీవల ప్రకటించిన జిల్లా నూతన కమిటీలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పాల్వంచ పట్టణానికి చెందిన పానిశెట్టి వెంకటేశ్వర్లు రెండొవ సారి పదవి బాధ్యతలు చేపట్టినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను నమ్మి రెండొవసారి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యాన విద్యార్థుల క్షేత్ర సందర్శన

- సాగు, యాజమాన్య మెలుకువలు పరిశీలన
- రైతులతో ముఖాముఖీ



నవతెలంగాణ-అశ్వారావుపేట

హైద్రాబాద్, రాజేంద్ర నగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాలలో ఉద్యాన విద్యను అభ్యసిస్తున్న 92 మంది మూడో సంవత్సరం విద్యార్థులు మూడు రోజుల పాటు అశ్వారావుపేట ప్రాంతంలో క్షేత్ర సందర్శన చేసారు. ఉద్యాన విద్యను అభ్యసించే విద్యార్థులకు దక్షిణభారత విద్యా, వైజ్ఞానిక యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యాన పరిశోధన కేంద్రాలను సందర్శిస్తూ శుక్రవారం అశ్వారావుపేట చేరుకున్నారు. ఈ సందర్శన ఆదివారంతో ముగిసింది. ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటల, అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో రూపొందుతున్న నూతన వంగడాల గురించి, పంటలు పరిశోధనలు పై స్థానిక పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త విజయ్ క్రిష్ణ వివరించారు. మూడు రోజుల పాటు సాగిన ఈ కార్యక్రమంలో ఉద్యాన విద్యార్థులు ఆయిల్ పామ్, కొబ్బరి, కోకో, శతావరి, జామ, మామిడి, అరటి అదే విధంగా వివిధ రకాల కూరగాయల తోటల సాగు, ఉద్యాన పంటల్లో అంతర పంటల సాగును ప్రత్యక్షంగా క్షేత్రాల్లో తిరిగి అధ్యయనం చేసారు. విద్యార్థులు ఈ పంటలు సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖీ మాట్లాడి అనేక వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం వస్తుందని రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉద్యాన పరిశోధన స్థానం, అశ్వారావుపేటను సందర్శించారు. అక్కడ సాగు చేస్తున్న వివిధ పంటలైన మామిడి, జామ, మిరియాలు, జీడి మామిడి, కొబ్బరి, తమలపాకు, కాఫీ మరియు అనేక రకాల కూరగాయల మొక్కలను పరిశీలించారు. పరిశోధన స్థానంలో జరుగుతున్న అనేక రకాల పరిశోధన వివరాలను శాస్త్రవేత్త డాక్టర్ విజయ క్రిష్ణ వివరించారు. పరిశోధన స్థానంలో ఉన్న నర్సరీలో, ఉన్న మొక్కలను పరిశీలించారు. మామిడి, సపోటా, జామ మొదలగు మొక్కలో అంటు కట్టే విధానాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ మొక్కల నర్సరీ, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ, కొబ్బరి విత్తనోత్పత్తి స్థానం, వ్యవసాయ కళాశాలలను సందర్శించారు. 3 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అనేక మంది రైతులతో మాట్లాడారు. వారు సాగు చేస్తున్న ఉద్యాన పంటలను స్వయంగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్, టీచింగ్ అసోసియేట్ టి.మమత, ఏఈఓ శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

కృష్ణమూర్తిని పరామర్శించిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-తల్లాడ



కాంగ్రెస్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తిని ఆయన నివాసంలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైరా మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ దుందేటి వీరారెడ్డి ఉన్నారు.

ముకుందచారి ట్రబుల్ ట్రస్ట్ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని ట్రంక్ రోడ్ వద్ద ఉన్న శివాలయం షాపింగ్ కాంప్లెక్స్ నందు ముకుంద చారి ట్రబుల్ ట్రస్ట్ కార్యాలయాన్ని ఆదివారం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనమా వేణుగోపాల్ పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం వచ్చిన పలువురు అతిథులు ట్రస్ట్ చైర్మెన్ చెరుకూరి రాజీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ చెరుకూరి రాజీ మాట్లాడుతూ.. ఈ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని, నిరుపేదలకు ఆహార పొట్లాలు పంపిణీ, దుప్పట్లు, రగ్గులు పంపిణీ అలాగే ముగ్గుల పోటీలు నిర్వహించడం, ఉచితంగా మందులు పంపిణీ వంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టామని తెలిపారు. ముందు ముందు ఈ ట్రస్ట్ ద్వారా మరెన్నో సేవలు నిర్వహిస్తామని, ఎంతో మందికి ఉపయోగపడేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరుచూరి సేవ సమితి నిర్వాకులు పున్నయ్య చౌదరి, కెవి. సత్యనారాయణ, సీపీఐ(ఎం) త్రీ టౌన్ నాయకులు యర్ర శ్రీకాంత్, సుబ్బారావు, చెరుకూరి భాస్కరరావు, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15వ బెటాలియన్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

ఆదివారం 15వ ప్రత్యేక పోలీసు పటాలం బి.గంగారం, సత్తుపల్లిలో సత్తుపల్లి లయన్స్ క్లబ్,15వ బెటాలియన్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా దంత, కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పటాలపు కమాండెంట్ వెంకట్ రాములు పాల్గొని ఈ కార్యక్రమమును ప్రారంభించారు. ఈ కార్యక్రమమునకు బెటాలియన్ సిబ్బంది, అధికారులు, వారి కుటుంబ సభ్యులు దంత, కంటి వైద్య శిభిరములో పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ వెంకట్ రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ దళాధిపతి ఎన్.వెంకన్న, వైద్య నిపుణులు డాక్టర్ బి .శ్రీనివాస్, డాక్టర్ జూపల్లి వెంగళరావు ఎంఎస్, డాక్టర్ పెద్దిరాజు బిడిఎస్, సత్తుపల్లి లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి ,రీజియన్ చైర్మన్ చలపతిరావు, లయన్స్ క్లబ్ అద్యక్షులు డి.కృష్ణయ్య, కార్యదర్శి పి.రమేష్, కోశాదికారి జి .శ్రీనివాసరావు, సత్తుపల్లి లయన్స్ క్లబ్ సిబ్బంది, బెటాలియన్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ ప్రథమ స్థానంలో త్రివేణి విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో ప్రథమ బహుమతిని పొంది జిల్లా స్థాయికి ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ఆదివారం ఖమ్మం రిక్కా బజార్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదికకు చెందిన కార్యకర్తలు విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విఎస్ఎస్ లక్ష్మి, తొమ్మిదవ తరగతి మన్విత, ఎనిమిదో తరగతి హరిచందనలు చెకుముకి టాలెంట్ టెస్ట్ లో ప్రథమ బహుమతిని పొంది జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కి ఎంపికయ్యారని తెలిపారు. ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్‌లు అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ నాయకుడు వాసిరెడ్డి రామనాథం

నవతెలంగాణ-బోనకల్



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం రావినూతల గ్రామంలో పలు కార్యక్రమాల్లో ఆదివారం పాల్గొన్నారు. మొదటిగా రావినూతల గ్రామంలో తెలుగుదేశం పార్టీ బోనకల్ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ సతీమణి పద్మావతిని రామనాథం పరామర్శించారు. ఇటీవల పద్మావతి మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆమెను పరామర్శించి యోగక్షేమలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టిడిపి రావినూతల గ్రామ శాఖ కార్యదర్శి వట్టికొండ నవీన్ తాతయ్య వట్టికొండ లక్ష్మయ్య దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మార్నిడు జగన్‌మోహన్‌రావు, రావుట్ల సత్యనారాయణ, మైనేని రవికుమార్, సంద్ర ప్రసాద్, గొల్లపల్లి నాగమల్లేశ్వరరావు, మండపూడి గోర్కి, మండేపూడి మోహన్ రావు, బొగ్గవరపు రామచంద్రయ్య, రాచబంటి నవీన్, బెజ్జం రాయప్ప, చిత్రాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి స్నేహితులు చేయూత

- క్లాస్‌మేట్స్ రూ. 50వేలు ఆర్థికసాయం


నవతెలంగాణ-సత్తుపల్లి

కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న స్నేహితురాలి ఒకరికి 35 ఏండ్ల క్రితం ఆమెతో చదువుకున్న స్నేహితులు అండగా నిలిచారు. ఆమె వైద్య ఖర్చుల కోసం తమవంతు సాయంగా ఆదివారం ఆమె గృహానికి వెళ్లి పరామర్శించిన వారంతా రూ. 50వేలు సాయం అందించారు. సత్తుపల్లి మండలం గంగారం ఎస్‌డీవీఆర్ ప్రభుత్వ పాఠశాలలో 1986-87 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని పిల్లి సలోమి గత కొంత కాలంగా కేనర్సర్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలిసిన ఆమె చిన్ననాటి స్నేహితులంతా కలిసి రూ. 50వేలు ఏర్పాటు చేసి పెనుబల్లి మండలం లంకపల్లిలో ఉంటున్న సలోమి ఇంటికెళ్లి అందించారు. ఆమెకు సాయం అందించిన స్నేహితుల్లో కొండపల్లి కొండలరావు, లక్ష్మణ్‌సింగ్, పున్నం రామ్మూర్తి, సోయం నాగేశ్వరరావు, సోయం వెంకటేశ్వరరావు, డి రామకృష్ణ, తన్నీరు శ్రీనివాసరావు, జంగాల నాగభూషణం, డీవీఎస్ఎన్ రెడ్డి, ఎండీ ఆరిఫ్ ఉన్నారు.

కొరిపల్లి శ్రీనివాస్‌కు కీర్తి పురస్కార్ నేషనల్ అవార్డు

- కొరిపల్లి శ్రీనివాస్‌కు పలువురి అభినందనలు

నవతెలంగాణ-కామేపల్లి



ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు కొరిపల్లి శ్రీనివాస్‌కు న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు కీర్తి పురస్కార్ నేషనల్ అవార్డు, మెడల్‌ను సంస్థ చైర్మెన్ ఫౌండర్ రెవరెండ్ డాక్టర్ జోసఫ్ పాలంగి హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రధానం చేసినట్లు కొరిపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు ద్వారా మరింత బాధ్యత పెరిగి నాకు చేతనైనంత వరకు సామాజిక సేవా కార్యక్రమాలను చేస్తానని, నేను చేసిన సేవలను గుర్తించి కీర్తి పురస్కార్ అవార్డుతో పాటు మెడల్‌ను తనకు బహూకరించిన యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్ బిషప్ రెవ. డాక్టర్ బిషప్ పాలంగిలకు శ్రీనివాస్ ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

కుమ్మరి శాలివాహన సంఘం క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల

నవతెలంగాణ-మధిర



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చేతుల మీదగా ఆదివారం ఖమ్మంలో వారి క్యాంప్ కార్యాలయంలో శ్రీమోల్లమాంబ కుమ్మర శాలివాహన సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా శాలివాహన కుల సంఘం పెద్దలు, మధిర మండలం నుండి కుమ్మరసంఘం జిల్లా కమిటీ మెంబర్ మన్నేపల్లి గురునాధం, మండల కుమ్మర సంఘం అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, కుమ్మర సంఘం టౌన్ అధ్యక్షులు కోరంపల్లి అంకమరావు (చంటి), కుమ్మర సంఘం మధిర మండల సహాయ కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మనువాద విధానాలు దేశ ఐక్యతకు ప్రమాదం

- రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి
- ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు
- కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-ఖమ్మం



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులను తీసివేయడానికి కుట్రలు చేస్తుందని, మతోన్మాద బీజేపీని ఓడిచేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో కేవిపిఎస్ జిల్లా స్థాయి సమావేశం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నకిరేకంటి చిరంజీవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతాలన్నీ సమాఖ్య స్ఫూర్తితో పనిచేస్తున్నాయని అన్నారు. కానీ కేంద్ర బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చాక మతాన్ని, దేవుడిని అధికార యంత్రాంగంలోకి రాజకీయాల్లోకి ప్రవేశింపజేసి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, రైల్వే లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలను మార్చాలని కేంద్రం ప్రయత్నం చేస్తుందని అన్నారు. దేశ సంపదను ఆదాని, అంబానిలకు దోచిపెడుతుందని అన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రకటించి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు చేసిన వారికి అండగా బీజేపీ ప్రభుత్వాలు ఉంటున్నాయని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని గద్దె దించడమే దేశభక్తుల కర్తవ్యం అని ఆయన పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 11, 12 తేదీలలో ఖమ్మంలో కెవిపిఎస్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆ సందర్భంగా రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కుక్కల సైదులు, ఐలపోగు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం

- మోటార్, వైర్‌లు స్వాధీనం చేసుకున్న విద్యుత్ సిబ్బంది

నవతెలంగాణ-అశ్వారావుపేట

అధికారం, ఆర్థిక పరపతి ఉంటే ఏదైనా చేయొచ్చు అనుకుంటారు కొందరు. ఇవి తారుమారు అయితేనే అసలు విషయం తేటతెల్లం అవుతుంది. మండల పరిధిలోని నారాయణపురంకు చెందిన గత అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు తన వ్యవసాయానికి గత కొన్నేళ్ళుగా అక్రమ విద్యుత్ వినియోగం చేస్తున్నట్లు ఇటీవల వెలుగులోకి వచ్చింది. తన వ్యవసాయ క్షేత్రం సమీపంలో గల వాగులో నుండి నీటిని వ్యవసాయ సాగుకు వినియోగించడం కోసం అదే సమీపంలోని విద్యుత్ లైన్ అక్రమ కనెక్షన్‌తో విద్యుత్‌ను వాడు కుంటున్నాడు. ఇదే వ్యక్తి గతం ప్రభుత్వం హయాంలో అధికారి దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇపుడిపుడే బహిర్గతం అవుతుంది. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన రైతులు కొందరు స్థానిక విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు తీసుకోకపోవడంతో జిల్లా స్థాయి అధికారులకు పిర్యాదు చేశారు. స్పందించిన స్థానిక సిబ్బంది మూడురోజుల క్రితం యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ మోటార్‌ను, వైర్‌లను స్వాధీనం చేసుకున్నారు. కానీ ఎటువంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోవడం పై పలు విమర్శలూ వస్తున్నాయి.



విద్యుత్ సరఫరా నిలిపి వేసి విచారణ చేస్తున్నాం
ఎన్‌పిడిసిఎల్ వినాయకపురం సబ్ స్టేషన్ ఏఈ సంతోష్

ఈ విషయం అయి ఎఇ సంతోష్‌ను వివరణ కోరగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేశాం. విచారణ చేస్తున్నాం. పై అధికారుల ఆదేశానుసారం విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేస్తామని తెలిపారు.

చిన్న పేరయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-బూర్గంపాడు



లక్ష్మీపురం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు తన భూమిలో ఇల్లు లేనిచోట ఇల్లు ఉన్నవని, ఇంటి నెంబర్లు ఉన్నవని తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవా లని, చిన్న పేరయ్య కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చిన్న పేరయ్య నాలుగో రోజు నిరసన కార్యక్ర మానికి మద్దతుగా ఆయన హాజరై మాట్లాడారు. తాటికొండ చిన్న పేరయ్య తన ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూమిలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళకు 2020 సంవత్సరం నుంచి రేకుల షెడ్ తో నిర్మించిన 3 ఇండ్లు ఉన్నట్లు తప్పుడు సరిహద్దులతో కూడిన పంచనామా నివేదికను అధికారులు ఇచ్చారని ఆయన అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల ప్రోద్భలంతో రికార్డులు తారు మారు చేసి, కాసులకు కక్కుర్తి పడి లేని ఇండ్ల కు ఇంటి నంబర్లు అధి కారులు ఇచ్చినారని, ప్రజా ప్రతినిధులు సైతం సహకరించారని ఆరోపించారు. ఉన్నతా ధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోని, పేరయ్యకు ఆయన స్థలం ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తి దారుల సంఘం జిల్లా కార్యదర్శి చిటిక ముసలయ్య, అధ్యక్షులు ముదిగొండ రాంబాబు, చీమలపాటి కోటేశ్వరరావు, గడ్డం రవి, ఘంట సాల శ్రీను, కందుకూరి నరేష్, జట్టంగి లాలయ్య, చింతల వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు తాటి కొండ ముత్తమ్మ. పోతు రాజు, వరలక్ష్మి, రాము శ్రీలత, గడ్డ వెంకటేశ్వర్లు, సీతమ్మ రాములు, రమణ శ్రీను, అంజమ్మ, శ్రీను, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కాచనపల్లి, అనంతోగు గ్రామాల మధ్య అడవిలో బైక్ అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, పైలట్ కథనం ప్రకారం.. ముత్తాపురం గ్రామానికి చెందిన పూసం సారయ్య ఆదివారం కాచనపల్లి గ్రామం చెరువులో చేపలు పడుతున్న విషయం ఇతరుల ద్వారా తెలుసుకుని అక్కడికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. చేపలు కొన్నాక బైక్ పై తిరిగి వస్తుండగా కాచనపల్లి, అనంతోగు గ్రామాల మధ్య అడవిలో బైక్ అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సారయ్య స్పృహ కోల్పోయాడు. అటుగా వెళ్తున్న ఓ బాటసారి ప్రమాదాన్ని చూసి 108కి సమాచారం ఇచ్చాడు. దాంతో ఆళ్ళపల్లి 108 వాహనం పైలట్ పరమ సునీల్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి గాయాలు తీవ్రంగా ఉన్న విషయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ సమ్మక్కకు ఫోన్ ద్వారా తెలిపారు. ఆమె సూచనలతో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న అక్కడి వైద్యులు సారయ్యకు దవడ భాగంలో, ఎడమ భుజం భాగంలో తీవ్రంగా గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. మద్యం సైతం కొంత సేవించి ఉన్నట్టు పైలట్ సునీల్ సూచనప్రాయంగా వెల్లడించారు.

ముగిసిన తాలీమ్ మస్తాన్ దర్గా ఉర్సు మహోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని అతి పురాతనమైన తాలిమ్ మస్తాన్ దర్గా ఉర్సు మహోత్సవం శుక్రవారం రాత్రి ముతవల్లి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. తొలుత తన స్వగృహం నుండి కందిల్ నగరంలోని హీరో హొండా షోరూమ్ ఎదురుగా గల దర్గా ఉర్స్ ప్రాంగణంకు చేరుకుంది. ఉరుసుకు హాజరైన వేలాది మంది భక్తులు హాజరయ్యారు.. రెండు రోజులపాటు ఖమ్మం నగర బొడ్డునగల వైరా రోడ్డులో ఉన్న అతి పురాతన తాలీము మస్తాన్ దర్గా ఉర్సు వేలాది భక్తుల హాజరుతో కళకళ లాడింది. ఉరుసు మహొత్సవం విజయవంతంగా ప్రశాంతంగా ముగిసింది. అనంతరం మహా అన్నదానం చేశారు. ఉర్సు మహొత్సవం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముతవల్లి కుటుంబ సభ్యులు చెత్తాభి, యాకూబ్, వారి బంధుగణం, షేక్ హుస్సేన్, పాషా, యూసుఫ్ పాషా, గౌస్య జరీనా, బిబి, గౌస్య, షాహిన్, శాహెదా, నసీమా, మస్తాన్, నాగుల్, హాజీ, ఉస్మాన్, రసూల్, నాగుల్, సన్మాన్, ఖిల పాషా, హకీమ్, నజీర్, మీరా, యూసూబ్, సన్ని, హుస్సైన, శేరియల్, అన్వర్, ఉపేందర్, సికిందర్, వెంకటేశ్వర్లు, పాండురంగాపురం మస్జిద్ కమిటీ మాజీ చైర్మన్, మహమ్మద్, ముజాహిద్. కొండల్, పాషా, గౌస్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఐక్య సంఘం సమావేశం

నవ తెలంగాణ- మధిర

మధిర పట్టణంలో షాదీ ఖానాలో ముస్లింల ఐక్య సంఘం తరపున ఐదు మండలాల ముఖ్య నాయకుల సమావేశం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, రెవిన్యూ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క గెలుపునకు కృషి చేసిన ముస్లిం సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు నిడమనూరి వంశీకృష్ణ, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జాకీర్, పట్టణ కాంగ్రెస్ నాయకులు షేక్ గౌసుద్దీన్, షేక్ బాషా ముస్లింల ఐక్య సంఘం నాయకులు సయ్యద్ కరీం, మహబూబ్ బాషా, షేక్ గాలిబ్, బాసిత్ అలీ, బాజీ ముదిగొండ, చింతకాని మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పెరిక కుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పెరిక కుల సంక్షేమానికి కృషి చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలో వెంకటగిరిలోని ఓ మామిడితోటలో పెరిక కుల సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పెరిక సంఘం నాయకులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అందరూ ఆటపాటలతో గడిపారు. పిల్లలు మహిళలకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు, నాయకులు, పెద్దలు పాల్గొన్నారు..

యువభారత్ శక్తికి భారత 'సేవారత్న'

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని యువభారత్ శక్తి ఫౌండేషన్ భారత సేవారత్న అవార్డును అందుకుంది. విశాఖపట్టణంలో ఆదివారం అక్కడి తాసుబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మెన్ శంకర్ ఈ అవార్డును యువభారత్ శక్తికి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా యువభారత్ శక్తి ఫౌండర్ కామెర క్రాంతికుమార్ మాట్లాడుతూ యువ భారత శక్తి సేవాసంస్థ నిర్వహిస్తున్న సేవలను గుర్తించిన వైజాగ్ తాసుబెల్లి ఫౌండేషన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భారత సేవారత్న అవార్డును అందించారని క్రాంతికుమార్ తెలిపారు.

కార్మిక, కర్షక ఐక్యత సదస్సును విజయవంతం చేయండి

నవతెలంగాణ-తల్లాడ

ఈ నెల 30న తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక, కర్షక, ఐక్యత సదస్సు తల్లాడ దొడ్డ కృష్ణయ్య భవన్లో నిర్వహిస్తున్నామని, ప్రజా సంఘాల జిల్లా నాయకులు సమావేశానికి హాజరవుతారని సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, ముఖ్య నాయకులు, బాధ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

అమరవీరుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-కూసుమంచి

మహనీయులను, అమరవీరులను, ఉద్యమ విప్లవకారుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, నేడు ప్రజలు యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి చీర్ల చక్రి యువతకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2024 నూతన క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వినోద్, ఉపేందర్, ప్రణయ్, వినయ్, గోపి, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

ఆర్య వైశ్య కమిటీని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రియవంగ ఎన్నుకున్నారు. ఆర్య వైశ్య మండల అధ్యక్షులుగా దోసపాటి శంకర్, కోశాధికారిధార ప్రదీప్, సెక్రెటరీ ప్రవీణ్‌ని ఏకగ్రియవంగ ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీకి కమిటీ సభ్యులుతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనమా గాంధీ, జంగాల శ్రీనివాసరావు, గుప్తా, రాకేష్, దోసపాటి రాంబాబు, వనమా శ్రీను, గోళ్ళ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్వాలకు సన్మానం

నవతెలంగాణ-పాల్వంచ

ఖమ్మం ఉమ్మడి జిల్లాల డిసిసి చైర్మన్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశ నాయక్ సేవాలాల్ సేన ఉపాధ్యక్షుడు భద్రనాయక్ కార్యదర్శి రాందాస్ నాయక్ ఐక్యవేదికా నాయకులు మాలోత్ కోటి నాయక్ డిసిసి నూతన చైర్మన్ కొత్వల శ్రీనివాసరావుకి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎల్ హెచ్ పి ఎస్ నేత లంబడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అత్యధికంగా గిరిజన రైతులు వుండే ఉమ్మడి జిల్లా రైతులకు సంబంధించిన సబ్సిడీ ద్వారా ఎరువులు బ్యాంక్ ల ధ్వారా లోన్లు వ్యవసాయ పరికరాలు సకాలంలో అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గిరిజన ఐక్యవేదిక నాయకులు మాలోత్ కోటి నాయక్ , సేవాలాల్ సేన జిల్లా గౌరవ అధ్యక్షులు అజ్మీర బాబు నాయక్, జిల్లా కార్యదర్శి ఇస్లావత్ రాందాస్ నాయక్, ఐక్యవేదిక నాయకులు తులసి రామ్ నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటో గ్రాఫర్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో మండల అధ్యక్షులుగా లక్ష్మణరావు, కమిటీ సభ్యులుగా నాగేశ్వరరావు, లాల్ సాహెబ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో ఫోటో గ్రాఫర్‌లకు ఎటువంటి సమస్య వచ్చిన ముందుండి పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మండలంలో వున్న ఫోటో గ్రాఫర్‌లను అందరని కలుపుకొని పని చేస్తాను అని అన్నారు. ఎన్నికైన కమిటీకి పలువురు సభ్యులు అభినందనలు తెలియజేశారు.

అల్లాడి నరసింహారావుకు శుభాకాంక్షలు

నవతెలంగాణ-జూలూరుపాడు

జూలూరుపాడు మండల పరిధిలోని కాకర్ల గ్రామం నందు గల రుక్మిణి సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రథమ నూతన చైర్మెన్‌గా కాకర్ల గ్రామానికి చెందిన అల్లాడి నరసింహారావు నియమితులయ్యారు. ఆదివారం ఆయన స్వగృహంలో టిపిసిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నాయకులు అరిగెల నరసింహారావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.11 లక్షల విలువైన గంజాయి పట్టివేత

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకున్నట్టు వారు తెలిపారు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 11 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంజాయి తరలింపుకు ఉపయోగించిన కారును సీజ్ చేశామని తెలియజేశారు. గంజాయిని మల్కాజ్గిరి నుండి దూల్పేట తరలిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఖరీం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మేడేపల్లి విద్యార్థి ఆనంద్ తీర్థ

- పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించిన ప్రణయ్

నవతెలంగాణ-ముదిగొండ





ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం నందు సబ్ జూనియర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో మేడేపల్లి విద్యార్థులు టి. ఆనంద్ తీర్థ (ఎనిమిదవ తరగతి),100 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్ 400 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్, జి. ప్రణయ్ (8వ తరగతి) 100 మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ సాధించి ఫిబ్రవరి నెల 9న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఆనంద్ తీర్థ ఎంపికయ్యారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేడేపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు బియ్యని కృష్ణయ్య ఆదివారం తెలిపారు. సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ కు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, ఎంపిపి సామినేని హరిప్రసాద్,గ్రామ సర్పంచ్ సామినేని రమేష్,ఉపాధ్యాయులు ఆనంద్ తీర్థతో పాటు,జి ప్రణయ్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-ఖమ్మం

వైరా ప్రగతి విద్యాలయం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. 1994-95 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులంతా ఒకచోట సమావేశమయ్యారు. 30 ఏళ్ల నాటి సంఘటనలను గుర్తుచేసుకొని ఆటపాటలతో మునిగి తేలారు. ఉపాధ్యాయులు పాఠశాల చైర్మెన్ యల్లంపల్లి వెంకటరామ నర్సయ్య, ఆనాటి ఉపాధ్యాయులు జాలాది భద్రయ్య, దామా అజిత వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జొన్నలగడ్డ మన్మధరావు, బొంతు మాధవరావు, రామకృష్ణ, సునీల్, నాగబాబు, రాయల సురేష్, బషీర్, సీత, మాధురి, జ్యోతి సుజాత పాల్గొన్నారు.

టీఎస్ ఏటీఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

- మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్ ఫెడరేషన్ 2024 సంవత్సరం పురస్కరించుకుని నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక విద్యాశాఖాధికారి పి.కృష్ణయ్య చేతుల మీదుగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ ఆవరణలో ఈసాల రాంబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఆళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీజీ హెచ్‌ఎంగా వచ్చిన కె.శాంతరావును సంఘం తరుపున ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం ఏటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు ఉండం నాగేంద్రరావు, కుంజ కృష్ణ, జిల్లా అధ్యక్షులు పాయం ఆనందరావు, ప్రధాన కార్యదర్శి చాపల రమేష్ బాబు పర్యవేక్షణలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆళ్ళపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాప నర్సింహారావు, ప్రచార కార్యదర్శిగా కొడం రాంబాబు, కోశాధికారిగా గుంపెనపల్లి సత్యనారాయణ, మహిళా కార్యదర్శిగా ఊకే కోటేశ్వరమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు ఊకె కృష్ణ, పూనెం బాలరాజు, మోకాళ్ళ మోహనరావు, గుండాల బాధ్యులు బొల్లి అంజయ్య, కల్తి రామకృష్ణ, వాసం శ్రీరాములు, కొమరం పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కావ్యచంద్ యలమూడికి సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్ : ఖమ్మం నగరంలో ఆదివారం నిర్వహించిన మహిళా శక్తి సమ్మేళనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కావ్య హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ కావ్యచంద్ యలమూడి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కావ్య హాస్పిటల్స్ చైర్మెన్ రవీందర్ యలమూడి, ప్రసూన పారుపల్లి, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన సినీ ప్రముఖులు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డితో సినీ ప్రముఖులు భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్‌రాజు, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ కెఎల్ దామోదర ప్రసాద్, కౌన్సిల్ సెక్రెటరీ వైవీఎస్ చౌదరి, తెలంగాణ స్టేట్ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ సునీల్ నారాయణ, సెక్రటరీ కె.అనుపమరెడ్డి, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, సెక్రెటరీ టీఎస్ఎన్ దొర, ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రెసిడెంట్ పీవీ రవి కిషోర్, ట్రెజరర్ బాపినీడు, సుప్రియ తదితరులు కలిశారు.

మేడిగడ్డపై ప్రభుత్వ ప్రకటన పట్ల హర్షం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై, సెంట్రల్ వాటర్ కమిషన్, సెంట్రల్ డ్యాం సేఫ్టీ అథారిటీ, ఇంజనీరింగ్ నిపుణులతో రెండు మూడు రోజుల్లో ఒక కమిటీని వేసి చర్చిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించడం పట్ల కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ యుగంలో జరిగిన అతి పెద్ద దగా, మోసానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ దగా, మోసం కేసీఆర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. మేడిగడ్డ బ్యారేజి కుంగుబాటు బయటపడి, మూడు నెలలు దాటినా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చిత్తశుద్ధి లేకుండా, దాటవేసే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇంజనీరింగ్ అధికారులు ప్రజల ప్రయోజనాలను, రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి, కాంట్రాక్టర్ల అడుగులకు మడుగు లొత్తుతూ, వారి ప్రయోజనాలను కాపాడుతూ, యావత్ ప్రపంచంలో తెలంగాణను అభాసుపాలు చేసిందన్నారు.

రేపు 'కీపింగ్ ఆప్ ది గుడ్ ఫైట్' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ మేధావి ప్రబీర్ పురకాయస్థ గ్రంథస్తం చేసిన "కీపింగ్ ఆప్ ది గుడ్ ఫైట్" పుస్తకావిష్కరణ సభ మంగళవారం సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరగనుంది. గ్రంథ రచయిత జేఎన్‌యు విద్యార్థి, ప్రజాస్వామ్యవాది, 1975లో ప్రకటిత ఎమర్జెన్సీని వ్యతిరేకించి సంవత్సర కాలం జైలులో ఉంటూనే, అనంతర కాలంలో రాజ్యాంగ బద్ధమైన హక్కుల కోసం పోరాడిన అనుభవాలను ఇందులో పొందుపరిచారు. తెలంగాణ రాష్ట్ర రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, పట్నం, ఐలూ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని పట్నం ప్రధాన కార్యదర్శి డీజీ నర్సింహారావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరించనున్నారు.జాతీయ సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్, డాక్టర్ కె.నాగేశ్వర్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందు సభలో ఉపన్యసిస్తారు. కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు సీనియర్ అడ్వకేట్ జి.విద్యాసాగర్ అధ్యక్షత వహిస్తారు. ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, యువతీ, యువకులు, విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

జైళ్ల శాఖలో ముగ్గురు అధికారులకు పదోన్నతులు

నవతెలంగాణ-ప్రత్యేకప్రతినిధి

రాష్ట్ర జైళ్ల శాఖలో ముగ్గురు అధికారులకు పదోన్నతులు ఇస్తూ ఆ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. చర్లపల్లి జైళ్లో అసిస్టెంట్ జైలర్‌గా ఉన్న వై. వెంకట్‌రెడ్డికి డిప్యూటీ జైలర్‌గా పదోన్నతినిచ్చి ఆయనను నల్గొండ జైలుకు బదిలీ చేశారు. అలాగే, చంచల్‌గూడ సెంట్రల్ ప్రిజన్స్‌లో అసిస్టెంట్ జైలర్‌గా ఉన్న రాజేందర్‌బాబుకు డిప్యూటీ జైలర్‌గా పదోన్నతినిచ్చి అదే విభాగంలో కొనసాగేలా ఆదేశాలిచ్చారు. మహబూబ్‌నగర్ జైళ్లో అసిస్టెంట్ జైలర్‌గా ఉన్న సుధాకర్‌రెడ్డికి డిప్యూటీ జైలర్‌గా పదోన్నతినిచ్చి అక్కడే కొనసాగమని ఉత్తర్వులిచ్చారు. కాగా, జైళ్ల శాఖలోనే చాలా కాలంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వార్డర్లు, హెడ్ వార్డర్లతో పాటు మరికొందరు అధికారులకు జైళ్ల డీజీ త్వరలోనే పదోన్నతులు ఖరారు చేయనున్నట్టు తెలిసింది.

బీసీల కులగణనను వెంటనే చేపట్టాలి

- దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలి
- మధ్యప్రదేశ్‌లో పీడిత్ అధికార్ యాత్రను ప్రారంభించిన కల్వకుంట్ల కవిత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన ఉద్యమాలు అందరికీ స్ఫూర్తి దాయకమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గుర్తు చేశారు.కేసీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ఓబీసీ హక్కుల కోసం మధ్యప్రదేశ్‌లో పోరాటాన్ని మొదలు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలని అభిప్రాయపడ్డారు. బీసీ కులగణన చేపట్టాలనీ, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లా కేంద్రం నుంచి ఓబీసీ హక్కుల ఫ్రంట్ వ్యవస్థాపకుడు దామోదర్ సింగ్ యాదవ్ తలపెట్టిన 'పీడిత్ అధికార్ యాత్ర'ను ఆమె ప్రారంభించారు. దతియలో ఓబీసీ ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10 ఏండ్లు సీఎంగా ఉండి అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో మంచి పనులు చేశారని తెలిపారు. ఝాన్సీ రైల్వే స్టేషన్‌ను చూస్తే మధ్య ప్రదేశ్ నుంచి వలసలు ఏవిధంగా ఉన్నాయో అర్థమవు తుందన్నారు.పెద్ద పరిశ్రమలు లేని కారణంగా చదువుకున్న పిల్లలు కూడా దూర ప్రాంతాలకు వెళ్లి పని చేసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇటువంటి పరిస్థితులు మధ్యప్రదేశ్‌లో మారాలనిఆకాంక్షించారు. 'కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వంటి వారు పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారు. దేశంలో ఓబీసీ న్యాయమూర్తులు ఎంత మంది ఉన్నారని రాహుల్ గాంధీ అడుగుతున్నారు. ఎవరి తప్పు అది?' అని ప్రశ్నించారు. ఓబీసీ ఫ్రంట్ వ్యవస్థాపకుడు దామోదర్ యాదవ్ మాట్లాడుతూ సంకల్పంతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చనడానికి కేసీఆర్ ఉదాహరణ అని చెప్పారు.

కాంగ్రెస్ నేతలు సంయమనం కోల్పోయి మాట్లాడుతున్నారు : బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి

కాంగ్రెస్ నేతలు సంయమనం కోల్పోయి బీఆర్ఎస్ నేతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడు తున్నారని ఆ పార్టీ నేత రావుల శ్రీధర్‌రెడ్డి చెప్పారు. కేటీఆర్ కాంగ్రెస్ నేతల విమర్శలకు స్పందిస్తే తొందరపడుతున్నారని చెబుతున్న కాంగ్రెస్ నేతలు.... మరి మీరేలా విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు.ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాలనా పరంగా అనేక సంస్కరణలు తెచ్చిన నేత కేటీఆర్...టీఎస్‌ఐపాస్‌తో పారిశ్రామిక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించారని గుర్తు చేశారు.

'సీట్ల' దందా..!



కార్పొరేట్ కాలేజీల మాయ
- మూడు నెలల ముందే అడ్మిషన్లు
- ఇంటర్ కాలేజీల ఇష్టారాజ్యం
- ఇంకా వెలువడని నోటిఫికేషన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్‌మీడియట్ ప్రయివేట్ కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు పూర్తికాక ముందే, వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడకముందే కొన్ని కార్పొరేట్, ప్రయివేటు ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు షురూ చేశాయి. రాయితీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వలవేస్తూ ముందస్తు 'సీట్ల' దందాకు తెరలేపాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొన్ని ఇంటర్ కాలేజీలు జనవరి నెలలోని అడ్మిషన్లు ప్రారంభించాయి. పదోతరగతి పరీక్షలు కూడా పూర్తి కాకముందే పలు కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించాయి. ముందుగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజు రాయితీ భారీగా ఉంటుందని, పదో తరగతి ఫలితాల తర్వాత ఈ రాయితీ ఉండదు అని విద్యార్థుల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ముందుగా బుక్ చేసుకోకుంటే తర్వాత సీట్లు ఉండవని, ఫీజు తగ్గించడం కుదరదని కాలేజీల యాజమాన్యాలు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాయి. మంచి కాలేజీల్లో సీట్లు దొరకవేమోనన్న ఆందోళనలో తల్లిదండ్రులు కాలేజీలు చెప్పిన మొత్తం చెల్లించి సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. ఈ దందాను అరికట్టాలని ఇంటర్‌బోర్డు అధికారులను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

ఏప్రిల్ లేదా మేలో అడ్మిషన్ల నోటిఫికేషన్..

వాస్తవానికి పదోతరగతి పరీక్షలు ముగిసి, ఫలితాలు వెల్లడించిన తర్వాతే ఇంటర్‌బోర్డు ప్రవేశాల నోటిఫికేషన్‌ను జారీ చేస్తుంది. అప్పుడే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఏప్రిల్ లేదా మే నెలలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. కానీ కార్పొరేట్ కాలేజీలు ముందుగానే ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసుకుంటున్నాయి. అడ్వాన్స్ బుకింగ్ పేరిట భారీగా వసూలు చేస్తున్నారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా.. ఇంటర్ విద్యా అధికారుల పర్యవేక్షణా లోపం.. కాలేజీలను అదుపుచేసే పరిస్థితి లేకపోవడంతో ఇలా జరుగుతున్నదని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి.ఉప్పల్‌లోని కొన్ని క్యాంపస్‌లలో బైపీసీ (నీట్)లో అడ్మిషన్లు పూర్తి అయినట్టు ప్రచారాన్ని సృష్టించడం గమనార్హం.

ఇంటర్ పరీక్షలు ఇలా..

ఇంటర్ వార్షిక పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి18వ తేదీ వరకు జరగనున్నాయి. ఫిబ్రవరిలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్నాయి.

నోటిఫికేషన్ తర్వాతనే అడ్మిషన్లు

కిషన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ఇంటర్‌బోర్డు ప్రవేశాల నోటిఫికేషన్ ఏప్రిల్ లేదా మే నెలలో వెలువడే అవకాశం ఉంది. ఆ తర్వాతనే ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభించాలి. ముందే అడ్మిషన్లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఒక్క ఫిర్యాదు రాగా.. ఆ కాలేజీతో మాట్లాడాం.

ముందస్తు అడ్మిషన్లు సరికాదు

రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

పదో తరగతి పరీక్షలు జరగకముందే కార్పొరేట్, ప్రయివేటు కాలేజీలు అడ్మిషన్లు ప్రారంభించడం సరికాదు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మరీ మా కాలేజీల్లో చేర్పించండి అంటూ శ్రీచైతన్య, నారాయణ కాలేజీలు ఒత్తిడి తీసుకోవడం సరికాదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాలేజీలపై వెంటనే చర్యలు తీసుకోవాలి. జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ప్రయివేటు కాలేజీల ఆగడాలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయి.

ఉపాధి కోర్సులపై యూనివర్సిటీలు దృష్టి పెట్టాలి

- ఉన్నత విద్యా మండలి ఛైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రి
- ఉన్నత విద్యలో సమగ్ర మార్పులు రావాలి : ప్రొఫెసర్‌వి.ఎస్.ప్రసాద్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి అందించే కోర్సులపై యూనివర్సిటీలు దృష్టి పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్, దక్షిణ భారత దేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో "భారతదేశంలో ఉన్నత విద్య సమస్యలు, నాణ్యత, సమగ్రత కోసం సవాళ్లు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఉన్నత విద్యను అభ్యసించేవారి సంఖ్యలో గణనీయ వృద్ధి ఉందని తెలిపారు. ఇప్పటికీ దేశంలో ఉన్నత విద్యను అభ్యసించే వారి సంఖ్య 28.4 శాతం కాగా రాష్ట్రంలో ఇది 40 శాతంగా నమోదయిందన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఉన్నత విద్యను అభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, తరగతుల నమోదు శాతం పెరిగిందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే మహిళల సంఖ్య కూడా బాగా పెరిగిందని వివరించారు. అయితే ప్రతీ ఏడాది డిగ్రీ చదివే విద్యార్థులతో పోలిస్తే 15 శాతానికి మించి నమోదు కావట్లేదని తెలిపారు. ఈ అంశంపై అన్ని విశ్వవిద్యాలయాలు దష్టి సారించాలన్నారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, న్యాక్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.ఎస్.ప్రసాద్ మాట్లడుతూ దూర విద్యలో విస్తృత ప్రయోజనాలు, దూర విద్యా వ్యాప్తికి అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ ఉన్నత విద్య వ్యాప్తి ఆ దిశగా వెళ్ళట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకీ పెరుగుతున్న ప్రయివేటీకరణ, మార్కెటీకరణ, సమాజంలో అసమానతలు, పాలకుల్లో చిత్తశుద్ధి లేమి, పక్షపాత ధోరణి వంటివి విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయన్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.సీతారామరావు అధ్యక్షత వహించగా గౌరవ అతిథులుగా విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, సామాజిక శాస్త్రం విభాగ డీన్ ప్రొఫెసర్ వడ్డానం శ్రీనివాస్, సెమినార్ డైరెక్టర్ బి.శ్రీనివాస్, కో-డైరెక్టర్ పి.వెంకట రమణ, పలు విభాగాల అధిపతులు, డీన్లు, అన్ని విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేని మెడికల్ షాప్ సీజ్

- నకిలీ నడుపుతున్న క్లినిక్ క్లోజ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో ఫలక్‌నుమా, జంగమ్మెట్‌లో అనుమతి లేకుండా నడుపుతున్న మెడికల్ షాప్‌ను అధికారులు సీజ్ చేశారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. . ఈ మేరకు ఆదివారం డీసీఏ విశ్వసనీయ సమాచారం ఫలక్ నుమాలో కె.అచ్యుతరెడ్డి దాడి చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు రూ.1.20 లక్షల విలువైన ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో డీసీఏ హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, చార్మినార్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి, మలక్‌పేట్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.అనిల్, మెహిదీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.అన్వేష్ పాల్గొన్నారు. నమూనాలను పరీక్షల కోసం పంపించారు.చట్టప్రకారం నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

అర్హత లేకుండా క్లినిక్ నడుపుతున్న డి.శ్రీనివాస్

విశ్వసనీయ సమాచారంతో మెదక్ జిల్లా, శివంపేట మండలం, కొత్తపేట గ్రామంలో డి.శ్రీనివాస్ నడుపుతున్న క్లినిక్‌పై డీసీఏ అధికారులు దాడి చేసి అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.70 వేల విలువైన 41 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఔషధాల్లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ తదితర ఔషధాలున్నాయి. అనంతరం సిద్ధిపేట అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జె.రాజు, మెదక్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాజా రెడ్డి నమూనాలను పరీక్షలకు పంపించారు.

పంపిణీదారులకు శిక్ష తప్పదు : కమలాసన్ రెడ్డి

అర్హత లేని వ్యక్తులకు, అనుమతి లేని దుకాణాలకు ఔషధాలు సరఫరా చేసే హోల్ సేలర్స్, డీలర్లకు శిక్ష తప్పదని కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వారు డ్రగ్ లైసెన్స్ లేకుండా ఔషధాలను నిల్వ ఉంచుతూ, అమ్మకాలు జరుపుతున్నారనీ, వీరికి డ్రగ్స్, కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం శిక్ష పడుతుందని తెలిపారు. మందులను సరఫరా చేసే ముందు కచ్చితంగా డ్రగ్ లైసెన్స్ ఉన్నవారికే చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా ఔషధాలను నిల్వ ఉంచితే గరిష్టంగా ఐదేండ్ల వరకు జైలు శిక్ష తప్పదని తెలిపారు.

బిల్డర్లను కాపాడుకుంటాం...ప్రోత్సహిస్తాం

- వారు సంపదకు సృష్టికర్తలు : బిల్డర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బిల్డర్లను కాపాడుకుంటామనీ, వారిని ప్రోత్సహిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వారిని కాంట్రాక్టర్లుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా చూస్తున్నామని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో జరుగుతున్న బిల్డర్స్ కన్వెన్షన్ రెండో రోజు ఆదివారం జరిగిన సాంకేతిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశంలో పాల్గొని "బిల్డింగ్ త్రూ టైం, టెక్నికల్ వాల్యూమ్" పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్వెన్షన్‌కు హాజరైన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దేశ నిర్మాణ రంగంలో తెలుగు రాష్ట్రాల బిల్డర్ల పాత్ర ఎక్కువగా ఉన్నదనీ, దేశ సంపదను సృష్టించడంలో వారు కీలక భూమిక పోషిస్తున్నారని అభినందించారు. వారిని ప్రోత్సహించడం ప్రభుత్వం బాధ్యతగా భావిస్తున్నదని స్పష్టం చేశారు. సంపద సృష్టించే సంస్థలు వచ్చినప్పుడే ప్రజల సంక్షేమ అవసరాలను ప్రభుత్వాలు తీర్చగలవని అన్నారు. అలాంటి సంస్థలను గాయ పరిచే ఆలోచన లేనేలేదని తేల్చిచెప్పారు. నిర్మాణ రంగంలో వచ్చిన అనేక విప్లవాత్మక మార్పులతో ఆ రంగం శరవేగంగా దూసుకు పోతున్నదని వివరించారు.

బ్యాంకు గ్యారంటీ రుణాలు తెచ్చుకుని నిర్మాణ రంగంపై పెట్టుబడి పెట్టిన సంస్థలకు సకాలంలో బిల్లులు రాకుంటే ఇబ్బందులు పడతారని తెలిపారు. గతంలో అలాంటి ఇబ్బందుల కారణంగా ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు కనుమరగయ్యాయని గుర్తుచేశారు. తమ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి పునరావతం కానివ్వమని చెప్పారు. పెట్టుబడులకు హైదరాబాద్ అనువైన ప్రాంతమనీ, దేశంలో ఎవరైనా స్థిరబడి వ్యాపారం చేసుకోవడానికి తెలంగాణ వాతావరణం అనుకూలంగా ఉందని చెప్పారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్ రెడ్డి, బి.శ్రీనయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పనులు చేసిన కాంట్రాక్టర్లకు నిర్మాణ పనులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చాలామంది కాంట్రాక్టర్లు ఆర్థిక సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వీలైనంత త్వరగా ఇప్పించాలని భట్టిని కోరారు. ఇరిగేషన్ ప్రాజెక్టులో నిర్మాణం చేసే కాంట్రాక్టర్లకు కొన్ని పన్నుల నుంచి ఇచ్చే మినహాయింపు, రాయితీలను భవన నిర్మాణం కాంట్రాక్టర్లకు కూడా ఇవ్వాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ సచితానంద రెడ్డి, రాష్ట్ర చైర్మెన్ దేవేందర్ రెడ్డి, కో వైస్ చైర్మన్ డీ.వీ.ఎస్ రెడ్డి, నేషనల్ కన్వెన్షన్ చైర్మెన్ ఆర్.రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అధిగమిస్తేనే ఆరోగ్యం...

మారుతున్న కాలంతో పాటు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే తల్లిగా, భార్యగా అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగ నిర్వహణలోని ఒత్తిడులతో పాటు కుటుంబ బాధ్యతలను అదనంగా మోస్తున్నారు. ఇన్ని బాధ్యతల నడుమ కొన్ని సందర్భాల్లో మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడుల ప్రభావం మానసికంగానే కాక, పలు రకాల ఆరోగ్య సమస్యలను దారి తీస్తాయి. వీటిని పూర్తిగా పరిష్కరించుకోవడం కష్టమైనప్పటికీ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పరిస్థితులను కొంతమేర అధిగమించవచ్చని, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఒత్తిడి అనేది ముప్పుకు ప్రతిస్పందన. ఇది నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. ఈ పోటీ ప్రపంచంలో ప్రత్యేకతను చాటుకోవడానికి తేలికపాటి ఒత్తిడి కొంత ఏర్పడుతుంది. తేలికపాటి ఒత్తిడి ప్రేరణకు కారకం. కానీ తీవ్రమైన ఒత్తిడి హానికరమైనది. శారీరక సమస్యలకు గానీ, మానసికంగా గానీ లేదా రెండింటికీ దారి తీసే అవకాశం ఉంది. ఒత్తిడి అనేది ప్రస్తుత పరిస్థితుల్లో ఎవ్వరూ తప్పించుకోలేనిది. అందువల్ల దానిని ఎదిరించి నిలబడాలి.

ఒత్తిడి రకాలు

ఒత్తిడి రెండు రకాలుగా ఉంటుంది.

తీవ్ర ఒత్తిడి : సమస్య ఏర్పడినపుడు తీవ్ర మనస్తాపానికి గురవ్వడం వల్ల ఏర్పడుతుంది. ఆ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. సాధారణంగా ఏదైనా సమస్య ఏర్పడినపుడు శరీరం తట్టుకునేందుకు సిద్ధంగా ఉంటుంది. అయిన కొన్ని సందర్భాల్లో మాత్రం తట్టుకోలేని సమస్య ఎదురైనపుడు గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

దీర్ఘకాలిక ఒత్తిడి : ఎప్పుడు ఏదోక విషయం గురించి ఆలోచిస్తూ ఉండడం వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. ముఖ్యంగా ఇది భావోద్వేగాల ఒత్తిడి అధికమవ్వడం వల్ల వస్తుంది. దీని వల్ల రోగ నిరోదక వ్యవస్థ బలహీనపడుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

మహిళలపై ప్రభావం..

కొంత కాలం కిందటి వరకు ఆవేశం, ఒత్తిడి, గుండె నొప్పి వంటివి మగవారికే ఎక్కువగా వస్తుండేవి. ప్రస్తుతం ఇవి ఆడవారికీ వస్తున్నాయి. ఒత్తిడి ఆడ, మగ ఇద్దరికీ ఉంటుంది. కానీ అది ఆడవారి మీద శారీరకంగా, మానసికంగా వారి ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. పురుషులతో సమానంగా స్త్రీలకూ నేడు పని ప్రదేశాల్లో ఒత్తిడి, ఆందోళన వల్ల అనారోగ్య సమస్యలు సర్వసాధారణమయ్యాయి. మహిళలకుండే శారీరక నిర్మాణం, కుటుంబంలోని బాధ్యతల వల్ల పురుషులకంటే కొంత ఎక్కువగానే సమస్యను ఎదుర్కొంటున్నారు. వీటితో పాటు శరీరంలో జరిగే కొన్ని మార్పుల పైనా ప్రభావం పడుతుంది. ఫలితంగా ఎక్కువగా అనారోగ్యాల పాలవుతున్నారు. భావోద్వేగ ఒత్తిడి సమస్య అధికంగా మగవారి కంటే ఆడవారికే ఎక్కువగా ఉంటుందని నిపుణులు సైతం పేర్కొంటున్నారు. పెండ్లైన మహిళలు పెండ్లి కాని వారి కంటే ఎక్కువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. సాధారణంగా మహిళలు ఎదుర్కొనే మానసిక సంఘర్షణ, ఒంటరితనం, అభద్రత వంటి వాటి వల్ల మైగ్రేన్, తలనొప్పి, కడుపులో పుండ్లు, గుండె నొప్పి, హైపర్ టెన్షన్, మానసికంగా కుంగిపోవడం వంటి సమస్యలకు ఎక్కువగా దారితీస్తుంటాయి. కొందరు ఆత్మహత్యల వరకు వెళ్తుంటారు. వీటన్నింటినీ మహిళలు ఎదుర్కోవాలంటే కొంత అప్రమత్తతలో వ్యవహరించాలి.

హార్మోన్లపై ప్రభావం

ఒత్తిడి వల్ల శరీరంలో హార్మోన్లు ప్రభావితమవుతాయి. దీని ప్రభావం వల్ల శరీరంలోని ప్రతి భాగం అనేక సమస్యలకు లోనవుతుంది. కోపం, బాధ లాంటి నెగటివ్ ఎమోషన్స్ పెరిగి యాంగ్జయిటీ, డిప్రెషన్‌లకు దారితీస్తాయి. శారీరకంగా కూడా దీని ప్రభావం ఉంటుంది. ఫలితంగా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి కూడా తగ్గిపోతుంది. తద్వారా అనేక రకాల ఇన్‌ఫెక్షన్లకు గురవుతారు.

అధిక బరువుకు అవకాశం

ఒత్తిడిని అధిగమించేందుకు మహిళలు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో ఎక్కువగా చేసేది అతిగా తినడం. దీని వల్ల శరీర బరువు పెరగడంతో పాటు రకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.


దీర్ఘకాల వ్యాధుల ముప్పు

ఒత్తిడి అసిడిటీ, అల్సర్ల లాంటి సాధారణ సమస్యల నుంచి గుండె, బీపీ, మధుమేహం, కిడ్నీ సమస్యల దాకా అనేక రకాల జబ్బులను మోసుకొస్తుంది. శ్వాసలోనూ తేడాలు ఏర్పడతాయి. ఊపిరితిత్తుల కాన్సర్ బారిన పడే ప్రమాదముంది. జీర్ణక్రియ మందగిస్తుంది. అందుకే మనం ఎక్కువ ఒత్తిడిలో ఉన్నప్పుడు జలుబు, దగ్గు, జ్వరం లాంటివి కనిపిస్తాయి. ఎముకలు బలహీనమవుతాయి. చిన్న చిన్న విషయాలను సైతం మరిచిపోతుంటారు. ఈ బలహీనతలు వల్ల సంతానలేమి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భాగస్వామితో పంచుకుంటే..

ఒత్తిడి, హార్మోన్లు, రోగనిరోధకశక్తి... ఈ మూడింటి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఒత్తిడి ప్రభావం రోగనిరోధక శక్తిని నాశనం చేస్తుంది. మహిళల్లో తరచుగా నిరాశ లేదా కోపం వస్తుంటే గుండె పోటు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జీవిత భాగస్వామితో తమ సమస్యలను పంచుకుంటే కొంత ఉపశమనం పొందవచ్చు. అలా చేయకపోతే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. సమస్యలను ఎదిరించిగలిగే వారిలో మాత్రం ఈ ప్రమాదం తప్పే అవకాశం ఉంది.





సమస్యను అధిగమించేందుకు..

- ఎవరికి వారే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, మనసును తీవ్ర ఆలోచనల నుంచి మరల్చాలి.
- గతంలో ఎదురైన చేదు అనుభవాలను గుర్తు తెచ్చుకుని ఆలోచనలను అక్కడే ఆపేయకుండా సంతోషాన్ని కలిగించే అంశాలు, పొందిన విజయాల వంటివి స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలి.
- సాధ్యమైనంత వరకు వారంలో కనీసం మూడు రోజులు శారీరక వ్యాయామానికి సమయం కేటాయించాలి. ఇష్టమైన ఆటలు ఆడాలి. మెడిటేషన్, శ్వాస సంబంధిత రిలాక్సేషన్ థెరపీలు చేస్తుండాలి. ఏరోబిక్ చేస్తే మంచి శరీర వ్యాయామంతో పాటు మెదడును స్థిరంగా ఉంచుతుంది. పాజిటివ్‌నెస్‌ను పెంచుతుంది.
- మనసుకు ఆహ్లాదం కలిగించే ప్రదేశాలకు వెళ్ళడం, మనసుకు నచ్చే పనులు చేయడం వల్ల కూడా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- రోజుకు కనీసం 6-7 గంటలు నిద్రపోయేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- తక్కువ కాలరీలు ఉన్న ఆహారాన్ని ఎంచుకోవాలి. ఫైబర్ ఉండే పదార్థాలు, పండ్లు, తాజా కూరగాయాలు ఆహారంలో భాగం చేసుకోవాలి.
- జీవిత భాగస్వామితో బాంధవ్యాన్ని దృఢంగా ఉంచుకునే ప్రయత్నం చేయాలి. ప్రతి విషయాన్ని భాగస్వామితో పంచుకునే ప్రయత్నం చేయాలి. కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులతో, స్నేహితులతో సమయం గడుపుతుండాలి.

శరీరంలో జరిగే ఏ చిన్న మార్పునూ అంత సులువుగా తీసిపారేయొద్దు.. అప్రత్తతతో ఉండటం చాలా అవసరం. ముఖ్యంగా తలనొప్పి, కడుపులో ఇబ్బందిగా అనిపించడం, నీరసం... వంటి లక్షణాలు రోజూ ఉంటుంటే మాత్రం పని ఒత్తిడి మూలంగా వస్తున్నాయని తేలిగ్గా తీసుకుంటూ ఉంటారు. కానీ ఈ లక్షణాలు థైరాయిడ్ సమస్యకు సంకేతాలు కావచ్చు. ఒకవేళ మీలో అలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? చెక్ చేసుకోండి.

నీరసం : పని చేయకపోయినా రోజూ మధ్యాహ్నం వేళ నీరసంగా ఉంటుంటే.. అనుమానించాల్సిందే. థైరాయిడ్ సమస్య ఉన్నవారిలో కనిపించే ప్రధాన లక్షణం నీరసం. జీర్ణ సమస్యలు, డయేరియా లేక మల బద్ధకం థైరాయిడ్లో కనిపించే మరో లక్షణం. కడుపు ఉబ్బరం కూడా ఉంటుంది. బరువులో తేడా థైరాయిడ్ గ్రంథి జీవక్రియలను నియంత్రిస్తుంది. బరువు తగ్గుతున్నట్లయితే హైపర్ థైరాయిడిజం, బరువు పెరుగుతున్నట్లయితే హైపోథైరాయిడిజంగా భావించాలి. మెట బాలిజం లెవెల్స్ పెరగడం, తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది.

ఈ లక్షణాలుంటే జాగ్రత్త...

శ్వాసకోశ సమస్యలు : సోయా, నట్స్, క్యాబేజి వంటి ఆహార పదార్థాలు థైరాయిడ్ పనితీరును తగ్గిస్తాయి. ఇవి తిన్నప్పుడు శ్వాస సమస్యలు తలెత్తినట్లయితే ఒకసారి చెక్ చేయించుకోండి.

డిప్రెషన్ : శరీర పనితీరుపైనే కాకుండా మానసిక పనితీరుపైనా హార్మోన్ల ప్రభావం ఉంటుంది. ఎటువంటి కారణం లేకుండా మూడ్ బాగా లేదని అంటున్నారంటే థైరాయిడ్ గురించి ఆలోచించాల్సిందే.

గాయిటర్ : థైరాయిడ్ గ్రంథి పెరగటాన్ని గాయిటర్ అంటారు. ఎటువంటి చికిత్స తీసుకోని వారిలో థైరాయిడ్ గ్రంథి బాగా పెరిగి గొంతు దగ్గర స్పష్టంగా వాపు కనిపిస్తుంది.

హార్ట్ రేట్ : ఉద్వేగభరితమైన సంఘటనలు ఏమీ లేకపోయినా హార్ట్ బీట్ పెరిగిపోతుంటే కనుక థైరాయిడ్ సమస్య ఉందేమో చెక్ చేసుకోవాలి.

ఆకలి లేకపోవడం : థైరాయిడ్ సమస్య ప్రారంభదశలో కనిపించే లక్షణం ఆకలి లేకపోవడం. బరువు తగ్గుతున్నా, పెరుగుతున్నా ఏమీ తినాలనిపించదు. ఆకలి లేకుండా పోతుంది. ఈ లక్షణాలు కనుక ఉన్నట్లయితే థైరాయిడ్ చెకప్ చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవడం ఉత్తమం.

గ్రామ పంచాయితీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించి, గ్రామ స్వరాజ్యాలుగా తయారుచేయాలి. కానీ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా గ్రామ పంచాయితీలను జేబు సంస్థలుగా వాడుకుంటున్నది' అని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సార్లు పంచాయితీ ఎన్నికలు జరిపినప్పటికీ, ప్రజాతంత్ర యుతంగా నడపడంలో విఫలమయిందని పేర్కొన్నారు. పంచాయితీల సంఖ్యను 12,741కి పెంచినప్పటికీ బడ్జెట్ మాత్రం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.14,369కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం తన ఆదేశాల ప్రకారం నిధులు విడుదల చేస్తుందన్న నమ్మకంతో సర్పంచ్‌లు సొంత డబ్బుతో గ్రామ పంచాయితీల్లో రహదారులు, స్మశాన వాటికలు, పల్లెవనాలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు, పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్ల కొనుగోలుతో పాటు కనీసం 5-8 మంది సిబ్బందిని నియమించి ఆ వ్యయం అంతా భరించారని గుర్తు చేశారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు, అసలు చెల్లించలేక 28 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 14, 15 ఫైనాన్స్ కమిషన్‌లు ఇచ్చిన నిధులు కూడా గ్రామ పంచాయితీలకు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఆ నిధులను కూడా వక్రమార్గం పట్టించారని తెలిపారు. వామపక్ష ప్రభుత్వాలు గ్రామ పంచాయితీలకు బడ్జెట్‌లో 45శాతం నిధులు కేటాయించి, స్వయం పాలన ద్వారా గ్రామాలను అభివృద్ధి చేశాయని పేర్కొన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామపంచాయితీలకు 29 అంశాలను రాష్ట్రప్రభుత్వం బదిలీ చేయాల్సి వున్నప్పటికీ నేటికీ చేయకపోవడంతో ప్రభుత్వం చేతిలో పంచాయితీలు కీలుబొమ్మలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలచేత ఎన్నుకోబడ్డ పాలకవర్గాలను కొనసాగించాల్సిన ఆవశ్యకత రీత్యా వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బాకీలను విడుదల చేయాలనీ, ప్రభుత్వ ఆధీనంలో వున్న గ్రామాభివృద్ధి అంశాలను పంచాయితీలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ నిధులను కూడా నేరుగా పంచాయితీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ-జేడీయూ కూటమిపై ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : జేడీ(యూ) చీఫ్ బిహార్‌లోని మహాకూటమి నుంచి బయటకు వచ్చి బీజేపీతో జట్టు కట్టడంపై ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్త ఏర్పడిన బీజేపీ-జేడీ(యూ) కూటమి కూడా ఎక్కువ కాలం నిలవదని అభిప్రాయపడ్డారు. నితీష్ కుమార్ మహాకూటమి సీఎం పదవీ రాజీనామా చేసి.. ఎన్‌డీఏ కూటమి నేతగా మళ్లీ బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారన్న సమయంలో ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. 2025లో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వరకు కూడా బీజేపీ-జేడీయూ కూటమి స్థిరంగా ఉండదని జోష్యం చెప్పారు. బిహార్‌లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఒక ఏడాది లేదా దాని కంటే తక్కువేనని కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన బీజేపీ-జేడీయూ కూటమిలో రాబోయే పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయన కేవలం ఆరు నెలల్లోనే ఊహించినంత మార్పు సంభవిస్తుందని కూడా తెలిపారు. ఇక 2022లో నితీష్ కుమార్ ఎన్‌డీఏ ఉంచి బయటకు వచ్చారని.. అప్పుడు బిహార్‌లో రాజకీయ స్థిరత్వం ఉంటుందని ఆశించానన్నారు. అయితే రాజకీయ, పరిపాలన పరమైన అంచనాలు ఎప్పటికప్పుడు పెరిగిపోవటం వల్లనే ఇలాంటి కూటమి మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీల మహాకూటమి కూటమి కూడా 2020 వరకు మాత్రమే కొనసాగదని గతంలో తాను అంచనా వేసినట్లు గుర్తు చేశారు. గత అంచనా నిజం అయినట్టు ఇప్పుడు కూడా 2025 వరకు మాత్రమే ప్రస్తుతం ఏర్పడిన బీజేపీ-జేడీయూ కూటమి సైతం కొనసాగుతుందని అన్నారు. అనంతరం బీజేపీ- జేడీయూ కూటమి కూడా బీటలు వారుతుందని ప్రశాంత్ కిషోర్ అన్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- నియోజకవర్గ నిధుల కోసమంటూ వ్యాఖ్య
- మరోసారి రాజకీయ చర్చకు ఆస్కారం !



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆదివారం ఉదయం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వెంట హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసానికి వెళ్లారు. సీఎంకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా 2009, 2014లో టీడీపీ నుంచి రేవంత్, ప్రకాష్‌గౌడ్ రెండు పర్యాయాలు శాసనసభ్యులుగా పనిచేసిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా కొద్దిసమయం పాత విషయాలను నెమరేసుకున్నారు.అయితే పార్లమెంటు ఎన్నికలు సమీస్తున్న తరుణంలో వీరి కలయిక రాజకీయ చర్చకు మరోసాఇ తావిచ్చినట్టయింది. ప్రకాశ్‌గౌడ్ సీఎంను కలవడం తప్పకాకపోయినా, బీఆర్ఎస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇటీవలే నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు తదితరులు ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అయితే బీఆర్ఎస్ నాయకత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వెళ్లారు. దీంతో వారంతా మరుసటి రోజు పార్టీ మారుతున్నారనే ప్రచారాన్ని మీడియా సమక్షంలో ఖండించాల్సి వచ్చింది. తాజాగా ప్రకాశ్‌గౌడ్ సైతం సీఎంను కలిసి తమ నియోజకవర్గ సమస్యలపై చర్చించాననీ, ప్రత్యేక నిధులు కావాలని విజ్ఞప్తి చేశానని చెప్పారు. ఇంకా ఒక్క అడుగు ముందుకేసి 'బరాబర్ కలుస్తా..వందసార్లు కలుస్తా..బీఆర్ఎస్‌లోనే ఉంటా..కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తా..నిధులు కోసం సీఎంను కలిశాను..తప్పేంది' అంటూ ఎదురు ప్రశ్నించారు. శంషాబాద్ మండలం కోత్వాల్‌గూడ, బహదూర్‌గూడ, ఘాన్సిమీయా గూడా గ్రామాల్లో భూసంబంధ సమస్యలు సైతం ఉన్నాయనీ, వాటిని పరిష్కరించాలని కోరినట్టు చెప్పారు. దీనికీ సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది. కాగా ఇటీవల సీఎంను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య ప్రకాష్‌గౌడ్‌తో కలిపి ఐదుకు చేరింది. ఇదిలావుండగా రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం విదితమే. ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు కలిస్తే తప్పేంటని మరో మంత్రి దామోదర రాజనర్సింహ్మా సైతం వ్యాఖ్యానించారు. దీంతో బీఆర్ఎస్‌లో ఒకింత కదలిక వచ్చింది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పందిస్తూ 'అవును సీఎంను కలుస్తాం..అడగ్గానే అపాయింట్‌మెంట్ ఇచ్చారు..ఒక్కరోజులోనే కలవగలిగాం' అని వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. అలాగే రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సైతం నేరుగా మాజీ కౌన్సిల్ చైర్మెన్ స్వామిగౌడ్‌తో కలిసి ప్రకాశ్‌గౌడ్ నివాసానికి వెళ్లారు. అయితే ఇక్కడే ట్విస్ట్ కనిపిస్తున్నది. మంత్రి ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సమకాలిన రాజకీయాలపై చర్చించారు. ఇందులో రాజకీయాలు ఏమీ లేవనీ, కేవలం సాధారణ అంశాలేనని కూడా మీడియాతో వ్యాఖ్యానించారు. ఆ పరిణామం జరిగిన రెండు, మూడు రోజులకే సీఎం రేవంత్ దగ్గరకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ వెళ్లడం బీఆర్ఎస్ వర్గాల్లో కలవరపాటుకు కారణమవుతున్నది. తొలుత నలుగురు ఎమ్మెల్యేలు వెళ్లగానే అప్రమత్తమైన బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇరువురు కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేవరూ నియోజకవర్గ అభివృద్ధి పేర సీఎంను కలవాల్సిన అవసరం లేదని అంతర్గతంగా ఫత్వా జారీ చేసినా, ప్రకాశ్‌గౌడ్ సీఎంను కలవడం వెనుక రాజకీయ కారణాలే ఉండి ఉండొచ్చని ఉహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇప్పుడు ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్ వర్గాల్లో రకరకాల అభిప్రయాలకు చోటిచ్చింది. వర్షం రావడం, ప్రాణం పోవడం ఎవరూ ఊహించలేనట్టే, ఇప్పుడు రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మేనేజ్‌మెంట్ కోటాలో రేవంత్ సీఎం అయ్యాడు !

(మొదటిపేజీ తరువాయి)

ఫీట్లు లేని రేవంత్ రెడ్డి అతిపెద్ద బీఆర్ఎస్ పార్టీని 100మీటర్ల లోతులో ఎలా పాతి పెడతాడని సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఎద్దేవా చేశారు. ఆదివారం సిరిసిల్లలో బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మంచి మంచి తీస్మార్ ఖాన్‌లే కేసీఆర్‌ను ఏం చేయలేకపోయారని, రేవంత్‌రెడ్డి లాంటి బుడ్డరఖాన్‌తో ఏమవుతుందని అన్నారు. 24ఏండ్లు పనిచేసిన కారుకు చిన్న సర్వీసింగ్ అవసరం పడదా అన్నారు. ఇది చిన్న స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. అధికారం పార్టీ కంటే కేవలం 1.8శాతం ఓట్లు మాత్రమే బీఆర్ఎస్ పార్టీకి తక్కువ వచ్చాయని, 14నియోజకవర్గాల్లో స్వల్ప మెజార్టీతో పార్టీ అభ్యర్థులు ఓడిపోయారని తెలిపారు. 420హామీలు ఇచ్చి కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు కోసం ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ తమకు ముఖ్యం కాబట్టి ప్రజల పక్షాన ముందుంటామని, ప్రశ్నించడంలో కేసీఆర్‌ను మించిన నాయకుడు లేడన్నారు. తమ ప్రభుత్వంలో అవినీతి జరిగితే ప్రస్తుత ప్రభుత్వం ఎంక్వైయిరీ చేసి చర్యలు తీసుకోవాలని సవాలు విసిరారు. రైతు భరోసా ఇచ్చినట్టు ముఖ్యమంత్రి బోగస్ మాటలు మాట్లాడుతున్నారని, వచ్చే పంట వరకు రైతు భరోసా ఇవ్వకుంటే తెలంగాణ ప్రజలు చీల్చి చెండాడుతారన్నారు.

39మంది ఎమ్మెల్యేలం కలిసి ప్రభుత్వాన్ని దిగ్బంధనం చేసి సిరిసిల్ల నేతన్నల కోసం పోరాడుతామని హామీ ఇచ్చారు. పోయింది అధికారం మాత్రమే పోరాట ప్రటిమ కాదన్నారు. ఒకరిద్దరు పోయినా పర్వాలేదు.. కొత్తవారిని తయారు చేసుకుందామని, ఐదేండ్లు ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మెజార్టీ ఎందుకు తగ్గిందో చర్చించి లోపాలను మార్చుకుందామని, కార్యకర్తల కోసం కార్యకర్తల కంటే ఎక్కువ కష్టపడతానన్నారు. ఎంపీలుగా వినోద్ కుమార్, బండి సంజయ్‌ల పనితీరును పోల్చుకోని చూడాలని, బండి సంజయ్ జిల్లాలో ఇప్పటివరకు తిరగని మండలాలు కూడా ఉన్నాయన్నారు. పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనప్పటి నుంచి ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా కేంద్రం నుంచి సిరిసిల్లకు తీసుకురాలేదని మండిపడ్డారు. అమిత్ షా చెప్పులు మోసుడు తప్ప బండి సంజయ్ చేసిందేమీ లేదని, సిరిసిల్ల ప్రజలను ఓటు అడిగే హక్కు బండికి లేదన్నారు. భారత్ జోడో అని రాహుల్ గాంధీ అంటుంటే కాంగ్రెస్ చోడో అని ప్రజలు అంటున్నారని, మోడీని ఆపే సత్తా కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు.

కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న సంబంధం వల్లే రెండు ఎమ్మెల్సీలు వాళ్లకు పోయాయని, దాసోజు శ్రావణ్‌ను అంగీకరించని గవర్నర్ కోదండరాంను ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఉన్న అనైతిక ఒప్పందాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎన్ఏఎఫ్ఎస్‌సీటీబీ చైర్మెన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, నాయకులు గూడూరి ప్రవీణ్, మంచే శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, దరువు ఎల్లన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలి పని చేసైనా భార్యకు భరణం చెల్లించాల్సిందే..

లక్నో : ఉద్యోగం లేకపోయినా కూలి పనిచేసైనా విడాకులు తీసుకున్న భార్యకు భరణం చెల్లించాల్సిందేనని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. అన్‌స్కిల్డ్ కార్మికుడిగానైనా పనిచేసి రోజుకు రూ.300 లేదా రూ.400 సంపాదించైనా భరణం చెల్లించాలని భర్తను ఆదేశించింది. విడిపోయిన భార్యకు నెలకు రూ.2,000 భరణంగా చెల్లించాలని కోరుతూ కుటుంబన్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై ఓ వ్యక్తి దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌ను కొట్టివేస్తూ.. హైకోర్టు లక్నో బెంచ్‌లోని న్యాయమూర్తి రేణు అగర్వాల్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తీర్పు ఇచ్చినప్పటి నుంచి భార్యకు చెల్లించాల్సిన భరణం మొత్తాన్ని వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ జడ్జిని ఆదేశించింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఓ జంట 2015లో వివాహం చేసుకుంది. అయితే వరకట్నం కోసం భర్త, ఆయన కుటుంబ సభ్యులు తనను వేధిస్తున్నారంటూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2016లో పుట్టింటికి వెళ్లిపోయింది. కొన్ని రోజులకు ఫ్యామిలీ కోర్టు వీరికి విడాకులు మంజూరు చేస్తూ.. భార్యకు మనోవర్తి కింద నెలకు రూ.2వేలు చెల్లించాలని ఆదేశించింది. ఇలా నెలవారీ భరణం చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ అతడు ఫిబ్రవరి 21, 2023లో హైకోర్టును ఆశ్రయించాడు.

తన భార్య గ్రాడ్యుయేట్ అని, ఉపాధ్యాయురాలిగా నెలకు రూ.10 వేలు సంపాదిస్తుందనే విషయాన్ని ప్రిన్సిపల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని హైకోర్టులో పేర్కొన్నాడు. తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, చికిత్స పొందుతున్నానని, తన తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు తనపైనే ఆధారపడి ఉన్నారని చెప్పాడు. అయితే, భార్య ఉద్యోగం చేసి నెలకు రూ.10 వేలు సంపాదిస్తుందనే విషయాన్ని రుజువు చేయలేకపోయాడు. దీంతో ఉద్యోగం లేకపోయినప్పటికీ కూలీగా రోజుకు కనీసం రూ.300 నుండి రూ.400 సంపాదించైనా భరణం చెల్లించాల్సిందేనని ఆదేశించింది.

మూడు ఉపగ్రహాలను ప్రయోగించిన ఇరాన్

టెహ్రాన్ : ఇరాన్ మూడు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రయోగించింది. గతంలో అనేక వైఫల్యాలను ఎదుర్కొన్న సిమోర్గ్ రాకెట్‌ను కూడా ఇరాన్ విజయవంతంగా ప్రయోగించిందని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐఆర్ఎన్ఏ వార్తా సంస్థ ఆదివారం ప్రకటించింది. సిమోర్గ్ రాకెట్‌ను ప్రయోగిస్తున్న దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ విడుదల చేసింది. వివరాల ప్రకారం.. ఇరాన్‌లోని సెమ్నాన్ ప్రావిన్స్‌లోని ఇమామ్ ఖమేని స్పేస్ పోర్ట్‌లో ఈ ప్రయోగం జరిగింది. మహ్దా, కెహాన్-2, హతేఫ్-1లను ప్రయోగించినట్టు తెలిపింది. ఇది మహ్దాను పరిశోధనా ఉపగ్రహంగా అభివర్ధించింది. కెహాన్, హతేఫ్ ఉపగ్రహాలు వరుసగా గ్లోబల్ పొజిషనింగ్, కమ్యూనికేషన్‌పై దష్టి సారించిన నానో ఉపగ్రహాలుగా పేర్కొంది. ఉపగ్రహ ప్రయోగాలతో ఇరాన్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాన్ని ధిక్కరిస్తున్నాయని అమెరికా గతంలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అణ్వాయుధాలను పంపిణీ చేయగల బాలిస్టిక్ క్షిపణులతో కూడిన ఎటువంటి కార్యకలాపాలను చేపట్టవద్దని ప్రజలకు పిలుపునిచ్చింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి సంబంధించిన యుఎన్ ఆంక్షలు గత అక్టోబర్‌లో ముగిశాయి

ఊసరవెల్లికి గట్టి పోటీ ఇస్తున్న నితీష్ కుమార్ : జైరాం రమేష్

పాట్నా : తరుచూ పార్టీలు మారుతూ జెడియు అధ్యక్షుడు నితీష్ కుమార్ ఊసరవెల్లికి గట్టి పోటీ ఇస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. బీహార్ ప్రజల విశ్వాసాలను ఆయన విస్మరిస్తున్నారని, ప్రజలు ఆయనను క్షమించరని అన్నారు. నితీష్ లాంటి 'ఆయా రామ్.. గయా రామ్' మనుషులు దేశంలో చాలా మంది ఉంటారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎద్దేవా చేశారు. నితీష్ రాజీనామా చేయనున్నట్టు తమకు ముందే తెలుసని, ఈ విషయాన్ని తమకు ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ యాదవ్, తేజస్వీ యాదవ్ ముందే చెప్పారని అన్నారు. ఇండియా ఫోరం సమైక్యతను దష్టిలో ఉంచుకొని తాము ముందే ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు

భారత్‌కు స్పిన్ స్ట్రోక్

తొలి టెస్టులో టీమ్ ఇండియా ఓటమి

- ఉప్పల్‌లో తిప్పేసిన టామ్ హార్ట్లీ
- 28 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ గెలుపు

231 ఛేదనలో రోహిత్‌సేన చతికిల

సొంతగడ్డపై తిరుగులేని రికార్డు. అమ్ములపొదిలో ముగ్గురు ప్రపంచ శ్రేణి స్పిన్నర్లు. ఇద్దరు వరల్డ్ క్లాస్ పేసర్లు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 190 పరుగులు. ఈ దశ నుంచి టీమ్ ఇండియా స్వదేశీ టెస్టులో ఓటమి చవిచూస్తుందని ఎవరూ ఊహించరు. కానీ బజ్‌బాల్ ఇంగ్లాండ్ ఆ పని చేసి చూపించింది. ఓ వైపు గబ్బా కోటలో ఆతిథ్య ఆసీస్‌పై కరీబియన్లు సంచలన విజయం సాధించగా.. ఉప్పల్ కోటలో భారత్‌కు అటువంటి ఓటమే రుచి చూపించింది ఇంగ్లాండ్!. ఒలీ పోప్ (196) సంచలన ఇన్నింగ్స్, అరంగ్రేట స్పిన్నర్ టామ్ హార్ట్లీ (7/62) ఏడు వికెట్ల మాయాజాలంతో తొలి టెస్టులో భారత్‌పై ఇంగ్లాండ్‌పై 28 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

ఉప్పల్ కోట బద్దలైంది. టీమ్ ఇండియాకు కంచుకోటగా ఉన్న హైదరాబాద్‌లో తొలిసారి ఆతిథ్య జట్టుకు పరాజయం ఎదురైంది. 231 పరుగుల ఛేదనలో రోహిత్‌సేన చేతులెత్తేసింది. ధనాధన్ వ్యూహంతో బరిలోకి దిగిన భారత్.. పరుగులు సాధించినా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఇంగ్లాండ్ స్పిన్నర్ టామ్ హార్ట్లీ భారత్‌కు హార్ట్ స్ట్రోక్ ఇచ్చాడు. రవీంద్ర జడేజా రనౌట్, శ్రేయస్ అయ్యర్ వికెట్‌తో భారత్ మ్యాచ్‌పై పట్టు కోల్పోగా.. తెలుగు తేజం కెఎస్ భరత్ నిష్క్రమణతో ఓటమికి మానసికంగా సిద్ధమైంది. గత సిరీస్ తరహాలోనే తొలి టెస్టులో విజయంతో భారత పర్యటనను ఇంగ్లాండ్ ఘనంగా ఆరంభించింది. భారత్, ఇంగ్లాండ్ రెండో టెస్టు ఫిబ్రవరి 2 నుంచి విశాఖపట్నంలో జరుగనుంది.

నవతెలంగాణ-హైదరాబాద్





భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టులో ఆతిథ్య టీమ్ ఇండియా అనూహ్య ఓటమి చవిచూసింది. నాలుగు రోజుల్లోనే ముగిసిన టెస్టులో ఏకంగా మూడు రోజుల పాటు ఆధిపత్యం ప్రదర్శించిన భారత్.. 231 పరుగుల ఛేదనలో చతికిల పడింది. ఊరించే ఛేదనను వేగంగా ముగించాలనే తొందరపాటు రోహిత్‌సేనను కోలుకోలేని దెబ్బ తీసింది. 69.2 ఓవర్లలో 202 పరుగులకే భారత్ కుప్పకూలింది. ఇంగ్లాండ్ అరంగ్రేట స్పిన్నర్ టామ్ హార్ట్లీ (7/62) ఏడు వికెట్ల మాయజాలంతో భారత్‌కు షాక్ ఇచ్చాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (39, 58 బంతుల్లో 7 ఫోర్లు), కె.ఎస్ భరత్ (28, 59 బంతుల్లో 3 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (28, 84 బంతుల్లో 2 ఫోర్లు), కెఎల్ రాహుల్ (22, 48 బంతుల్లో 3 ఫోర్లు) రాణించినా.. జట్టును గెలుపు గీత వరకూ తీసుకెళ్లటంలో విఫలమయ్యారు. భరత్, అశ్విన్ ఎనిమిదో వికెట్‌కు 57 పరుగులు.. సిరాజ్, బుమ్రా పదో వికెట్‌కు 25 పరుగులు జోడించి భారత్‌కు గెలుపుపై ఆశలు రేకెత్తించారు. అంతకుముందు తొలి సెషన్లో ఒలీ పోప్ (196, 278 బంతుల్లో 21 ఫోర్లు) అసమాన శతక ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. బెన్ ఫోక్స్ (34), టామ్ హార్ట్లీ (34), రెహాన్ అహ్మద్ (28) సైతం రాణించటంతో రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 420 పరుగుల భారీ స్కోరు సాధించింది. 163 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్. ఒలీ పోప్ హీరోయిక్స్‌తో చివరి ఐదు వికెట్లకు 257 పరుగులు జతచేసింది. ఇంగ్లాండ్‌కు విజయాన్నందించిన ఒలీ పోప్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు.

భారత్‌కు 'హార్ట్లీ' బ్రేక్!

లక్ష్యం 231 పరుగులు. సొంత గడ్డపై స్పిన్‌ను అలవోకగా ఆడే బ్యాటింగ్ లైనప్‌తో కూడిన భారత్‌కు ఇదేమీ పెద్ద కష్టం కాదనిపించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (39), యశస్వి జైస్వాల్ (15) అందుకు తగినట్టుగానే దూకుడుగా ఆడారు. తొలి వికెట్‌కు 11.4 ఓవర్లలోనే 42 పరుగులు జోడించారు. సాఫీగా సాగుతున్న భారత ఛేదనకు హార్ట్లీ బ్రేక్ వేశాడు. భారత టాప్-3 బ్యాటర్లను అవుట్ చేసి ఇంగ్లాండ్‌ను రేసులోకి తెచ్చాడు. ఇన్నింగ్స్ 12వ ఓవర్లో హార్ట్లీ భారత్‌ను గట్టి దెబ్బకొట్టాడు. ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. యశస్వి జైస్వాల్ షార్ట్ లెగ్‌లో, శుభ్‌మన్ గిల్ (0) సిల్లీ పాయింట్‌లో ఒలీ పోప్‌కు దొరికిపోయారు. దీంతో 42/0 నుంచి భారత్ 42/2కు పడిపోయింది. ఏడు బౌండరీలు బాది జోరుమీదున్న కెప్టెన్ రోహిత్ శర్మ సైతం వికెట్ నిలుపుకోలేదు. హార్ట్లీ బంతిని అంచనా వేయటంలో విఫలమైన హిట్‌మ్యాన్ ఎల్బీగా మూడో వికెట్ రూపంలో నిష్క్రమించాడు. అప్పటికి భారత్ స్కోరు 63/3. అక్షర్ పటేల్ (17)ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ చేసిన భారత్ టీ విరామానికి మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించింది. కెఎల్ రాహుల్, అక్షర్‌లు ఒత్తిడిని ఎదుర్కొని నిలబడ్డారు. టీ విరామ సమయానికి భారత్ 95/3తో నిలిచింది.

ఆశలు రేపి.. వదిలేశారు

విజయానికి మరో 136 పరుగులు అవసరం. చేతిలో ఏడు వికెట్లు. స్పిన్‌ను సమర్థవంతంగా ఆడగల బ్యాటర్లు రాహుల్, అయ్యర్, జడేజా ఉండటంతో గెలుపుపై భారత్ దీమాగా కనిపించింది. కానీ చివరి సెషన్ ఆరంభంలోనే ఇంగ్లాండ్ అదిరే బ్రేక్ సాధించింది. 24 పరుగుల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు కూల్చిన ఇంగ్లాండ్.. ఆతిథ్య జట్టుపై ఒత్తిడి పెంచింది. కెఎల్ రాహుల్ (22), అక్షర్ పటేల్ (17), శ్రేయస్ అయ్యర్ (13) సహా రవీంద్ర జడేజా (2) పెవిలియన్‌కు క్యూ కట్టారు. దీంతో భారత్ 119/7తో ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఇక్కడి నుంచి అశ్విన్ (28), భరత్ (28) మ్యాజిక్ మొదలైంది. జోరుమీదున్న ఇంగ్లాండ్ స్పిన్నర్లను స్వేచ్ఛగా ఆడిన ఈ జోడీ.. ఎనిమిదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేసింది. 130 బంతుల్లో 57 పరుగులు జోడించిన అశ్విన్, భరత్‌లు భారత్‌ను రేసులోకి తెచ్చారు. మరో 55 పరుగులు అవసరమైన దశలో.. ఇద్దరు బ్యాటర్లు క్రీజులో కుదురుకున్నారు. మ్యాచ్ ఐదో రోజుకు చేరుతుందనే అనిపించింది. కానీ టామ్ హార్ట్లీ సూపర్ మాయ చేశాడు. భరత్ డిఫెన్స్‌ను ఛేదించి వికెట్లను గిరాటేశాడు. దీంతో భారత్ మళ్లీ కష్టాల్లో కూరుకుంది.

అశ్విన్ బాధ్యతారహిత దూకుడుతో ఇంగ్లాండ్‌కు మ్యాచ్‌ను అప్పగించేశాడు. క్రీజు వదిలేసి హిట్టింగ్‌కు వచ్చని అశ్విన్ మళ్లీ వెనక్కి వెళ్లలేదు.

ఇంగ్లాండ్ విజయానికి మరో వికెట్ దూరంలో నిలువటంతో అంపైర్లు ఆటను మరో అర గంట పొడగించారు. ఇక్కడ బుమ్రా, సిరాజ్ జోడీ దంచికొట్టింది. వడివడిగా పరుగులు చేస్తూ ఇంగ్లాండ్‌ను ఒత్తిడికి గురి చేసింది. 37 బంతుల్లోనే ఈ జోడీ 25 పరుగులు జోడించింది. లక్ష్యం 30 పరుగుల దిగువకు వచ్చింది. దీంతో మ్యాచ్‌పై ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. ఇక నాల్గో రోజు ఆట చివరి ఓవర్లో మహ్మద్ సిరాజ్ (12) హిట్టింగ్‌కు వచ్చి ఆశలు ఆవిరి చేశాడు. బుమ్రా (6 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 69.2 ఓవర్లలో భారత్ 202 పరుగులకు కుప్పకూలగా.. ఇంగ్లాండ్ 28 పరుగుల తేడాతో గెలుపొందింది.

ఒలీ పోప్ 196

ఓవర్‌నైట్ స్కోరు 316/6తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లాండ్ విలువైన పరుగులు జోడించింది. చివరి నాలుగు వికెట్లకు ఏకంగా 104 పరుగులు జత చేసింది. టెయిలెండర్లలో కలిసి ఒలీ పోప్ (196) అద్భుతమే చేశాడు. రెండు కీలక భాగస్వామ్యాలు నమోదు చేసి ఇంగ్లాండ్ విజయం కోసం పోరాడే పరిస్థితులు కల్పించాడు. రెహాన్ అహ్మద్ (28, 53 బంతుల్లో 3 ఫోర్లు), టామ్ హార్ట్లీ (34, 52 బంతుల్లో 4 ఫోర్లు) విలువైన ఇన్నింగ్స్‌లు ఆడారు. రెహాన్‌తో కలిసి ఏడో వికెట్‌కు 64 పరుగులు, హార్ట్లీతో కలిసి 8వ వికెట్‌కు 80 పరుగులు జత చేశాడు పోప్. ఉదయం సెషన్ ఆరంభంలోనే 17 ఫోర్లతో 212 బంతుల్లో 150 పరుగుల మార్క్ చేరుకున్నాడు. ఉదయం సెషన్లో భారత స్పిన్, పేస్ ధాటికి ఎదురొడ్డి రెహాన్, హార్ట్లీ అదరగొట్టారు. బౌండరీలు బాదుతూ పోప్‌కు అండగా నిలిచారు. ఈ ఇద్దరి నిష్క్రమణతో ఇంగ్లాండ్ కథ ముగిసింది. రికార్డు ద్వి శతకం ముంగిట పోప్.. బుమ్రా బంతికి వికెట్ కోల్పోయాడు. మార్క్‌వుడ్ (0) నిరాశపరచగా.. లీచ్ (0) నాటౌట్‌గా మిగిలాడు. ఉదయం సెషన్లో భారత్ 25.1 ఓవర్లలో 4 వికెట్లు పడగొట్టగా.. ఇంగ్లాండ్ 104 పరుగులు చేసింది. కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడిన పోప్.. డబుల్ సెంచరీ ఘనతకు నాలుగు దూరంలో నిలిచిపోయాడు. పోప్ అసమాన భారీ శతకంతో తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగుల లోటు అధిగమించి.. భారత్‌కు ఇంగ్లాండ్ 231 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

స్కోరు వివరాలు

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ : 246/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 436/10

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ : క్రాప్లీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 31, డకెట్ (బి) బుమ్రా 47, ఒలీ పోప్ (ఎల్బీ) బుమ్రా 196, జో రూట్ (ఎల్బీ) బుమ్రా 2, బెయిర్‌స్టో (బి) జడేజా 10, స్టోక్స్ (బి) అశ్విన్ 6, ఫోక్స్ (బి) అక్షర్ 34, రెహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 28, హార్ట్లీ (బి) అశ్విన్ 34, మార్క్‌వుడ్ (సి) భరత్ (బి) జడేజా 0, లీచ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 32, **మొత్తం:** (102.1 ఓవర్లలో ఆలౌట్) 420.

వికెట్ల పతనం: 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275, 7-339, 8-419, 9-420, 10-420.

బౌలింగ్: బుమ్రా 16.1-4-41-4, అశ్విన్ 29-4-126-3, అక్షర్ 16-2-74-1, జడేజా 34-1-131-2, సిరాజ్ 7-1-22-0.

భారత్ రెండో ఇన్నింగ్స్ : రోహిత్ (ఎల్బీ) హార్ట్లీ 39, జైస్వాల్ (సి) పోప్ (బి) హార్ట్లీ 15, గిల్ (సి) పోప్ (బి) హార్ట్లీ 0, రాహుల్ (ఎల్బీ) రూట్ 22, అక్షర్ (సి,బి) హార్ట్లీ 17, శ్రేయస్ (సి) రూట్ (బి) లీచ్ 13, జడేజా రనౌట్ 2, భరత్ (సి) హార్ట్లీ 28, అశ్విన్ (స్టంప్డ్) ఫోక్స్ (బి) హార్ట్లీ 28, బుమ్రా నాటౌట్ 6, సిరాజ్ (స్టంప్డ్) ఫోక్స్ (బి) హార్ట్లీ 12, ఎక్స్‌ట్రాలు : 20, **మొత్తం :** (69.2 ఓవర్లలో ఆలౌట్) 202.

వికెట్ల పతనం: 1-42, 2-42, 3-63, 4-95, 5-107, 6-119, 7-119, 8-176, 9-177, 10-202.

బౌలింగ్: జో రూట్ 19-3-41-1, మార్క్‌వుడ్ 8-1-15-0, టామ్ హార్ట్లీ 26.2-5-62-7, జాక్ లీచ్ 10-1-33-1, రెహాన్ అహ్మద్ 6-0-33-0.

చాంపియన్ సినర్

- ఫైనల్లో మెద్వదేవ్‌కు నిరాశ
- ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు కొత్త చాంపియన్ వచ్చాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో ఐదు సెట్ల పోరాటంలో పైచేయి సాధించిన జానిక్ సినర్.. మెన్స్ సింగిల్స్ విజేతగా నిలిచాడు. మూడో సీడ్ రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్‌కు ముచ్చటగా మూడోసారి మెల్‌బోర్న్ ఫైనల్లో నిరాశే ఎదురైంది. టైటిల్ పోరులో 6-3, 6-3తో వరుసగా తొలి రెండు సెట్లు నెగ్గిన మెద్వదేవ్ టైటిల్‌కు సెట్ దూరంలో నిలిచాడు. చావోరేవో తేల్చుకోల్సిన తరుణంలో చెలరేగిన సినర్ వరుసగా చివరి మూడు సెట్లను 6-4, 6-4, 6-3తో సొంతం చేసుకున్నాడు. ఇటలీ స్టార్ సినర్‌కు ఇదే తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్. సినర్ 14 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో మెరువగా.. మెద్వదేవ్ 4 నాలుగు బ్రేక్ పాయింట్లు, 11 ఏస్‌లు కొట్టాడు. పాయింట్ల పరంగా 142-141తో సినర్ పైచేయి సాధించాడు.

గబ్బాలో కరీబియన్ల కేక

ఆసీస్‌పై విండీస్ అదిరే విజయం



బ్రిస్బేన్ : ఆసీస్ కంచుకోట గబ్బాను కరీబియన్ల వశమైంది!. వర్థమాన యువ క్రికెటర్లతో కూడిన వెస్టిండీస్ ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాపై 8 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌ను 1-1తో సమం చేసింది. 216 పరుగుల ఛేదనలో ఆస్ట్రేలియా 207 పరుగులకే కుప్పకూలింది. కరీబియన్ యువ పేసర్ షామర్ జోసెఫ్ (7/68) నిప్పులు చెరిగే ప్రదర్శనతో కంగారూలు తోక ముడిచారు. ఓపెనర్ స్టీవ్ స్మిత్ (91 నాటౌట్, 146 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), కామెరూన్ గ్రీన్ (42, 73 బంతుల్లో 4 ఫోర్లు) పోరాడినా.. ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 311 పరుగులు చేయగా.. ఆసీస్ 298/9 పరుగులే చేసింది. 22 పరుగుల వెనుకంజలో నిలిచినా ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ఇచ్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ 193 పరుగులు చేసింది. కరీబియన్లను తక్కువ అంచనా వేసిన ఆసీస్ గబ్బా టెస్టు ఓటమితో భారీ మూల్యం చెల్లించుకుంది. కరీబియన్ పేసర్ షామర్ జోసెఫ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను దక్కించుకున్నాడు.

మాస్టర్స్ గేమ్స్ జెర్సీ ఆవిష్కరణ



హైదరాబాద్ : 6వ జాతీయ మాస్టర్స్ గేమ్స్ ఫిబ్రవరి 8 నుంచి 14 వరకు గోవాలో జరుగనున్నాయి. తెలంగాణ నుంచి 246 మంది మాస్టర్ అథ్లెట్లు ఈ టోర్నీలో పోటీపడనున్నారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, హాకి, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో తెలంగాణ మాస్టర్ అథ్లెట్లు బరిలోకి దిగుతున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే తెలంగాణ అథ్లెట్ల జెర్సీని ఆదివారం బెల్ హాకి స్టేడియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ వైస్ చైర్మన్ జగజీవన్ రెడ్డి ఆవిష్కరించారు.

నవచిత్రం

హిమాలయాల్లో నయా షెడ్యూల్



శ్రీనువైట్ల, గోపీచంద్

దర్శకుడు శ్రీను వైట్ల ప్రస్తుతం హీరో గోపీచంద్‌తో ఓ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను రూపొందిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటివరకు ఇటలీలో ఒక షెడ్యూల్, గోవాలో మరొక షెడ్యూల్ పూర్తి చేశారు. లేటెస్ట్‌గా ఆదివారం గోపీచంద్, ఇతర ప్రముఖ తారాగణంతో హిమాలయాలలోని కొన్ని అద్భుతమైన ప్రదేశాలలో కీలకమైన, లెంగ్తీ షూటింగ్ షెడ్యూల్‌ను ప్రారంభించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ వేణు దోనేపూడి ఈ ప్రాజెక్ట్‌తో చిత్ర నిర్మాణంలోకి అడుగు పెడుతున్నారు. చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన యాక్టర్స్‌కు డిఫరెంట్ మేకోవర్లు ఇవ్వడంలో పేరుపొందిన శ్రీను వైట్ల గోపీచంద్‌ని ఈ సినిమాలో సరికొత్తగా చూపించబోతున్నారు. ఇందులో యాక్షన్‌తో పాటు శ్రీనువైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది. శ్రీనువైట్ల తెరకెక్కించిన పలు బ్లాక్‌బస్టర్స్‌తో అనుబంధం ఉన్న రచయిత గోపీ మోహన్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్.

ప్రేక్షకుల్ని థ్రిల్ చేసే బహుముఖం

నటుడు హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు రచన, నిర్మాణం, దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'బహుముఖం' అనే టైటిల్ పెట్టారు. గుడ్, బ్యాడ్ అండ్ యాక్టర్ అనేది ట్యాగ్‌లైన్.
ఈ సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్ అట్లాంటా, మాకాన్, కాంటన్, జార్జియా, యుఎస్‌ఏ పరిసర ప్రాంతాలలో చిత్రీకరించబడింది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హర్షివ్ కార్తీక్ కాంప్లెక్స్ క్యారెక్టర్ కనిపిస్తోంది. స్వర్ణిమా సింగ్, మరియా మార్టినోవా కథానాయికలు. క్రిస్టల్ మౌంటైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రానికి అరవింద్ రెడ్డి సహ నిర్మాత. ల్యూక్ ఫ్లెచర్ సినిమాటోగ్రాఫర్ కాగా, శ్రీచరణ్ పాకాల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూర్చారు. హర్షివ్ కార్తీక్ డైలాగ్స్ అందించారు.



హర్షివ్ కార్తీక్



లక్ష్

యుద్ధం చేసే రాముడు రావాలి

'వలయం, గ్యాంగ్‌స్టర్ గంగరాజు' వంటి సినిమాలతో మాస్ హీరోగా లక్ష్ చదలవాడ అందరినీ ఆకట్టుకున్నారు. లేటెస్ట్‌గా మరో మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ధీర'తో ఆడియెన్స్ ముందుకు రాబోతున్నారు. ఈ మూవీని చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర బ్యానర్ పై పద్మావతి చదలవాడ నిర్మిస్తున్నారు. విక్రాంత్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గా మేకర్స్ రిలీజ్ చేసిన ట్రైలర్‌కి విశేష స్పందన లభిస్తోంది. ఈ ట్రైలర్‌లోని విజువల్స్, డైలాగ్స్, హీరోకి ఇచ్చిన ఎలివేషన్స్, లవ్, యాక్షన్ ఇలా అన్ని అంశాలు హైలెట్ అవుతున్నాయి.
'ఈ మనిషి బ్రెయిన్ ఉంది చూడు అది వెరీ డేంజరస్'.. అనే డైలాగ్స్‌తో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. 'రాజ్ గురుని మన అటాక్ నుంచి కాపాడాలంటే.. రథం నడిపే కృష్ణుడితో పాటు.. యుద్ధం చేసే రాముడు రావాలి.. ఎవడైనా ఉంటాడా?' అనే డైలాగ్‌తో హీరో ఇంట్రడక్షన్ ఇవ్వడం అదిరిపోయింది. హీరోని చూపించిన తీరు ఆకట్టుకుంటుంది. 'నేను యుద్ధం చేయడం ఏంట్రా.. యుద్ధమే మిమ్మల్ని వెంటాడుతూ వేటాడుతూ వస్తోంది.. రూ. 25 లక్షలతో మొదలైన నా జర్నీ రూ.2500 కోట్లకు చేరింది..' అంటూ చివరి డైలాగ్‌తో సినిమా మీద అంచనాలు పెంచేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా విడుదల కానుంది.



కిస్మత్ రిలీజ్‌కి రెడీ

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వ దేవ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న బడ్డీ కామెడీ ఎంటర్‌టైనర్ 'కిస్మత్'. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో పోషిస్తున్నారు. రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సిహెచ్ భానుప్రసాద్ రెడ్డి సహ నిర్మాత. ఈ చిత్రం ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించింది.
డైరెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ, 'కరోనా లాక్‌డౌన్ సమయంలో నిర్మాత రాజు పరిచయమయ్యారు. దాదాపు ఆరు నెలలు పాటు వర్క్ చేశాక కథ అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రం ప్రేక్షకులందరినీ ఎంటర్‌టైన్‌చేస్తుంది' అని అన్నారు. 'శ్రీనాథ్ నాకు చాలా నచ్చిన డైరెక్టర్. చాలా క్లారిటీతో ఉంటారు. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నాను. నిర్మాత రాజు చాలా కూల్‌గా, కాన్ఫిడెంట్‌గా ఉంటారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని శ్రీనివాస్ అవసరాల చెప్పారు. సంగీత దర్శకుడు మార్క్ కే రాబిన్ మాట్లాడుతూ,'చాలా మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. మా కిస్మత్‌ని ప్రేక్షకులు మారుస్తారనే నమ్మకం ఉంది' అని అన్నారు.

అఘోరాగా విశ్వక్‌సేన్



విశ్వక్‌సేన్

విద్యాధర్ కాగిత దర్శకత్వంలో హీరో విశ్వక్ సేన్ నటిస్తున్న చిత్రం 'గామి'. కార్తీక్ కుల్ట్ క్రియేషన్స్‌పై కార్తీక్ శబరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ అడ్వెంచర్ డ్రామాని వి సెల్యులాయిడ్ సమర్పిస్తోంది. ఈ చిత్రానికి క్రౌడ్ ఫండ్ చేశారు.
తాజాగా మేకర్స్ హైదరాబాద్ కామిక్ కాన్‌లో ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేసి, సినిమా ప్రమోషన్‌లను ప్రారంభించారు. అఘోరా గెటప్‌లో ఉన్న విశ్వక్ సేన్ ఆశ్చర్యపరిచారు. చుట్టూ చాలా మంది అఘోరాలు అతనిని తాకడానికి ప్రయత్నిస్తారు. డార్క్ మిస్టీరియస్ ఫీలింగ్‌ని కలిగిస్తోంది. ఆడియన్స్‌లో చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేసింది.
'ఈ చిత్రంలో విశ్వక్ సేన్ 'శంకర్' అనే అఘోరాగా కనిపించనున్నారు. తనకి చాలా రేర్ కండీషన్ ఉంటుంది. అతను ఏ మానవ స్పర్శను అనుభవించలేడు' అని మేకర్స్ అనౌన్స్ చేశారు. అలాగే ఈ చిత్రానికి పెట్టిన ట్యాగ్‌లైన్ ఆ పాత్ర భావోద్వేగ సంఘర్షణ తాలూకా లోతును తెలిజేస్తుంది. దర్శకుడు విద్యాధర్ మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో అఘోరా సెటప్‌తో పాటు, రెండు విభిన్నమైన సెటప్‌లు ఉన్నాయి. భిన్నమైన ఇతర పాత్రలూ ఉన్నాయి. ప్రమోషన్స్‌లో వాటి గురించి రివీల్ చేస్తాం' అని అన్నారు. ఈ చిత్రంలో 'కలర్ ఫోటో' ఫేమ్ చాందిని చౌదరి కథానాయికగా నటిస్తుండగా, ఎంజి అభినయ, హారిక, మహ్మద్ సమద్ ముఖ్య తారాగణం. త్వరలోనే విడుదల తేదీని అనౌన్స్ చేయనున్న ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే - విద్యాధర్ కాగిత, ప్రత్యూష్ వత్యం, ప్రొడక్షన్ డిజైన్ - ప్రవల్య దుడ్డుపూడి, ఎడిటర్ - రాఘవేంద్ర తిరున్, సంగీతం - నరేష్ కుమారన్, డీవోపీ - విశ్వనాథ్ రెడ్డి, యాక్షన్ కొరియోగ్రాఫర్ - వింగ్ చున్ అంజి, పాటలు - నరేష్ కుమారన్, స్వీకర్ అగస్తి, సాహిత్యం - సనాపతి భరద్వాజ పాత్రుడు, శ్రీ మణి.

ఉత్సవం సూపర్ హిట్ ఖాయం : బ్రహ్మానందం



దిలీప్ ప్రకాష్, రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకుడు హార్న్‌బిల్ పిక్చర్స్‌పై సురేష్ పాటిల్ నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్ర టీజర్‌ని లాంచ్ చేశారు. బ్రహ్మానందం, నిర్మాత ఏఎం రత్నం ముఖ్య అతిథులుగా హాజరైన ఈ టీజర్ లాంచ్ వేడుక గ్రాండ్‌గా జరిగింది.
బ్రహ్మానందం మాట్లాడుతూ, 'నటులు, నట జీవితం అంటే నాకు ఒక ఎమోషనల్ ఎటాచ్‌మెంట్. ఆర్ట్ ఈజ్ లాంగ్.. లైఫ్ ఈజ్ షార్ట్. చివరి వరకూ మిగిలిపోయేది కళ మాత్రమే. కళా కారులందరినీ ఒక్క చోటికి చేర్చి వీరిపై ఒక సినిమా చేయాలని ఆలోచన చేసిన దర్శకుడు అర్జున్ సాయికి మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇలాంటి సినిమాలు ఎన్నుకోవాలంటే ధైర్యంతో పాటు సినిమాటిక్‌గా చెప్పే నేర్పు కావాలి. దర్శకుడు చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. అందరూ అద్భుతమైన నటన ప్రదర్శించారు. నిజంగా ఈ సినిమా 'ఉత్సవం'లా ఉంటుంది. ఖచ్చితంగా సినిమా సూపర్ డూపర్ హిట్ అవుతుంది' అని అన్నారు. 'కలర్‌ఫుల్, ఎమోషనల్ జర్నీ, కంటెంట్ బేస్డ్ సినిమాతో పరిచయం కావడం గర్వంగా, గౌరవంగా ఉంది' అని హీరో దిలీప్ చెప్పారు.
సినిమాకి మూలమే నాటకరంగం. ఈ టీజర్‌లోని మొదటి డైలాగే చాలా ఆకట్టుకునేలా ఉంది. ఇంతమంది లెజెండరీ నటులతో ఈ చిత్రాన్ని రూపొందించడం చాలా విశేషం' అని నిర్మాత ఏఎం రత్నం తెలిపారు.
దర్శకుడు అర్జున్ సాయి మాట్లాడుతూ, 'దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. టీజర్ లాంచ్ చేసిన బ్రహ్మానందం, నిర్మాత ఏఎం రత్నంకి కృతజ్ఞతలు' అని చెప్పారు. ఎల్. బీ శ్రీరామ్ మాట్లాడుతూ, 'నాటకానికి సంబంధించి ఎన్నో మంచి చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఈ సినిమా వస్తోంది. సినిమా చాలా బావుంటుంది. నాటకం అమ్మలాంటిది. నాటకం నుంచి పుట్టిన అనేక రూపాలే నేటి కళారూపాలు. తల్లిని గౌరవించినపుడే మనకి కూడా 'ఉత్సవం' అని అన్నారు.
'ఇదొక హార్ట్ టచ్చింగ్ సబ్జెక్ట్. ఇందులో చాలా పాటలు ఉన్నాయి. నేను చేసిన సినిమాల్లో ఉత్సవం కూడా మంచి ఆల్బమ్ అవుతుందని నమ్ముతున్నాను' అని చెప్పారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని ముందు ఏ సభలో ప్రవేశ పెట్టాలి?


డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

1. అయోధ్యలోని వివాదాస్పద భూమి రాంలల్లా విరాజ్మాన్‌కే చెందుతుందని ఎంతమందితో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది.
   1. 6 2. 10 3. 4 4. 5
2. పిల్ అనే భావన భారతదేశంలో ప్రాచుర్యాన్ని కల్పించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు?
   1. పి యస్ భగవతి 2. వైవి చంద్రచుడ్ 3. వి.ఆర్. కృష్ణ అయ్యర్ 4. పై అందరూ
3. 49వ భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
   1. ఎస్ వి రమణ 2. డి.వై. చంద్రచుడ్ 3. యూ యూ లలిత్ 4. వై వి చంద్రచుడ్
4. సుప్రీంకోర్టులో న్యాయమూర్తులుగా పనిచేయని మహిళలు?
   1. భానుమతి 2. రూమపాల్ 3. హిమకోహ్లీ 4. రమాదేవి
5. ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం న్యాయస్థానాలకు న్యాయ సమీక్ష అధికారం కల్పించాలని పేర్కొన్నవారు?
   1. కె యం మున్షి 2. అంబేద్కర్ 3. కె టీ షా 4. బాబు రాజేంద్రప్రసాద్
6. అమెరికా సుప్రీంకోర్టు ఏ కేస్ లో మొదటిసారిగా "న్యాయసమీక్ష" అనే భావనకు పునాదులు వేసింది.
   1. సజ్జన్ సింగ్ Vs రాజస్థాన్ 2. మార్బురి Vs మడిసిన్ 3. కామన్ కాస్ కేస్ 4. ఏదీకాదు
7. శాసన శాఖ శాసనాలు, కార్యనిర్వాహక శాఖ యొక్క పరిపాలన చర్యలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే దానిని ఈక్రింది విధంగా పేర్కొంటారు?
   1. అమికస్ క్యూరి 2. అల్ట్రా వైర్స్ 3. ఇంట్రా వైర్స్ 4. ఎక్స్ట్రా వైర్స్
8. క్రింది ఏ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మొదటిసారిగా న్యాయస్థానాలకు న్యాయ సమీక్ష అధికారం తొలగించబడింది.
   1. 25వ రాజ్యాంగ సవరణ 2. 43వ రాజ్యాంగ సవరణ 3. 42వ రాజ్యాంగ సవరణ 4. 44వ రాజ్యాంగ సవరణ
9. భారతదేశంలో న్యాయవ్యవస్థ పితామహుడిగా ఎవరిని అంటారు?
   1. కారన్ వాలిస్ 2. విలియం బెంటింగ్ 3. లార్డ్ మెకాలే 4. లార్డ్ మిటో
10. రెగ్యులేటింగ్ చట్టం ప్రకారం ఏర్పడిన తొలి సుప్రీం కోర్టులో న్యాయమూర్తులు.
    ఎ. హెచ్ జె కానియా బి. ఛాంబర్లీన్ సి. లేమియోస్టార్ డి. హైడ్
    1. ఎ, డి, సి 2. బి, సి, డి 3. ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి
11. ఫెడరల్ కోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి.
    1. సర్ ఎలిజ ఇంఫె 2. మౌరిస్ గ్వయర్ 3. పాట్రిక్ స్పెన్స్ 4. హెచ్ జె కానియా
12. ఫెడరల్ కోర్టు స్థానంలో ప్రస్తుత సుప్రీం కోర్టు ఏ సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది?
    1. 1947 2. 1935 3. 1950 4. 1952
13. న్యాయవాదిగా పనిచేసి నేరుగా సుప్రీంకోర్టుకు న్యాయమూర్తి అయిన రెండవ తెలుగు వారు?
    1. లావు నాగేశ్వరరావు 2. ఎస్ వి రమణ 3. కొక సుబ్బారావు 4. పీ యెస్ నరసింహ
14. 127వ నిబంధన ప్రకారం తాత్కాలిక న్యాయమూర్తులు గరిష్టంగా ఎంతకాలం పదవిలో వుంటారు?
    1. 3 సంవత్సరాలు 2. 1 సంవత్సరం 3. 4 సంవత్సరాలు 4. 2 సంవత్సరాలు
15. న్యాయమూర్తులను తొలగించే తీర్మానాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టాలంటే ఎంత మంది సభ్యుల మద్దతు ఉండాలి.
    1. 10 2. 50 3. 100 4. 25



16. న్యాయమూర్తుల తొలగింపు తీర్మానాన్ని సభ అధ్యక్షులు ఆమోదించి విచారణ కమిటీకి ఆదేశిస్తారు. ఈ కమిటీలో ఎంతమంది ఉంటారు?
    1. 5 2. 3 3. 4 4. 6
17. క్రింది వాటిలో సరైనది/ సరైనవి గుర్తించండి.
    1. సుప్రీంకోర్టు రాజ్యాంగానికి సంరక్షణ కర్తగా పనిచేస్తుంది.
    2. ప్రజలు కానీ ప్రభుత్వం కానీ పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే సుప్రీంకోర్టు సంరక్షిస్తుంది.
    3. ఎ మరియు బి 4. పై ఏదీకాదు
18. సుప్రీంకోర్టు అధికార పరిధి విస్తరింపజేసే అధికారం..
    1. రాష్ట్రపతి 2. రాజ్యసభ 3. పార్లమెంట్ 4. కొలీజియం
19. కోర్టు తనకు తాను స్వతహాగా కేసులను విచారించడాన్ని ఏమని అంటారు.
    1. అమికస్ క్యూరి 2. కోర్టు ఆఫ్ రికార్డ్ 3. పిల్ 4. సుమోటో కేస్
20. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రధాన కార్యాలయం ఎక్కడ కలదు.
    1. జెనివా 2. వాషింగ్టన్ 3. రోమ్ 4. దిహెగ్
21. కేరళ రాష్ట్ర మంత్రిగా పనిచేసి సుప్రీంకోర్టు న్యాయ మూర్తిగా నియామకం అయిన ఏకైక వ్యక్తి ఎవరు?
    1. సుభాష్ రెడ్డి 2. వి. ఆర్. కృష్ణ అయ్యర్ 3. కె.జి. బాలకృష్ణన్ 4. భగవతి
22. సుప్రీంకోర్టుకు తపాలా శాఖ ప్రత్యేక పిన్‌కోడ్ ను ఏ సంవత్సరం కేటాయించింది?
    1. 2013 2. 2015 3. 2005 4. 2021
23. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా నియామకం అయిన జె కె మహేశ్వరి ఏ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు?
    1. ఆంధ్రప్రదేశ్ 2. తెలంగాణ 3. గుజరాత్ 4. కర్ణాటక
24. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా నియామకం అయిన హిమకోహ్లీ ఏ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు.
    1. సిక్కిం 2. తెలంగాణ 3. గుజరాత్ 4. కర్ణాటక
25. ఇటీవల కాలంలో సుప్రీంకోర్టుకు నియామకం అయిన తొమ్మిది మంది న్యాయమూర్తులలో ఎంతమందికి 2027లో ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం కలదు.
    1. 1 2. 2 3. 3 4. 4
26. సుప్రీంకోర్టులో ఇప్పటివరకు ప్రధాన న్యాయ మూర్తులుగా పనిచేసిన తెలుగువారు?
    1. 1 2. 3 3. 4 4. 2
27. డివై చంద్రచూడ్ సుప్రీంకోర్టుకు ఎన్నవ ప్రధాన న్యాయమూర్తి?
    1. 50 2. 49 3. 48 4. 47
28. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి పదవి విరమణ తరువాత రాష్ట్రపతిగా పోటీచేసి ఓడిపోయిన వారు?
    1. కోక సుబ్బారావు 2. హిదయతుల్లా 3. గజేంద్ర గద్కర్ 4. ఎస్‌ఎమ్ సిక్రీ
29. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన రెండవ తెలుగువారు ఎవరు?
    1. లావు నాగేశ్వరరావు 2. కొక సుబ్బారావు 3. సుభాష్ రెడ్డి 4. యస్ వి రమణ
30. క్రింది వాటిలో సరైన వాటిని గుర్తించండి.
    1. రాజ్యాంగ సవరణలను విచారించే అధికారం హైకోర్టుకు లేదు
    2. రాజ్యాంగ సవరణలకు విచారించే అధికారం సుప్రీంకోర్టుకు కలదు
    3. 1 మరియు 2 4. ఏదీ కాదు
31. హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టు అప్పీళ్ళను విచారించే అధికారం కలదు. అయితే హైకోర్టు అనుమతి అవసరం ఒకవేళ హైకోర్టు అనుమతి నిరాకరిస్తే ఏ నిబంధన ప్రకారం ప్రత్యేక అనుమతి వివాదాల రూపంలో అప్పీళ్ళను స్వీకరిస్తుంది.
    1. 131 2. 142 3. 136 4. 222
32. భారత రాజ్యాంగంలో 132వ నిబంధన దేనిని తెలియజేస్తుంది.
    1. రాజ్యాంగ పరమైన వివాదాలు 2. క్రిమినల్ వివాదాలు 3. సివిల్ వివాదాలు 4. పైవన్నీ
33. ఇప్పటి వరకు అభిశంసన తీర్మానం ద్వారా ఎంతమంది న్యాయమూర్తులు తొలగించబడ్డారు?
    1. 2 2.1 3. 3 4. తొలగించబడలేదు
34. న్యాయమూర్తుల తొలగింపు తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశ పెట్టాలంటే ఎంతమంది సభ్యుల మద్దతు ఉండాలి.
    1. 50 2. 100 3. 10 4. 20
35. 121వ రాజ్యాంగ సవరణ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు?
    1. 31.12.2014 2. 13.4.2015 3. 8.12.2014 4. 10.13.2014
36. న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రధాన న్యాయమూర్తి సలహాను రాష్ట్రపతి పాటించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పునిచ్చింది?
    1. మొదటి జడ్జెస్ కేసు 2. రెండవ జడ్జెస్ కేసు 3. మూడవ జడ్జెస్ కేసు 4. ఏదీకాదు
37. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌లో ఎంత మంది ఉండేవారు?
    1. 4 2. 6 3. 8 4. 10
38. జాతీయ న్యాయ నియామకాల కమిషన్ ఎప్పటి నుండి అమల్లోకి వచ్చింది.
    1. 13.4.2015 2. 8.12.2014 3.10.13.2014 4. 31.12.2015
39. న్యాయమూర్తుల సంఖ్యను చివరిసారిగా 31 నుండి 34 కు ఏ సంవత్సరంలో పెంచారు?
    1. 2021 2. 2019 3. 2009 4. 2018
40. న్యాయవాదిగా పనిచేసి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఐన తొలివారు?
    1. కులదీప్‌సింగ్ 2. సంతోష్ హెగ్డే 3. యస్ యమ్ సిక్రీ 4. ఎవరు కాదు
41. ఫెడరల్ కోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినవారు?
    1. యస్ వరదాచారి 2. మౌరిస్ గ్వయర్ 3. లేమియోస్టార్ 4. పై ఎవరూ కాదు
42. ఫెడరల్ కోర్టు ఏ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది?
    1. 1726 2. 1935 3. 1937 4. 1950
43. ఫెడరల్ కోర్టు చివరి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
    1. పాట్రిక్ స్పెన్స్ 2. వరదాచారి అయ్యర్ 3. మౌరిస్ గ్వయర్ 4. హెచ్ జె కానియా
44. జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించింది ఎవరు?
    1. న్యాయశాఖ మంత్రి 2. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి 3. రాష్ట్రపతి 4. ప్రధానమంత్రి
45. 2002లో రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ న్యాయ మూర్తుల పదవి విరమణ వయసు ఎంతకు పెంచాలని సిఫార్సు చేసింది.
    1. 68 2. 70 3. 66 4. 67
46. క్రింది వాటిలో సరైంది గుర్తించండి.
    1. ప్రధాన మరియు ఇతర న్యాయమూర్తుల నెలసరి వేతనం 280000
    2. పదవీకాలంలో వీరి జీతభత్యాలు తగ్గించరాదు
    3. 1 మరియు 2 4. ఏదీకాదు
47. అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తుల పదవీకాలం?
    1. 9 సంవత్సరాలు 2. 10 సంవత్సరాలు 3. 5 సంవత్సరాలు 4. 6 సంవత్సరాలు
48. క్రింది వాటిలో న్యాయ సమీక్షకు అవకాశం లేని అంశాలను గుర్తించండి.
    1. కేంద్రమంత్రి మండలి రాష్ట్రపతికి సలహాలు ఇవ్వడం
    2. రెండవ షెడ్యూల్‌లో పేర్కొన్న జీతభత్యాలు
    3. పార్లమెంట్ కార్యక్రమాలు 4. పైవన్నీ
49. న్యాయమూర్తులను తొలగించే అభిశంసన తీర్మానాన్ని ముందు ఏ సభలో ప్రవేశ పెట్టాలి?
    1. లోక్‌సభ 2. రాజ్యసభ 3. లోక్‌సభ లేదా రాజ్యసభ 4. పై ఏదీకాదు
50. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ గారి నాన్నగారు అయిన వైవి చంద్రచూడ్ సుప్రీంకోర్టుకు ఎన్నవ ప్రధాన న్యాయమూర్తి?
    1. 13వ 2. 14వ 3. 15వ 4. 16వ

సమాధానాలు

1.4	2.4	3.3	4.4	5.1
6.2	7.3	8.3	9.1	10.2
11.2	12.3	13.4	14.4	15.3
16.2	17.3	18.3	19.4	20.4
21.2	22.1	23.1	24.2	25.3
26.4	27.1	28.1	29.4	30.3
31.3	32.1	33.4	34.1	35.1
36.1	37.2	38.1	39.2	40.3
41.1	42.3	43.4	44.2	45.1
46.2	47.1	48.4	49.3	50.4

పదోన్నతులకు టెట్ అర్హతపై ప్రభుత్వం పునరాలోచించాలి


జుర్రు నారాయణ యాదవ్
9494019270

"ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లుంది" విద్యా హక్కు చట్టం ఉపాధ్యాయ పదోన్నతులకు టెట్ తప్పనిసరి చేయటం.విద్యా హక్కు చట్టం, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్ సి టి ఈ)నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలంటే టెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి. ఈ విషయంపై టెట్లో అర్హత సాధించిన కొంతమంది ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుతం పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత సాధించాలని విద్యాశాఖ నిర్ణయించడంతో వేలాది మంది ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది. ఎప్పుడో 20, 25 సంవత్సరాల క్రితం పాఠశాల ఉపాధ్యాయులుగా నియమించబడ్డ వారు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందాలంటే ఈ వయసులో టెట్ రాసి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమౌతుందా?

ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం

ఉపాధ్యాయులు పదోన్నతి పొందాలంటే టెట్‌లో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలనే విద్యా శాఖ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే సుమారు 19వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేవలం 2012 డి ఎస్ సి,2017 టిఆర్‌టి ద్వారా నియామకమైన సుమారు 20వేల మంది ఉపాధ్యాయులకు మాత్రమే టెట్ అర్హత ఉంది. ఇప్పటికే సుమారు పది వేల మంది ఉపాధ్యాయులు టెట్ పాసై ఉండవచ్చు. మొత్తంగా 30 వేల మంది ఉపాధ్యాయులు మాత్రమే టెట్‌లో అర్హత కలిగి ఉన్నారు. సుమారు ఒక లక్ష మంది ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాయలేదు.టెట్ అర్హత నేపథ్యంలో పదోన్నతుల ప్రక్రియ వాయిదా వేయడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమౌతుంది. దాని వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు నష్టపోతారు. అలా అని టెట్ అర్హత గల వారితోనే పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తే సీనియర్ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయి, సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తూ పదోన్నతులు లేకుండానే రిటైర్డ్ అవుతారు.

విద్యాశాఖ తాత్సర్యం

ప్రధానోపాధ్యాయుల, ఇతర శాఖలలో పదోన్నతుల కోసం జీఓటి, ఈఓటి లాంటి శాఖాపరమైన పరీక్షలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు.అదే మాదిరి విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చినప్పటి(2010) నుంచే ఉపాధ్యాయ పదోన్నతులకు కూడా టెట్ తప్పనిసరి చేస్తూ అమలు చేసి ఉంటే ప్రారంభంలోనే ఉపాధ్యాయులు దానిపై దృష్టి పెట్టి పరీక్షలు రాసి పాస్ అయ్యి ఉండేవారు.2010లోనే ఎన్ సి టి ఇ ఈ నిబంధనలు అమలులోకి తెచ్చింది. 2012,2017 ఉపాధ్యాయ నియామకాల్లో ఈ నిబంధనలు అమలు చేసిన విద్యాశాఖ పదోన్నతిలో కూడా ఎందుకు అమలు చేయలేదు?. విద్యాహక్కు చట్టం ప్రకారం పదోన్నతిలో టెట్ తప్పనిసరి కావడంతో 2015 లోపు ఉత్తీర్ణులు కావాలని కేంద్రం గడువు ఇచ్చింది. అయినా ఆ దిశగా విద్యాశాఖ చర్యలు ఎందుకు తీసుకోలేదు?. కేంద్రం మరొక మారు ఐదు సంవత్సరాల గడువు పెంచుతూ 2019 వరకు ఉత్తీర్ణులు కావాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయినా అప్పుడెందుకు విద్యా శాఖ అమలు చేయలేదు?.

ఎన్ సి టి ఇ గెజిట్ నోటిఫికేషన్ 23-8-2010 పేరా 4 ప్రకారం అప్పటికే ఇన్ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అనుమతితో మినహాయింపు ఇవ్వవచ్చుGO MS no 36 dt 23-12-2015 ప్రకారం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వబడింది.కానీ ఇప్పుడు టెట్ ఉంటేనే పదోన్నతులకు అర్హులు అని నిర్ణయించడం ఎంతవరకు సమంజసం. గత తొమ్మిది సంవత్సరాలుగా పదోన్నతులు లేక నిరాశతో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైన ఈ సందర్భంగా టెట్ తప్పనిసరి అని నిర్ణయిస్తే వెంటనే వారు ఎలా అర్హత సాధిస్తారు?.ఈ చర్య వల్ల సుమారు దశాబ్ద కాలంగా పదోన్నతులకోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఉపాధ్యాయుల ఆశల్లో నీళ్లు చల్లినట్లు కాదా? 44 సంవత్సరాలు దాటిన వారికి టెట్ రాసే అర్హత లేదు. కాబట్టి



20,25 సంవత్సరాల సర్వీస్ ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు తమ సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్ట్‌ను ఎలా ప్రిపేర్ కాగలరు. టెట్ అర్హత లేకుండా పదోన్నతి ఇవ్వని పక్షంలో ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతి కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలి. సాధారణంగా నిర్వహించే టెట్‌లా కాకుండా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వారు బోధించబోయే సబ్జెక్టునీ, బోధన అనుభవాన్ని, బోధన మెలకువలను పరీక్షించే విధంగా సులభతరంగా ఉండేటట్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

సుమారు 20,25 సంవత్సరాలు ఉపాధ్యాయ వత్తిలో ఉన్న ఉపాధ్యాయులకు వారి బోధన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని,ఈ వయసులో వారికి ఉన్న బరువు, బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని 45 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు పదోన్నతిలో టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలి.

ప్రత్యేక టెట్ అవసరం

ప్రస్తుతం బిఈడి అభ్యర్థులు వ్రాస్తున్న టెట్‌లో ఉపాధ్యాయులు అర్హత సాధించడం కొంత కష్టం. ఎందుకంటే ఉపాధ్యాయులు పదోన్నతి పొందే సబ్జెక్టుల్లో తప్పనిసరిగా డిగ్రీ లేదా తత్సంబంధ అర్హత సాధించి ఉంటారు. కొందరైతే పీజీ అర్హత సాధించి ఉంటారు. టెట్‌లో ఆ సబ్జెక్టుల్లో ఎంత కఠినమైన ప్రశ్నలు అడిగిన సమాధానాలు వ్రాయగలరు. కాబట్టి సులభంగానే టెట్ పాస్ కాగలరు. కానీ బీఈడీ అభ్యర్థులు వ్రాస్తున్న టెట్‌లో అడుగుతున్న ప్రశ్నలు విచిత్రంగా ఉన్నాయి. సాంఘిక శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులకు టెట్‌లో తెలుగు పరిజ్ఞానాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. జీవశాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయులు టెట్లో గణిత సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది.గణిత శాస్త్ర పదోన్నతి కోసం అర్హత ఉన్న ఉపాధ్యాయుడు టెట్లో జీవ శాస్త్ర సంబంధ ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. 20,25 సంవత్సరాల సర్వీస్ ఉన్న సీనియర్ ఉపాధ్యాయులు ఇప్పుడు తమ సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్ట్‌ను ఎలా ప్రిపేర్ కాగలరు.టెట్ అర్హత లేకుండా పదోన్నతి ఇవ్వని పక్షంలో ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతి కోసం ప్రత్యేక టెట్ నిర్వహించాలి. సాధారణంగా నిర్వహించే టెట్‌లా కాకుండా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వారు బోధించబోయే సబ్జెక్టునీ, బోధన అనుభవాన్ని, బోధన మెలకువలను పరీక్షించే విధంగా సులభతరంగా ఉండేటట్లు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. ఇంకా అవసరమైతే జీ ఓ టి,ఈ ఓ టి మాదిరి చూసి రాసే పద్ధతిలో టెట్ నిర్వహించాలి.

పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి

పదోన్నతులకు టెట్ తప్పనిసరి అని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునర్ సమీక్షించాలి. కోర్టు తీర్పుల వలన మధ్యలో నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను కోర్టు ప్రత్యేక అనుమతితో నిర్వహించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కోర్టు అనుమతి ఇవ్వని పక్షంలో కనీసం పదోన్నతులు పొందిన తరువాత మూడు సంవత్సరాల లోపు టెట్ పాస్ కావాలనే షరతుపై పదోన్నతుల ప్రక్రియ కొనసాగించాలి.ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపంలో ఉన్నందున పదోన్నతుల తర్వాతనే కొత్త డీఎస్సీ నిర్వహిస్తే మెగా డీఎస్సీకి సాధ్యం అవుతుంది. కాబట్టి 2010 కన్నా ముందు ఉపాధ్యాయులుగా నియామకం అయిన వారికి టెట్ నిబంధన లేనందున ఉపాధ్యాయల పదోన్నతుల్లో కూడా టెట్ నిబంధన వర్తింపకుండా చట్టంలో ఉన్న మినహాయింపులను ఉపయోగించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభ్యర్ధనతో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు పదోన్నతిలో టెట్ అర్హత మినహాయింపుకు అనుమతి తీసుకోవాలి.లేదా టెట్ రాయడానికి అర్హత కూడా 44 సంవత్స రాలే కాబట్టి ప్రభుత్వం ఇన్ సర్వీస్‌లో ఉండి 45 సం"రాలు దాటిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేదా పదోన్నతుల ప్రక్రియను కొనసాగిస్తూ 3 సంవత్సరాల్లో అర్హత సాధించాలనే నిబంధన మేరకు పదోన్నతులు చేపట్టాలి. ప్రభుత్వం ఏదో ఒక పరిష్కారం ద్వారా ఇటు ఉపాధ్యాయులకు, అటు నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

'గ్రామీణ విద్యార్థులకు అందని ద్రాక్షగా ఐఐటీలు'


పాకాల శంకర్ గౌడ్
9848377734

ప్రపంచస్థాయి ఇంజనీరింగ్ సాంకేతిక విద్యకు చిరునామాగా భారతీయ ఐఐటీలు బాసిల్లుతున్నాయి. భవిష్యత్తు తరాలకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో భారతీయ ఐఐటీల పాత్ర ప్రముఖమైనది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకి సీఈఓలని దేశానికి రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలను, ఇంజనీర్లను, అధికారులను అందించిన ఘనత ఐఐటీలకే దక్కుతుంది.1940 సంవత్సరంలో నలిని రంజన్ సర్కార్ అధ్యక్షతన 22 మంది నిపుణులతో కూడిన కమిటీ భారత దేశవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇంజనీరింగ్ విద్యను విద్యార్థులకు అందించే విద్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. స్వాతంత్ర్యనంతరం 1950 మే 15 న దేశంలో మొట్టమొదటి ఐఐటి హిజ్లీ డిటెన్షన్ క్యాంప్ ఖరగ్పూర్, పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటు చేశారు. దీనిని భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 18 ఆగస్టు 1951లో ప్రారంభించారు.

నలిని రంజన్ సర్కార్ ప్రతిపాదన మేరకు దేశవ్యాప్తంగా నాలుగు ఐఐటీలను బాంబే, మద్రాస్, కాన్పూర్, ఢిల్లీలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 15 సెప్టెంబర్ 1956లో భారతదేశపు మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జాతి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రపంచస్థాయి విద్యాలయాలు దేశంలో ఏర్పాటు చేయాలని పార్లమెంటులో చర్చించి చట్టం చేశారు. మన ఐఐటీలలో చదివి ప్రపంచ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన వారిలో సుందర్ పిచాయ్, ఎన్ఆర్ నారాయణమూర్తి, సచిన్ బన్సాల్, పరాగ్ అగర్వాల్ అరవింద్ కృష్ణ రాజా సుబ్రహ్మణ్యం వంటి ప్రముఖులు, రాజకీయ నాయకుల్లో అజిత్ సింగ్ మనోహర్ పరికర్, జయరాం రమేష్ అలోక్ అగర్వాల్ జయంత్ సిన్హా అరవింద్ క్రేజీవాల్‌లు ఉన్నారు. ప్రస్తుతం భారతదేశంలో 23 ఐఐటీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఐఐటీ కౌన్సిల్ సారథ్యంలో ఇవి పనిచేస్తాయి. గత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో రూ. 9661.50 కోట్లను ఐఐటీల కోసం కేటాయించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఐఐటీలకు కేంద్ర బడ్జెట్లో అధికంగా నిధులు కేటాయించి పరిశోధన రంగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

ఈ ఐఐటీలలో కేవలం 17385 మంది విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసించే అవకాశం ఉంది. ప్రతిష్టాత్మకమైన ఈ ఐఐటీలలో చేరడానికి విద్యార్థులు ఐఐటి జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణతతో పాటు ఉన్నత మార్కులు సాధించాల్సి ఉంటుంది. భారతదేశంలో అత్యధిక మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారు. గత సంవత్సరం 11,13,325ల విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. దీన్నిబట్టి ఐఐటీలో సీట్ కోసం విద్యార్థుల మధ్య పోటీ ఏ స్థాయిలో ఉంటుందో అవగతమవుతుంది.దేశవ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల్లో అత్యంత కఠినమైన పోటీపరీక్షగా జేఈఈ అడ్వాన్స్ మెయిన్లను చెప్పుకోవచ్చు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన పరీక్షల్లో జేఈఈ అడ్వాన్స్ పోటీ పరీక్ష రెండవ స్థానంలో ఉండడం విశేషం. గత దశాబ్ద కాలంలో కేవలం 7 ఐఐటీలను మాత్రమే కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయడం గమనార్హం. జూన్ 2023లో భారత ప్రభుత్వము, టాంజానియా ప్రభుత్వం కలిసి భారతదేశం వెలుపల మొట్టమొదటి ఐఐటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది ఐఐటి మద్రాస్‌కు సాటిలైట్ క్యాంపస్‌గా ఉండనుంది.

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగి దేశంలో భారతదేశం గుర్తింపు పొందింది. అత్యధిక జనాభాకు సరిపడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలను అందించాల్సిన బాధ్యత ఐఐటీలపై ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఐఐటీలను పెంచాల్సిన ఆవశ్యకత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. భారతదేశంలో అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించడంలో ఐఐటీలు ప్రతిసారి ముందుంటున్నాయి. 2023 ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో అత్యున్నత ఇంజనీరింగ్ విద్యను అందించే కళాశాలల్లో మొదటి పది స్థానాల్లో 8 ఐఐటీలకే దక్కాయి. మొదటి మూడు ర్యాంకుల్లో ఐఐటి మద్రాస్, ఐఐటి బాంబే, ఐఐటి ఢిల్లీ ఉన్నాయి. ఐఐటి కాన్పూర్‌లో చదివిన విద్యార్థికి సంవత్సరానికి రూ. 4 కోట్ల జీతం వచ్చిందంటే ఐఐటి విద్యార్థులపై కార్పొరేట్ కంపెనీలకు ఉన్న ఆసక్తిని మనం అర్థం చేసుకోవచ్చు. ఐఐటీలలో చదివే విద్యార్థుల సరాసరి జీతం సంవత్సరానికి 30 నుండి 40 లక్షల వరకు ఉంటుంది. అందుకే ఐఐటీలకి అంత క్రేజీ.

గత కొన్ని సంవత్సరాలలో ఐఐటీల్లో చేరే విద్యార్థుల పరిశీలిస్తే 95శాతం మంది విద్యార్థులు కోచింగ్ తీసుకున్న వారు మాత్రమే ఐఐటీలలో చేరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులకి దేశంలోని అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షగా ఉంది. ఉన్నత వర్గాల పిల్లలకు మాత్రమే ఐఐటి విద్య అందుతుందనే విమర్శ కూడా ఉంది. కోచింగ్ సెంటర్లలో లక్షలు వెచ్చిస్తే గాని విద్యార్థులు ఐఐటీలలో చేరే అవకాశం లేదు. దేశవ్యాప్తంగా వేల సంఖ్యల్లో ఐఐటీ కోచింగ్ సెంటర్ వెలవడం వాటిలో విద్యార్థుల కోచింగ్ కోసం తల్లిదండ్రులు లక్షల్లో ఖర్చు చేయడం జరుగుతుంది. విద్యార్థుల పై మానసిక ఒత్తిడి కూడా అధికంగా ఉంటుంది. పేద విద్యార్థులకు ఐఐటీలలో చేరడం ఒక కలగానే మిగిలి పోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రభుత్వ ఆధీనంలోనే విద్యార్థులకు ఐఐటి జేఈఈ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి అత్యున్నత ప్రతిభగలిగిన విద్యార్థులకు అవకాశాలు కల్పించేలా చేయడం ఆవశ్యకం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు లబ్దిపొందే అవకాశముంది. సామాన్యులకు కూడా ఐఐటీలలో సీటు పొందే అవకాశముంది.



గత కొన్ని సంవత్సరాలలో ఐఐటీల్లో చేరే విద్యార్థుల పరిశీలిస్తే 95శాతం మంది విద్యార్థులు కోచింగ్ తీసుకున్న వారు మాత్రమే ఐఐటీలలో చేరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువు కుంటున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులకి దేశంలోని అత్యంత నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య అందని ద్రాక్షగా ఉంది. ఉన్నత వర్గాల పిల్లలకు మాత్రమే ఐఐటి విద్య అందుతుందనే విమర్శ కూడా ఉంది.

1953 నుండి ఇప్పటివరకు భారతదేశంలోని ఐఐటీలలో చదివిన వారు దాదాపుగా 25 వేల మంది అమెరికాలో స్థిరపడ్డారని సమాచారం. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం మీద వలస జరుగుతుంది. భవిష్యత్ భారత్ ప్రపంచంలోనే అత్యున్నత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలంటే ఈ మేధో వలసల్ని నివారించాల్సి ఉంది. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్ రీసెర్చ్ -2023 ప్రకారం మొదటి 100 మంది టాప్ ర్యాంకర్లలో 62 శాతం, 1000 ర్యాంకర్లలోపు 36శాతం మంది వేరే దేశాలకు వలస వెళుతున్నారు. భారతదేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన ఐఐటీలను ఏర్పాటు చేయాలి. మేధో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి కమిటీ ఐఐటి కౌన్సిల్, యుజిసి చైర్మన్, ఐఎస్ఐఆర్ చైర్మన్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో ఏర్పాటు చేసి చర్చలు తీసుకోవాలి.